

వెలిగొండ మొదటి టన్నెల్ (ఫైల్)

'వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు అత్యవసరంగా పునరావాసం కల్పించాలి. ఒంగోలు డెయిరీని పునరుద్ధరించాలి. తక్షణ అవసరాల కింద రానున్న వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ఏకేయూ వర్సిటీ, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు చేపట్టాలి..' ఇలా పలు కీలక అంశాలను అమరావతిలోని సచివాలయంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ అన్సారియా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వచ్చే సీజన్‌లో సాగర్ కాలువలకు నీరు విడుదల చేసేలోపు అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. అందుకోసం నిధులను మంజూరు చేయాలని కోరారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకించి పశ్చిమంలో ఇప్పటికే తాగునీటి సమస్య ఉందని రానున్న రోజుల్లో అది మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉందని చెప్పారు. ఉపాధి అవకాశాల పెంపు, మౌలిక సదుపాయాల వృద్ధికి సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలను ప్రస్తావించారు.

పునరావాసం కీలకం

- వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయాలి
- ఒంగోలు డెయిరీని పునరుద్ధరించాలి



- యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు.. వేసవి తాగునీటి అవసరాలకు నిధులు
- కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం దృష్టికి కీలక అంశాలను తీసుకెళ్లిన అన్సారియా

వెలిగొండకు నిధులు ఇవ్వాలి

వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి ప్రధాన ప్రతిబంధకంగా ఉన్న నిర్వాసితుల పునరావాసం విషయాన్ని ప్రత్యేకంగా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టు పరిధిలో గతంలో గుర్తించిన దాని ప్రకారం 7,321 నిర్వాసిత కుటుంబాలు ఉండగా 96ను మాత్రమే అక్కడి నుంచి తరలించారన్నారు. మరో 640 కుటుంబాల తరలింపు ప్రక్రియ పురోగతిలో ఉందన్నారు. మొత్తం నిర్వాసితుల కుటుంబాలను 2026 నాటికి తరలించాల్సి ఉందన్న కలెక్టర్.. వారికి నష్టపరిహారం చెల్లింపు, పునరావాస కల్పనకు ప్రాధాన్యత క్రమంలో నిధులు ఇవ్వాలని కోరారు.


మూతపడి ఉన్న ఒంగోలు డెయిరీ

ఒంగోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తక్షణ సమస్యలు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు కీలక అభివృద్ధి అంశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ల సమీక్షా సమావేశం జరిగింది. ఆ సమావేశానికి హాజరైన కలెక్టర్ అన్సారియా జిల్లాలో ఆయా ప్రభుత్వ పథకాల అమలు పురోగతి, అభివృద్ధి లక్ష్యాలు, వాటి సాధన మార్గాలపై నివేదికలను ఇచ్చారు. బుధవారం సాయంత్రం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా పలు కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో 14 మండలాల్లోని 230 ఆవాసాలలో నీటి ఎద్దడి వస్తుందని యంత్రాంగం గుర్తించిందన్నారు. ఆ ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.11.20 కోట్ల మేర నిధులు అవసరమని ప్రభుత్వానికి తెలిపారు. ఐదేళ్లుగా కనీస నిర్వహణ పనులను కూడా జిల్లాలోని సాగర్ కాలువల్లో చేపట్టక పెద్దఎత్తున చిల్లచెట్లు పెరిగాయన్నారు. పూడిక పేరుకుపోవడంతో నీటి సరఫరా సజావుగా లేదన్నారు. దాని వల్ల

మిగతా 6వ పేజీలో

రూ.65,543 కోట్ల స్థూల ఉత్పత్తి లక్ష్యం

- వచ్చే ఏడాది 16.48శాతం వృద్ధితో కార్యాచరణ
- ప్రణాళికను ప్రభుత్వానికి నివేదించిన కలెక్టర్
- వ్యవసాయ అనుబంధ, సేవా రంగాల ద్వారా ఇంచుమించు సమాన రాబడి
- తలసరి ఆదాయం రూ.2.36 లక్షలు
- గతేడాది కన్నా 16.18శాతం పెంపు

6



పాఠశాలల్లో వాటర్ బెల్

ప్రతి రోజూ మూడు సార్లు

వేసవి నేపథ్యంలో ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు విద్య, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా కనీసం మూడుసార్లు పాఠశాలల్లో మంచినీరు తాగేందుకు వీలుగా ప్రభుత్వం వినూత్నంగా వాటర్‌బెల్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈమేరకు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల్లో ప్రతిరోజూ ఉదయం 10, 11, 12 గంటలకు పిల్లలు మంచినీళ్లు తాగేందుకు వీలుగా మూడుసార్లు ప్రత్యేకంగా బెల్ కొడతారు. తరగతుల ప్రారంభం, ముగిసిన తర్వాత కొట్టే బెల్‌కు భిన్నంగా 15 సెకండ్లు కొత్త శబ్దంతో దీన్ని కొడతారు. ఇది మోగగానే తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠం చెప్పడం ఆపేసి పిల్లలు మంచినీరు తాగేందుకు అవకాశం ఇవ్వాలి. అలాగే మంచినీళ్లు తాగమని ప్రోత్సహించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.


వృత్తి విద్య తరగతులకు హాజరైన విద్యార్థినులు

బంగారు భవిష్యత్ దిశగా..

- బడి మానిన బాలికలకు బల్లికురవ కేజీబీవీలో చదువుతో పాటు వృత్తి శిక్షణలు
- 6 నుంచి ఇంటర్ వరకూ రోజూ ప్రత్యేక తరగతులు
- అల్లికలు, కుట్టు మిషన్, కరాటే, ఎంబ్రాయిడింగ్ వర్కులపై క్లాసులు
- మనోధైర్యం వచ్చేలా కరాటే క్లాసుల నిర్వహణ
- ప్రస్తుతం 250 మందికి రోజు వారీ ట్రైనింగ్

7

పంచాయతీలకు ట్రాక్టర్లు

- చెత్త తరలింపునకు మూడు డివిజన్లకు 98 కేటాయింపు
- రెండు వేల జనాభా ప్రాతిపదిక
- నేడు కొండపిలో లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి స్వామి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను మంజూరు చేసింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను తరలించేందుకు వీటిని వినియోగించాల్సి ఉంది. 2వేల జనాభా ఉన్న ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున కేటాయించింది. జిల్లాకు మొత్తం 114 ట్రాక్టర్లు మంజూరు చేయగా తొలివిడతగా 98 పంచాయతీలకు పంపించారు. ఒంగోలు డివిజన్‌కు 35, కనిగిరి డివిజన్‌కు 35, మార్కాపురం డివిజన్‌కు 28 ట్రాక్టర్లను కేటాయించారు. వీటిని నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి గురువారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లో సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకున్న విషయం విదితమే. ఇప్పటివరకు చిన్న వాహనాల్లో మాత్రమే సేకరిస్తూ వస్తున్నారు. ఇప్పుడు జనాభా అధికంగా ఉన్న గ్రామాలకు ట్రాక్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా అవి శుభ్రంగా ఉండటంతోపాటు ఏరోజుకారోజు గ్రామంలోని చెత్తను తరలించేందుకు దోహదపడనున్నాయి.


కొండపి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉంచిన ట్రాక్టర్లు

నేటి నుంచి శ్రీశైలానికి 24గంటలు అనుమతులు

- ఉగాది సందర్భంగా భక్తుల కోసం నిర్ణయం
- అటవీశాఖ రేంజ్ అధికారి జీవన్‌కుమార్

నాన్ క్యాడర్ ఎస్పీగా అశోక్‌బాబు

ఏఆర్ అదనపు ఎస్పీకి ఉద్యోగోన్నతి

వివరాలు 6వ పేజీలో


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు శరవేగంగా ఏర్పాట్లు

- ముళ్లచెట్ల తొలగింపు.. భూమి చదును
- రోడ్డు నిర్మాణం పూర్తి
- విద్యుత్ లైన్ ఏర్పాటు
- నిత్యం పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పీసీపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీలో వచ్చే నెల 2వతేదీన జరగనున్న రిలయన్స్ కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం రిలయన్స్‌కు కేటాయించిన 475.57ఎకరాలలో ముళ్లపొదల తొలగింపుతోపాటు భూమిని చదును చేశారు. పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో మురుగుమ్మి నుంచి బయోగ్యాస్ భూమి వరకూ ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణం పూర్తయింది. విద్యుత్‌లైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే స్తంభాలు పాతారు. ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పర్యవేక్షణలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నాలుగు రోజులుగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అక్కడే ఉంటున్న ఎమ్మెల్యే ఉగ్ర సంబంధిత శాఖల అధికారులకు సూచనలు ఇస్తూ పనులు చేయిస్తున్నారు. బుధవారం ఆయన సభావేదిక, హెలిప్యాడ్‌లను ఏర్పాటు చేసే ప్రాంతాలను అధికారుల ద్వారా మార్కింగ్ గీయించారు. గురువారం నాటికి పనులన్నీ పూర్తిచేయించాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట రిలయన్స్ కాంట్రాక్టర్ బత్తిన రాధాకృష్ణ, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, విద్యుత్ ఈఈ ఉమాకాంత్, ఏఈ లక్ష్మీరాజేష్, పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ తిరుపాలయ్య, వివిధశాఖల అధికారులతోపాటు నాయకులు యారవ శ్రీనివాసులు, వీరపనేని పెద్దన్న, ఏనుగంటి చిన్నా, కృష్ణారెడ్డి, చినబ్రహ్మయ్య, ప్రసాదు తదితరులు ఉన్నారు.

'గ్రానైట్' ఆక్రమణలపై కదిలిన యంత్రాంగం

- విలువైన ప్రభుత్వ భూముల్లో డంప్‌లు ఏర్పాటు చేసిన యజమానులు
- తనిఖీలకు సిద్ధమైన రెవెన్యూ, మైన్స్ అధికారులు

ఒంగోలు క్రైం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గెలాక్సీ గ్రానైట్ ఉన్న ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జా చేశారు. క్వారీల యజమానులు ఆయా భూములను లీజుల పేరుతో సొంతం చేసుకున్నారు. అదేక్రమంలో కొందరు వాటిలో డంప్‌లు పోసుకుంటున్నారు. ఇలా అన్యాక్రాంతమైన భూముల విషయంలో ఎట్టకేలకు యంత్రాంగం కదిలింది. పరిశీలనకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు సిద్ధమయ్యారు. దీంతో ఆయావర్గాల్లో ఆందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే.. దాదాపుగా 1980 నుంచి చీమకుర్తి, ఆర్‌ఎల్‌పురం, బూదవాడలలో గ్రానైట్ పరిశ్రమ ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రభుత్వ భూముల కబ్జా పర్వం కొనసాగుతోంది. ఏళ్ల తరబడి ఆక్రమణలు జరుగుతున్నా అటువైపు అధికారులు కన్నెతి చూడటం లేదు. ఏదైనా పైస్థాయి నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పుడు కొద్దిరోజులు హడావుడి చేసి ఆతర్వాత వదిలేస్తున్నారు. అధికారుల అలసత్వం కారణంగా క్వారీల హద్దులు కూడా సక్రమంగా నిర్ణయించలేకపోతున్నారు. గ్రానైట్ క్వారీలు నిర్వహించే భూముల్లో ఎక్కువ అసైన్‌మెంట్‌వి ఉండటం గమనార్హం. లీజుల పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి వాటిని క్వారీ యజమానులు సొంతం చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల సమాచార హక్కు కార్యకర్త దాఖలు చేసిన ఫిర్యాదుపై ఉన్నతాధికారులు స్పందించారు. ముఖ్యంగా చీమకుర్తి సర్వే నంబరు 584/2లో ప్రభుత్వ భూమిని క్వారీ యజమానులు ఆక్రమించుకున్నారని స్పష్టమైన ఫిర్యాదుతో కదలిక వచ్చింది. ఆ భూమిని ఆక్రమించిన క్వారీ యజమానులకు నోటీసులు జారీచేశారు. జిల్లా గనులు, భూగర్భశాఖ, రెవెన్యూ యంత్రాంగం కలిసి గ్రానైట్ క్వారీలలో సంయుక్త తనిఖీలు చేసేందుకు నిర్ణయించారు. మంగళవారం తనిఖీలు చేసేందుకు సిద్ధమైన యంత్రాంగం ఎందుకో ఆగిపోయింది. మరి ఇవి ఎప్పుడు జరుగుతాయో ఉన్నతాధికారులకే తెలియాల్సి ఉంది.



ఏపీఎండీసీ.. ఆదాయం దిశగా అడుగులేసి..

- అన్ని లీజులు పునరుద్ధరించే యోచన
- మైనింగ్ నిలిపివేసిన భూముల్లో నూతన టెండర్లు ఖరారు
- 14.17హెక్టార్లలో క్వారీయింగ్‌కు నేడు ప్రజాభిప్రాయ సేకరణ

7

పది పరీక్షలపై రాష్ట్ర అధికారులు దృష్టి

- జిల్లాలోని పలు కేంద్రాల తనిఖీ

ఒంగోలు విద్య, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కొన్ని కేంద్రాల్లో కాపీయింగ్ జరుగుతున్నదన్న ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి బుధవారం జిల్లాకు వచ్చారు. దర్శిలోని ఏపీ మోడల్ స్కూల్, ముండ్లమూరు జడ్పీ హైస్కూల్‌లోని కేంద్రాలను సందర్శించారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకులు, విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఏవీ.సుబ్బారెడ్డి కనిగిరిలోని ఏడు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ సంతనూతలపాడులో రెండు, చీమకుర్తిలో ఒక కేంద్రాన్ని సందర్శించారు. సోమవారం చీమకుర్తిలోని ఒక పరీక్షా కేంద్రంలో విధి నిర్వహణలో నిద్రపోతున్నట్లు గుర్తించిన చీఫ్‌ను తొలగించారు. ఆయన స్థానంలో అక్కడి డిపార్ట్‌మెంట్ అధికారిని చీఫ్‌గా మార్చి కొత్తవారిని డీవోగా నియమించారు. బుధవారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 232 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



ఏపీ ఐసెట్ నోటిఫికేషన్

ఒంగోలు విద్య, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 2025-26 సంవత్సరంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీఐసెట్-25 నోటిఫికేషన్‌ను కన్వీనర్ ఎం.శశి బుధవారం విడుదల చేశారు. ఏప్రిల్ 9 వరకు ఆన్‌లైన్‌విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. అపరాధరుసుంతో ఏప్రిల్ 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల్లో తప్పులు సవరణకు వచ్చేనెల 29,30 తేదీల్లో అవకాశం ఇచ్చారు. అభ్యర్థులు మే 3వ తేదీ నుంచి హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 7న ఐసెట్ పరీక్ష జరుగుతుందని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఎయిడెడ్ నియామక కంప్యూటర్ టెస్ట్ నిలిపివేత

ఒంగోలు విద్య, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించతలపెట్టిన కంప్యూటర్ పరీక్షను నిలిపివేసినట్లు డీఈవో ఎ.కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని ఏబీఎం, ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ, చీరాల రామకృష్ణాపురం ఎంఎస్ హైస్కూళ్లలో ఖాళీ పోస్టులను భర్తీచేసేందుకు ఈనెల 29న కంప్యూటర్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు మొదట ప్రకటించారు. తాజాగా అనివార్య కారణాల వల్ల ఆ కంప్యూటర్ పరీక్షను నిలిపివేసినట్లు ఆయన వెల్లడించారు.

గిద్దలూరు ఎంఈవో-2గా నాగభూషణరెడ్డి

ఒంగోలు విద్య, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ఎంఈవో-2గా గిద్దలూరు జడ్పీ బాలికల హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పి.నాగభూషణరెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంఈవో-2గా పనిచేసిన హెచ్‌ఎం రిటైర్డ్ కావడంతో ఆ స్థానంలో నాగభూషణరెడ్డిని నియమించారు.

పంచాయతీ కార్యదర్శిపై దౌర్జన్యం.. కేసు నమోదు

ఒంగోలు(రూరల్), మార్చి26(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం వలేటివారిపాలెం సర్పంచ్ నల్లమోతు ఉషారాణి భర్త రాఘవపై గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.గురువర్ధిని బుధవారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఇందుకు గల కారణాలను వెల్లడించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, వార్డు సభ్యులతో మంగళవారం సమావేశం జరుగుతుండగా అనధికారికంగా నల్లమోతు రాఘవ వచ్చి సర్పంచ్ పక్కన కుర్చీలో కూర్చున్నారు. దీనిపై కార్యదర్శి అభ్యంతరం చెప్పడంతో రాఘవ ఆగ్రహంతో బయటకు వెళ్లారు. సమావేశం అనంతరం కార్యదర్శిని పక్కకు నెట్టి తీర్మానాల పుస్తకం, ఇతర రికార్డులను రాఘవ బలవంతంగా లాగేసుకుని తన భార్య సర్పంచ్‌కి ఇచ్చారు. ఈక్రమంలో కార్యదర్శి గోడ తగిలి కిందపడి స్పృహ తప్పి పడిపోయారు. ఈ విషయంపై ఒంగోలు ఎంపీడీవో, ఈవోఆర్డీ, తాలూకా పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి వెల్లడించారు. అనంతరం రికార్డులున్న గదికి రాఘవ తాళం వేసి వెళ్లిపోయారని ఫిర్యాదులో పేర్కొంది.

నేటి నుంచి శ్రీశైలానికి 24గంటలు అనుమతులు

పెద్దదోర్నాల, మార్చి26 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 31వ తేదీ వరకు నల్లమల అటవీ ప్రాంతం నుంచి శ్రీశైలానికి 24గంటల పాటు వాహనాల రాకపోకలకు అనుమతులు ఇచ్చినట్లు అటవీశాఖ రేంజి అధికారి జీవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం వాహనాల రాకపోకలకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా వన్యప్రాణుల స్వేచ్ఛకు విఘాతం కలుగకుండా ఉండేందుకు రాత్రి గం.9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు శ్రీశైలం ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలు నిషిద్ధం ఉంది.

కుటుంబ కలహాలతో భర్త బలవన్మరణం

తోటవారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు తారస్థాయికి చేరడంతో భర్త బలవన్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని తోటవారిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట శివారెడ్డి(35)కు చెరుకుపల్లి వద్ద రాజోలుకు చెందిన నాగదేవతతో సుమారు 12 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. అయితే ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు చెలరేగడంతో ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మంగళవారం భార్య వద్దకు వెళ్లి కాపురానికి రమ్మని కోరగా ఆమె నిరాకరించడంతో బుధవారం మనస్థాపం చెంది ఇంట్లోనేఉరికి పాల్పడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరికి 9, 6 సంవత్సరాల పాప, బాబు సంతానం.

రూ.65,543 కోట్ల స్థూల ఉత్పత్తే లక్ష్యం

వచ్చే ఏడాది 16.48శాతం వృద్ధితో కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వానికి నివేదించిన కలెక్టర్
వ్యవసాయ అనుబంధ, సేవా రంగాల ద్వారా ఇంచుమించు సమాన రాబడి
తలసరి ఆదాయం రూ.2.36 లక్షలు
గతేడాది కన్నా 16.18శాతం పెంపు

ఒంగోలు మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరం(2025-26)కు జిల్లాలో 16.48శాతం వృద్ధితో రూ.65,543 కోట్ల స్థూల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. తద్వారా 16.18శాతం వృద్ధితో తలసరి ఆదాయం రూ.2,36,741 ఉండనుందని చెప్పారు. ఆ మేరకు వచ్చే ఏడాది ఆయా రంగాల వారీ కార్యచరణ ప్రణాళికను రెండు రోజులపాటు అమరావతిలోని సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. విజన్-2029 ప్రణాళికలను ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా స్థాయిలో రూపొందించిన విషయం తెలిసిందే. అందులోభాగంగా ఆయా జిల్లాల్లో ఉన్న వనరులు, మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఏటా అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కలెక్టర్ల సమావేశంలో 2025-26 వార్షిక ప్రణాళికలను సమగ్ర కార్యాచరణతో నివేదించాలని సూచించింది. తదనుగుణంగా ఆయా కీలక రంగాల ప్రస్తుత పరిస్థితి, వాటిలో పలు చర్యలు తీసుకోవడం ద్వారా ఉత్పత్తి పెంపు తద్వారా జిల్లా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం పెరుగుదలపై ఈ సమావేశంలో కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి నివేదించారు.

వ్యవసాయ అనుబంధ రంగాలే ప్రధానం

ప్రస్తుత ఏడాది(2024-25) జిల్లా స్థూల ఉత్పత్తి రూ.56,271 కోట్లుగా అంచనా వేయగా అది అంతకు ముందు ఏడాది కన్నా 10.46శాతం అధికంగా ఉందన్నారు. కాగా రానున్న ఏడాది 16.48శాతం వృద్ధితో రూ.65,543 లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆయా రంగాల వారీగా పరిశీలిస్తే మొత్తం రూ.65,543 కోట్ల స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం, అనుబంధ రంగాల ద్వారా 40.79శాతంతో రూ.24,544 కోట్లు రాబడి అంచనా వేస్తుండగా పారిశ్రామిక రంగం ద్వారా 18.07శాతంతో రూ.10,873 కోట్లు,



సేవా రంగం ద్వారా 41.14శాతంతో రూ.24,755 కోట్ల మేర రాబడి అంచనా వేశారు. వ్యవసాయ అనుబంధ అలాగే సేవారంగాల ద్వారా ఇంచుమించుగా ఒకే స్థాయిలో రాబడి ఉండవచ్చని అంచనా వేశారు. కాగా కలెక్టర్ ప్రభుత్వానికి అందించిన నివేదికను పరిశీలిస్తే ప్రధాన రంగాల అంచనాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాలను పరిశీలిస్తే వ్యవసాయ పంటల ద్వారా రూ.4,353 కోట్ల రాబడి అంచనా వేయగా పశుసంవర్ధకశాఖ పరిధిలోని పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తి ద్వారా రూ.9,765 కోట్లు, ఉద్యాన పంటల ద్వారా రూ. 6,487 కోట్లు, అటవీ శాఖ ద్వారా రూ.1,020 కోట్లు అంచనా వేశారు.

రంగం	స్థూల ఉత్పత్తిలో వాటా(కోట్లలో)	గతేడాది కన్నా పెరుగుదల శాతం
వ్యవసాయ అనుబంధ రంగాలు	24,544	40.79
పారిశ్రామిక రంగం	10,873	18.07
సేవా రంగం	24,755	41.14
మొత్తం	65,543	100శాతం

సేవలది కీలకమే..

పారిశ్రామిక రంగం ద్వారా మొత్తం రూ.10,873 కోట్లు అంచనా వేస్తుండగా అందులో మైనింగ్ ద్వారా రూ.1,200 కోట్లు, పారిశ్రామిక ఉత్పత్తుల ద్వారా రూ.3,948కోట్లు, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా ద్వారా రూ.1,223కోట్లు, పారిశ్రామిక నిర్మాణ రంగం ద్వారా రూ.4,502 కోట్లు అంచనా వేశారు. ఇక సేవా రంగాన్ని కీలక రంగంగా నివేదికలో ప్రస్తావించారు. ఈ రంగం ద్వారా రూ.24,755 కోట్లు అంచనా వేయగా అందులో అత్యధికంగా నివాసిత గృహ నిర్మాణాలు, స్థలాల ద్వారా రూ.6,611 కోట్ల మేర రాబడి ఉంటుందని అంచనా వేశారు. మిగిలిన వాటిలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో రూ.5,567 కోట్లు, బ్యాంకింగ్, బీమా రంగాలలో రూ.3,050 కోట్లు, రవాణా ఇతర రంగాల్లో రూ.4,085 కోట్లు. హోటళ్లు, రెస్టారెంట్ల ద్వారా రూ.1,576 కోట్లు, రైల్వే, ఇతర కమ్యూనికేషన్ రంగాల ద్వారా రూ.1,200 కోట్లు అంచనా వేశారు. కీలక రంగాలు, స్థూల ఆదాయంలో వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

కార్యకర్తలకు పిలుపు నిచ్చిన ఎమ్మెల్యే

కొమరోలు, మార్చి26(ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కూటమి సభ్యులే దక్కించుకునేందుకు ప్రతి కార్యకర్త సంసిద్ధం కావాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక స్టేట్ బ్యాంకు సమీపంలోని ఎమ్మెల్యే స్వగృహంలో 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా టీడీపీ మండల నాయకులు, కార్యాకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యాకర్త అధినేతే అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అన్ని స్థానాల్లో టీడీపీ కైవసం చేసుకోవాలన్నారు. కార్యాకర్తలు ఐక్యంగా ఉండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఎన్‌డీఏ కూటమి కార్యకర్తలను, నాయకులను కలుపుకొని గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రతి గ్రామం, పంచాయతీల్లో ఈనెల 29న టీడీపీ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా జెండా ఎగరవేయాలన్నారు. మండలంలో బూత్ ఇన్‌చార్జులను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి 60 ఓటర్లకు ఇద్దరు కేఎస్ఎస్ సభ్యులను వెంటనే ఎన్నుకొని పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. గతంలో పార్టీ సభ్యత్వం చేసిన వారికి ఆయా గ్రామాలకుచెందిన కార్యాకర్తలు ఐడీకార్డు, ట్యాగులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంటకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు తిరుమలరెడ్డి, నాయకులు పులకుర్తి వెంకటేశ్వర్లు, చలిచీమల శ్రీనివాసచౌదరి, కృష్ణమోహన్‌రెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, రవీంద్రారెడ్డి, మద్దిలేటి, ఖాజావలి, అనపా వీరశేఖర్, జ్యోతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోడి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బీపీసీఎల్ పైపులైన్ పనులను అడ్డుకున్న రైతులు

- **రూ.-కోట్ల విలువ చేసే భూముల్లో పైపులైన్ వేయడంపై ఆగ్రహం**

సంతనూతలపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని పేర్నమిట్టలో బీపీసీఎల్ పైపులైన్‌ను బుధవారం రైతులు అడ్డుకున్నారు. బీపీసీఎల్ ప్రతినిధులు గతంలో రైతుల ప్రమేయం లేకుండా విలువైన భూముల్లో పైపులైన్‌ను వేస్తుండటంతో నాలుగు నెలల క్రితం పేర్నమిట్ట రైతులు అడ్డుకున్నారు. అనంతరం నాడు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దృష్టికి వెళ్లారు. వెంటనే కలెక్టర్ ఆదేశాలతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన పేర్నమిట్ట రైతులు, స్థానిక నాయకులు, బీపీసీఎల్ ప్రతినిధులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా పైపులైన్ రోడ్డు వెంట వేయాలని, పైపులైన్‌ను కార్పొరేషన్ పరిధిలోని రూ.కోట్ల విలువైన కన్వర్షన్ భూముల్లో కాకుండా, తక్కువ విలువ కలిగిన భూముల్లో వేయాలని రైతులు, నాయకులు తెలిపారు. రైతులు చెప్పిన విధంగా పైపులైన్ ఏర్పాటు చేస్తామని బీపీఎల్ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. అయితే ఆ సంస్థ ప్రతినిధులు మరలా తమ ఇష్టారీతిని విలువైన భూముల్లో పైపులైన్ వేస్తుండటంతో బుధవారం రైతులు అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వారిని కలెక్టర్ ను కలవాలని, తాను కూడా సమస్యను కలెక్టర్‌కు వివరిస్తానని హామీ ఇచ్చారు.



పైపులైన్ పనులను అడ్డుకుంటున్న రైతులు

పునరావాసం కీలకం

(5వ పేజీ తరువాయి)

దిగువకు నీటి సరఫరా సరిగా జరగక ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. వచ్చే సీజన్‌లో తిరిగి సాగర్ కాలువలకు నీటిని ఇచ్చే లోపు ఆ కాలువల్లో కనీస పనులు చేయాల్సి ఉందన్నారు. అందుకోసం రూ.9.83కోట్లు నిధులు విడుదల చేయాలని కోరారు.

పాడి పరిశ్రమను బలోపేతం చేయాలి

ఒంగోలు డెయిరీ మూతపడిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దానిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పాడిపరిశ్రమ బలోపేతానికి తద్వారా గ్రామీణ పశుపోషణ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి డెయిరీ పునరుద్ధరణ కీలకం కానుందన్నారు. జిల్లాలో పెద్ద విద్యా సంస్థలుగా ఉన్న కీలకమైన ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీల భవన నిర్మాణాలు, సిబ్బంది నియామకాల అవసరాన్ని ఈ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఒంగోలులో ఆంధ్రకేసరి యూనివర్సిటీ సరైన వసతులు లేకుండా నడుస్తున్నదన్నారు. భవన నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన.. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మూడు క్యాంపస్‌లలో విద్యార్థులు

ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కలెక్టర్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం ఒంగోలు ట్రిపుల్ ఐటీ మూడు క్యాంపస్‌లలో నడుస్తున్నదన్నారు. ఈ సంస్థ విద్యార్థులలో 2,200 మంది కడప జిల్లాలోని ఆర్‌కే వ్యాలీలో, 3వేల మంది ఒంగోలు కర్నూలు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్‌లో, మరో 1,400 మంది రావ్ అండ్ నాయుడు కాలేజీ క్యాంపస్‌లో చదువుకుంటున్నారన్నారు. క్యాంపస్‌ల నిర్మాణం జరగక ఈ పరిస్థితి నెలకొన్నదన్న కలెక్టర్.. నిధులు ఇచ్చి నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

చెత్త సమస్య నుంచి విముక్తి





గ్రామానికి నలుచెరుగులా కొండల్లా పేరుకుపోయిన వైనం
ఐదేళ్లుగా కొండపి ప్రజల ఇక్కట్లు

వైసీపీ ఐదేళ్ల పాలనలో కొండపి ప్రజలు చెత్త సమస్యతో అనేక ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రానికి నలుచెరుగులా వ్యర్థాలను డంప్ చేయడంతో దుర్గంధం వెదజల్లుతుండేది. ముఖ్యంగా జాళ్లపాలెం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెత్తకుప్పలు కొండల్లా కన్పించేవి. అక్కడ పెద్ద సంఖ్యలో పందులు చేరేవి. అవి అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో అనేక మంది ప్రమాదాల బారినపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్య పరిష్కారంపై స్థానిక ఎమ్మెల్యే అయిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీ అధికారులకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. రంగంలోకి దిగిన కార్యదర్శి జాళ్లపాలెం రోడ్డులో పేరుకుపోయిన చెత్తను ఎక్స్‌కవేటర్, టిప్పర్‌లతో దాదాపు 150 ట్రిప్పులు చెత్త సంపద కేంద్రానికి తరలించారు. దీంతో ఇప్పుడు జాళ్లపాలెం రోడ్డులో వెళ్లే వాహనదారులు, పరిసరప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్రమంగా కొండపికి నాలుగు వైపులా ఉన్న చెత్తను పూర్తిగా తొలగిస్తామని, తిరిగి చెత్త వేసే వారికి అపరాధ రుసుం విధిస్తామని పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్ తెలిపారు. రోజువారీ చెత్తను ఇళ్ల నుంచి సేకరించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తామని చెప్పారు.

కొండపి, ఆంధ్రజ్యోతి

అవీఇవీ

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు

- ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, మార్చి26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరుగుతున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిచేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. మార్కాపురం, త్రిపురాంతకం ఎంపీపీలు, పుల్లల చెరువు వైస్ ఎంపీపీ ఎన్నికలతో పాటు కో ఆప్టెడ్ మెంబర్ల ఎన్నికలు జరుగుతున్నాయని, అందుకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే 30 పోలీసు చట్టం అమలులో ఉందని, 144 సెక్షన్ విధిచినట్లు ఆయన చెప్పారు. అంతేకాకుండా మార్కాపురం ఎంపీపీ ఎన్నికలకు మార్కాపురం సీఐ, త్రిపురాంతకం మండలానికి దర్శి డీఎస్పీ, పుల్లలచెరువులో జరిగే ఎన్నికలకు మార్కాపురం డీఎస్పీలను ఇన్‌చార్జిలుగా నియమించి భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా ఉప సర్పచ్‌ల ఎన్నికలు జరిగే ప్రాంతాలలో సంబంధిత ఎస్ఐలకు బాధ్యతలు అప్పగించామన్నారు. అంతేకాకుండా నిరంతరం సీసీ కెమెరాలు, డ్రోన్‌ల సహకారంతో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా 100, 112 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

నాన్ క్యాడర్ ఎస్పీగా అశోక్‌బాబు



ఒంగోలు క్రైం, మార్చి26(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో ఏఆర్ ఎస్ఐగా చేరి నాన్ క్యాడర్ ఎస్పీగా ఎంఎస్ఎస్.అశోక్‌బాబు ఉద్యోగోన్నతి పొందారు. 1991లో ఆర్ ఎస్ఐగా పోలీస్‌శాఖలో చేరిన ఆయన వివిధ హోదాలలో పని చేశారు. ఒంగోలు డీటీసీలో డీఎస్పీ హోదాలో వైస్ ప్రిన్సిపాల్‌గా, 2015 నుంచి 2021 సంవత్సరం వరకు రాష్ట్ర ఐఎస్‌డబ్ల్యూగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఒంగోలులో ఏఆర్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న అశోక్‌బాబు నాన్‌క్యాడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. పోలీస్‌శాఖలో అనేక అవార్డులు అందుకున్నారు. అత్యున్నత సేవా పథకం-2025కు ఆయన ఎంపికయ్యారు.

ఆక్వా రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తా

- ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు, పక్కన డీఈ హరిబాబు

ఒంగోలు నగరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ట్రాన్స్‌కో ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒంగోలులోని తన చాంబర్‌లో తీర ప్రాంత మండలాల్లోని ట్రాన్స్‌కో డీఈలు, ఏఈలు, జిల్లా రొయ్యల రైతుల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని ఆక్వా రైతులు విద్యుత్ సరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకుపోయారని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాటి స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్ఈ ఆక్వా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా రొయ్యల సాగులో డిజిటల్ స్మార్టు మీటర్లు బిగించటం వల్ల ఆటోమేటిక్ కెపాసిటర్స్ వల్ల రైతులపై ఆర్థికభారం పడుతుందని ఎస్ఈ తెలిపారు. సమావేశంలో రొయ్యల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్, కార్యదర్శి కుంతూరి సుబ్బారెడ్డి, పమిడి సుబ్బానాయుడు, సతీష్, నార్నె శింగయ్య, మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం, బ్రిడ్జి నిర్మాణానికి సర్వే



ఉప్పలదిన్నె వద్ద సర్వే నిర్వహిస్తున్న ఇరిగేషన్ శాఖ సర్వే బృందం

పొన్నలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలదిన్నె గ్రామం వద్ద పాలేరుపై చెక్‌డ్యాం, బ్రిడ్జి నిర్మాణానికి ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్వే నిర్వహించారు. ఉప్పలదిన్నె-కామేపల్లి మధ్య పాలేరుపై గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం నిర్మాణానికి అంచనాలు తయారు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పాలేరుపై చెక్‌డ్యాం కం బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పాలేరుపై రావులకొల్లు వద్ద లోలెవల్ బ్రిడ్జి ఉంది. అయితే ఉప్పలదిన్నె వద్ద నిర్మించనున్న చెక్‌డ్యాం కం బ్రిడ్జితో పరిసర గ్రామాలకు మరింత దగ్గర మార్గం ఏర్పడనుంది.

దివ్యాంగుల సంఘాలు బలోపేతానికి పెద్దపీట

- మెప్మా పీడీ శ్రీహరి

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ దివ్యాంగుల సంఘాల ఆర్థికాభివృద్ధి బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పొట్లూరి శ్రీహరి తెలిపారు. దివ్యాంగుల సమాఖ్య పునరుద్ధరణ సమావేశం బుధవారం ఒంగోలులోని మెప్మా జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పీడీ శ్రీహరి మాట్లాడుతూ దివ్యాంగులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వయం ఉపాధి పథకాలు చేనేత, రథం, తృప్తి క్యాంటిన్, మొబైల్ క్యాంటీన్, ఇతర పథకాలు అమలు చేసి జిల్లాను ప్రథమస్థానంలో ఉంచనున్నట్లు తెలిపారు. నగరంలో 33మంది దివ్యాంగుల ఉపాధి కోసం అవసరమైన రుణాలను బ్యాంక్‌ల ద్వారా అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ. 2.2 కోట్లు రుణాలు అందించి దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమావేశంలో టీఈఐబీ ఫణికుమారి, టీఎల్‌హెచ్ జయకుమార్, సీవోలు పాల్గొన్నారు. అనంతరం దివ్యాంగుల సంఘాల బలోపేతం కోసం నూతన పదాధికారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పసుమర్తి రాజేష్, కార్యదర్శి యల్లా శివకృష్ణారెడ్డి, కోశాధికారిగా షేక్ అస్మాలను ఎన్నుకోగా, జోన్న బాలాజీ, మక్కెన సులోచన, వల్లంరెడ్డి యశోదలను సన్మానించారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ శ్రీహరి



బల్లికురవలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాల

బంగారు భవిష్యత్ దిశగా..

అప్పట్లో ఏవేవో కారణాల వల్ల బడి మానేశారు.. అలాంటి బాలికలను మళ్లీ తీర్చిదిద్దేందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను ప్రభుత్వం నడుపుతోంది. అందులో ఆరు నుంచి ఇంటర్ వరకు తరగతులు చదువులు చెప్పడంతోపాటు పలు వృత్తి విద్యల్లో శిక్షణ కూడా ఇప్పిస్తోంది. విద్యాలయం నుంచి బయటకొచ్చాక వారు సొంత కాళ్లపై నిలబడేందుకు కుట్టుమిషన్ శిక్షణ, ఎంబ్రాయిడింగ్ వర్కు, కుట్లు అల్లికలు, పెయింటింగ్, నూతన డిజైన్లతో జాకెట్లు తయారు చేయటంతో పాటు వారిలో ధైర్యం నింపేలా కరాటే వంటి క్లాసులనూ నిర్వహిస్తోంది.

- బల్లికురవ కేజీబీవీలో డ్రాపవుట్స్ బాలికలకు చదువుతో పాటు వృత్తి శిక్షణలు
- 6 నుంచి ఇంటర్ విద్యార్థినుల వరకు రోజూ ప్రత్యేక తరగతులు
- అల్లికలు, కుట్టు మిషన్, కరాటే, ఎంబ్రాయిడింగ్ వర్కులపై క్లాసులు
- చదువు తదుపరి సొంత కాళ్లపై నిలబడేలా ప్రభుత్వం కృషి
- బాలికలకు మనో ధైర్యం వచ్చేలా కరాటే క్లాసులూ నిర్వహణ
- ప్రస్తుతం 250 మందికి రోజు వారీ ట్రైనింగ్



బాలికలకు చదువుతో పాటు వృత్తి శిక్షణ ఇస్తున్న ట్రైనర్

విద్యతో పాటు వృత్తి శిక్షణ ఇస్తున్నాం



కె. సరళకుమారి, ప్రిన్సిపాల్

బాలికలకు చదువుతో పాటు వారికి ముందుముందు ఉపయోగపడేలా వృత్తి శిక్షణలు కూడా అందిస్తున్నాం. ప్రభుత్వం విద్యార్థినులకు అన్ని వసతులు కల్పించింది. ప్రస్తుతం 250 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి విడతల వారీగా శిక్షణలు ఇస్తున్నాం. వారిలో ధైర్యం నింపేలా ఈ ఏడాది నుంచి కరాటే క్లాసులు కూడా నిర్వహిస్తున్నారు.

విద్యార్థినులకు చేతి వృత్తుల్లోనూ శిక్షణ



కె. శిరీష, వృత్తి విద్య శిక్షకురాలు

విద్యార్థినులకు చేతివృత్తుల ద్వారా శిక్షణలు అందిస్తున్నాం. వారికి ఏడాది చి వరలో పరీక్షలు కూడా నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తాం. ఇతర ప్రాంతాల్లో వర్కు షాపులకు కూడా తీసుకెళ్లి వారికి అవగాహన కల్పిస్తున్నాం. బాలికలు అన్ని రంగాల్లో ఉండేలా ప్రోత్సాహమిస్తూ వారికి ప్రత్యేక తరగతులలో బోధిస్తున్నాం.



బాలికలకు కరాటే నేర్పుతున్న శిక్షకుడు



విద్యార్థులు తయారు చేసిన పలు రకాల జాకెట్ల నమూనాలు

బల్లికురవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో చక్కటి విద్యా బోధనతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో సీట్ల కోసం పోటీ పెరుగుతోంది. బాలికలకు చదువుతో పాటు పలు వృత్తి విద్య శిక్షణలను కూడా ప్రభుత్వం ఇప్పిస్తోంది. బడుగు, బలహీన వర్గాలకు చెందిన బాలికలు ముందు వారి స్వశక్తితో జీవించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. బాలికలకు పలు రకాల పెయింటింగ్‌లు, కుట్లు, అల్లికలు, పేపర్ల ద్వారా బొమ్మలు వేయటం వంటివి నేర్పిస్తున్నారు. ఈ కేజీబీవీలో దాదాపు 250 మంది బాలికలకు వృత్తి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ట్రైనర్‌ను కూడా ఏర్పాటు చేశారు. బాలికలకు విద్యతో పాటు చేతి వృత్తులపై ఎలా జీవనం చేయవచ్చో క్లాసులు కూడా నిర్వహిస్తున్నారు. అలానే ఇతర ప్రాంతాలలో జరిగే వర్కు షాపులకు కూడా బాలికలను తీసుకెళ్లి అక్కడ వారికి ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎంబ్రాయిడింగ్ వర్కులకు డిమాండ్ ఉంటుందని అందుకే విద్యార్థినులకు వాటిపై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. డ్రాపౌట్స్ విద్యాలయంలో తమ పిల్లలకు ఎన్నో వసతులు అందుతుండటంపై తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వృత్తి శిక్షణలు అందించటం బాగుంది

ప్రేమ జ్యోతి, 9వ తరగతి విద్యార్థిని



మాకు చదువుతో పాటు ప్రతిరోజూ కొంత సేపు వృత్తి విద్య కోర్సులు నేర్పిస్తున్నారు. తమకు ఇవి ముందు ముందు ఎంతో ఉపయోగపడతాయి. చదువు పూర్తయ్యాక సొంతంగా ఎలా జీవించవచ్చు అనే దానిపై ధైర్యం వచ్చేలా శిక్షణ ఇస్తున్నారు. చేతి వృత్తుల ద్వారా చేపట్టే పలు రకాల వస్తువులను తయారు చేసేలా శిక్షణ ఇస్తున్నారు



విద్యార్థినులు పేపర్లపై తయారు చేసిన పలు రకాల చిత్రాలు

కరాటే క్లాసులూ నిర్వహిస్తున్నారు

శివ పార్వతి, విద్యార్థిని



కేజీబీవీ విద్యాలయంలో మాకు క్రమంతప్పకుండా కరాటే క్లాసులు నిర్వహిస్తున్నారు. బాలికలకు మనోధైర్యం ఇచ్చేలా ఈ క్లాసులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. రోజూ ప్రత్యేక టీచర్ల ద్వారా ఒకేషనల్ ట్రైనింగ్ ఇస్తున్నారు. నేను గతంలో బడిమానటంతో డ్రాపౌట్స్ కోటాలో కేజీబీవీలో సీటు వచ్చింది. పలురకాల వృత్తుల్లో శిక్షణ పొందుతున్నా.

ఏపీఎండీసీ.. ఆదాయం దిశగా అడుగులేసి..

- మైనింగ్ నిలిపివేసిన భూముల్లో నూతన టెండర్లు ఖరారు
- 14.17హెక్టార్లలో క్వారీయింగ్‌కు నేడు ప్రజాభిప్రాయ సేకరణ

అన్ని లీజులను పునరుద్ధరించి ఆదాయం పెంచుకొనే ఆలోచన



రామతీర్థం వద్ద ఉన్న ఏపీఎండీసీ భూములు

చీమకుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాభవాన్ని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆదాయ వనరులను పెంచుకొనే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. ఏపీఎండీసీ భూముల్లో జాయింట్ వెంచర్ కంపెనీలుగా ఉండి క్వారీయింగ్ నిర్వహిస్తున్న సంస్థలను బెదిరించి క్వారీలను తమ హస్తగతం చేసుకోవటం ద్వారా ఏపీఎండీసీ ఆదాయానికి తూట్లు పొడిచారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కబంధహస్తాల నుంచి ఏపీఎండీసీ జేవీపీలకు విముక్తి కల్పించారు. గత లీజుదారులు మైనింగ్ చేయటానికి నిరాకరించటంతో కొత్తగా టెండర్లు పిలిచి ఖరారు చేశారు. ఈ క్రమంలో ఆర్‌ఎల్‌పురం గ్రామ సర్వే నంబర్ 55 బైౌసీలో ఉన్న 14.17 హెక్టార్ల ఏపీఎండీసీ భూములలో మైనింగ్ చేసేందుకు జాయింట్ వెంచర్ కంపెనీగా శాంభవి గ్రానైట్ సంస్థకు హక్కులు దక్కాయి. వీరు సాలీనా 71.354 క్యూబిక్ మీటర్ల రాయిని ఓపెన్ కాస్ట్ విధానం ద్వారా వెలికితీసేందుకు పర్యావరణ అనుమతులు కావాల్సి వచ్చింది. దీనికై గురువారం ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమాన్ని రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో అధికారులు సమక్షంలో నిర్వహించనున్నారు. అదే విధంగా రామతీర్థం వద్ద ఉన్న దాదాపు 150 ఎకరాల ఏపీఎండీసీ భూముల్లో క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహించేలా చేసి ఆదాయాన్ని పెంచుకోవటానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

తగలబడుతున్న కొండ



ఒక వైపు నుంచి కొండకు అంటుకున్న మంటలు

కురిచేడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కురిచేడు ఆవులమంద రోడ్డులో ఓ కొండ తగలబడుతోంది. కొండ కింద నుంచి పై భాగం వరకు ఒక వరుసలో మంటలు రేగుతున్నాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీని వలన వన్య ప్రాణులకు నష్టం జరుగుతుందని వన్య ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక శాఖవారు మంటలను వెంటనే అదుపులోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

రీసర్వే పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలి

జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియను పటిష్టంగా అమలు జరిగేలా రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం కార్యక్రమం హాలులో బుధవారం రీసర్వే, పీజీఆర్ఎస్, పలు రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లతో జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడారు. రీసర్వే పటిష్టంగా జరిగితే భూ సమస్యలు తగ్గుతాయన్నారు. గ్రామ సర్వేలో హద్దుల గుర్తింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. భూ యజమానికి ముందుగా రీ సర్వే గురించి తెలియజేయాలన్నారు. సర్వేలో తప్పులు లేకుండా చూడాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కింద జిల్లాలోని 38 మండలాల్లో 38 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసుకొని సర్వేను ప్రారంభించినట్లు తెలిపారు. రీసర్వేపై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో ఆ సమస్యను పరిశీలించి అర్జీదారుడితో మాట్లాడి పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధనరెడ్డి, సర్వే అధికారి గౌస్ బాషా పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



యువకుడి మృతదేహం

బల్లికురవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన కీర్తిపాటి బ్రహ్మయ్య (26) ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని మంగళవారం రాత్రి మృతి చెందాడు. అతని తండ్రి ఏడుకొండలు ఫిర్యాదు మేరకు ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ కథనం మేరకు కొమ్మినేనివారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కీర్తిపాటి బ్రహ్మయ్య నాలుగేళ్ల కిందట ఇంటి నిర్మాణం చేసి రూ.15 లక్షల మేర అప్పులు చేశారు. మూడు ఎకరాల పొలంలో పంటలు వేసి నష్టపోయాడు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బ్రహ్మయ్య 8 మాసాల కిందట వివాహం కాగా, భార్య గర్భిణి కావడంతో పుట్టింట్లో ఉంటోంది. ఒంటరిగా ఉంటు మనో వ్యథకులోనై గ్రామానికి దూరంగా ఉన్న తుమ్మ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెట్టుకు మృతదేహంవేలాడుతుండడం చూసిన గ్రామస్థులు వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందిచండంతో వెంటనే వెళ్లి వివరాలను సేకరించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి వారి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. అంత్యక్రియలను భార్య తరఫు బంధువులు కాసేపు అడ్డుకున్నారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గుండెపోటుతో ఏఎన్ఎం మృతి

రాచర్ల (గిద్దలూరు), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం యడవల్లి సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న నల్లబోయిన శ్రీవల్లి (35) గుండెపోటుతో మృతిచెందింది. భర్త, ఇరువురు పిల్లలతో గిద్దలూరులో నివసిస్తున్న శ్రీవల్లి బుధవారం యడవల్లి సచివాలయానికి విధుల కోసం వెళ్లింది. ఆ సమయంలో అస్వస్థతకు గురికావడంతో తోటి సచివాలయ సిబ్బంది సమీపంలోని అనుమలవీడు పీహెచ్‌సీ కేంద్రానికి శ్రీవల్లిని తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి బాగానే ఉన్నట్లు గుర్తించి ఇంటికి పంపించారు. అనుమలవీడు నుంచి గిద్దలూరు ఆటోలో వస్తున్న సమయంలో మరోసారి అస్వస్థతకు గురికాగా, ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. ఆ సందర్భంలో గుండెపోటుకు గురై మృతిచెందారు.

సదరమ్ క్యాంప్‌నకు వచ్చి దివ్యాంగురాలు మృతి

గిద్దలూరు టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సదరమ్ క్యాంప్‌నకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్న దివ్యాంగురాలు ఫిట్స్‌కు గురై మృతిచెందిన ఘటన గిద్దలూరులో బుధవారం చోటుచేసుకొంది. కంభం పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన సయ్యద్ ఖాదర్‌బీ(65) అనే దివ్యాంగురాలు గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సదరమ్ క్యాంప్‌లో వెరిఫికేషన్ కోసం వచ్చారు. అనంతరం కుటుంబసభ్యులు ఆమెను తీసుకెళుతుండగా, ఫిట్స్ వచ్చాయి. ఆ వెంటనే గుండెపోటుకు గురయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యులు ఖాదర్‌బీ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

నాగన్నపాలెం ఉప సర్పంచ్ ఎన్నికకు ఏర్పాట్లు

మద్దిపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నాగన్నపాలెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ నెల 27న ఈమేరకు సమావేశం నిర్వహిస్తామని, ఎన్నిక ప్రక్రియకు ఈవోఆర్డీ రఘుబాబు పర్యవేక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను తీసుకున్నట్లు తెలిపారు. పోలీస్ బందోబస్తు నిర్వహిస్తారని, ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఈవోఆర్డీ కోరారు.

లారీ ఢీకొని ఇరువురికి గాయాలు

మద్దిపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): లారీని వెనుక నుంచి మోటార్‌సైకిల్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం సీతారాంపురం కొస్టాల్ బస్టాండ్ వద్ద జరిగినట్లు ఎస్‌ఐ శివరామయ్య తెలిపారు. బైక్ మీద వెళ్తున్న ఇద్దరు యువకులు లారీని దాటే సమయంలో వెనుకవైపున బలంగా ఢీకొన్నారని ఆయన చెప్పారు. ఈ ప్రమాదంలో తిరుపతికి చెందిన ఎం.సోహిత్ విశాఖపట్నంలోని సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతుండగా తన స్నేహితుడు కడపకు చెందిన సూరత్‌తో కలిసి బైక్‌పై వెళుతుండగా గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టంగుటూరులో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.280

టంగుటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280 పలికింది. కనిష్ఠ ధర రూ.260గా ఉంది. వేలానికి మల్లవరప్పాడు, మట్టిపాడు, గొర్లమిట్ట గ్రామాల రైతులకు చెందిన 235 బేళ్లను అధికారులు అనుమతించారు. వీటిలో 165 బేళ్లను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. కిలోకు సగటున రూ.271.60 ధర లభించింది.

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కొండపి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఐదు రోజులపాటు ఏర్పాటు చేసిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత శిక్షణలో తెలుసుకున్న విషయాలను అనుసరించి అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ సమన్వయాధికారులు రవీంద్ర, ప్రదీప్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఉపాధి పనులను చేపట్టాలి



మాట్లాడుతున్న ఏపీవో మహాలక్ష్మి

కొండపి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని ఏపీవో మహాలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మేట్‌లకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూగర్భ జలం పెరిగేందుకు అవకాశం ఉన్న సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలు, ఫీడర్ చానళ్ల మరమ్మతులు, చెరువుల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం నాలుగు గంటలపాటు కూలీలతో పనులు చేయించి వారికి అధిక వేతనం వచ్చేలా చూడాలన్నారు. ఈసీ ప్రసాద్ మేట్‌లకు కొలతలపై అవగాహన కల్పించారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు



విత్తనాలను అందజేస్తున్న పశువైద్యుడు హజరత్

సింగరాయకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు 75 శాతం రాయితీపై గ్రాసం విత్తనాలను అందజేస్తున్నట్లు పశువైద్యుడు డాక్టర్ ఎస్.హజరత్ తెలిపారు. బుధవారం స్థానిక పశువైద్యశాలలో రైతులకు ఆయన విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి వసతి ఉన్న వారు తమ పొలాల్లో గ్రాసాన్ని పెంచుకోవాలని సూచించారు. దీనివలన వేసవిలో పశువులకు మేత కొరత తగ్గి పాల దిగుబడి పెరుగుతుందన్నారు.

క్రిస్టియన్‌పాలెంకు తాగునీరు అందించాలి



కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాలనీవాసులు, నాయకులు

చీమకుర్తి, మార్చి26(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టియన్‌పాలెంకు తాగునీరు సరఫరా చేసేవిధంగా చర్యలు చేపట్టాలని బుధవారం కాలనీవాసులు కమిషనర్ రామకృష్ణయ్యకు వినతిపత్రం అంతజేశారు. పైపు లైన్లు ఏర్పాటుచేసి తాగునీటి ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. పాలెంలో ఉన్న మరికొన్ని సమస్యలను పరిష్కరిచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ

సింగరాయకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊళ్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో మూడు రోజులపాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ.. పడాయ్‌బీపై నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రిజ్వానా, సైదాబీ, జ్యోతి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం, విద్యను అందజేయాలని సూచించారు.

మద్దిపాడు: అంగన్‌వాడీ పిల్లల్లో సృజనాత్మకత వెలికి తీయాల్సిన అవసరం ఉందని సీడీపీవో ఆర్.ఇవాంజెలిన్ అన్నారు. బుధవారం గుండ్లాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణకు 18 ట్రాక్టర్ల మంజూరు

నేడు కొండపిలో ప్రారంభించనున్న మంత్రి స్వామి

కొండపి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 18 గ్రామ పంచాయతీలకు చెత్త సేకరణ కోసం ప్రభుత్వం ట్రాక్టర్లను మంజూరు చేసింది. వీటిని గురువారం కొండపిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు మేజర్ గ్రామ పంచాయతీలైన టంగుటూరు, సింగరాయకొండ, కొండపి, జరుగుమల్లిల్లో మాత్రమే దాతలు, ప్రభుత్వ సహకారంతో ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం 2వేల మందికిపైన జనాభా ఉన్న ప్రతి పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు, పెట్లూరు, నేతివారిపాలెం గ్రామాలకు ట్రాక్టర్లను కేటాయించింది. టంగుటూరు మండలంలోని కందులూరు, జమ్ములపాలెం, కారుమంచి, ఆలకూరపాడు, పొందూరు, ఎం.నిడమలూరు, కొణిజేడు గ్రామాలకు మొత్తం ఏడు మంజూరు చేసింది. జరుగుమల్లి మండలంలోని జరుగుమల్లి, కె.బిట్రగుంట, కామేపల్లి గ్రామాలకు కూడా ఇచ్చింది. పొన్నలూరు గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్ మంజూరైంది. సింగరాయకొండ మండలంలోని బింగినపల్లి, శానంపూడి, పాత సింగరాయకొండ.. మర్రిపూడి మండలంలోని కాకర్ల, కెల్లంపల్లి పంచాయతీలకు ఒక్కో ట్రాక్టర్‌ను కేటాయించారు. వీటన్నింటినీ గురువారం కొండపిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో మంత్రి స్వామి ప్రారంభించనున్నారు. అనంతరం వాటిని ఆయా గ్రామ పంచాయతీలకు పంపనున్నారు. ఆతర్వాత నియోజకవర్గంలోని ఆరు మండలాల వైద్యాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహిస్తారు.

చంద్రబాబు పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే బీఎన్



సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు/నాగులుప్పలపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో అర్హులైన వారందరికీ సంక్షేమఫలాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. ఒంగోలులోని బీఎన్ నివాసంలో బుధవారం పలువురు సీఎం సహాయనిధి కింద మంజూరుపన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. బొడ్డువారిపాలెంకు చెందిన పి.రామయ్యకు రూ.59,540, పేర్నమిట్ట జి.వెంకటేశ్వర్లుకు రూ.34,730, పి.రమణమ్మకు రూ.1,29,163, జి.సురేష్‌కు రూ.1,43,502, నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు జి.అనిల్‌కుమార్‌కు రూ.66,901, కె.తక్కెళ్లపాడు చెందిన కె.శేషమ్మకు రూ.80వేలు, ఎన్.శ్రీదేవికి రూ.45,926లను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్..

ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజాసమస్యలను ఆలకించారు. వినతిపత్రాలను స్వీకరించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారం వేగవంతంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నగరంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు

- పరిశీలించిన కమిషనర్



పోతురాజు కాలువ వద్ద పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాలలో పారిశుధ్యం మెరుగు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు నగరంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ మేరకు నగరంలోని పోతురాజు కాలువలో పూడిక తీత పనులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో మురుగునీటి పారుదలకు ప్రధాన కాలువ అయిన పోతురాజుకాలువలో వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అలాగే నగరంలోని పలు కాలువల ద్వారా వచ్చే నీరు పారుదల లేకపోవడంతో పారిశుధ్యం సమస్య ఏర్పడుతుందని చెప్పారు. ప్రధాన సెంటర్లలోని ఏడు ప్రాంతాల్లో పూడికతీత కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూలమలుపులు, మెయిన్‌రోడ్‌లోని డ్రైన్‌లలో నీరు సక్రమంగా పారుదల లేకపోవడంతో అత్యవసరంగా పోతురాజు కాలువలో వ్యర్థాలను తొలగించాల్సి వచ్చిందన్నారు. అకాల వర్షాలు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టనట్టు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించి చేపట్టాల్సిన పారిశుధ్య పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంతఈ చంద్రయ్య, డీఈ పద్మజ, శానిటరీ సూపర్‌వైజర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నగరవాసుల సమస్యలను పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన మేర నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే. మాబు డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్యయాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ నగరంలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. ఈనెల 7నుంచి 17వ తేదీ వరకు తమ పార్టీచేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో అనేక సమస్యలను పరిశీలించామన్నారు. 70శివారుకాలనీల్లో పక్కా గృహాలు, తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు సెంటు చొప్పున 20,840 మంది లబ్ధిదారులకు పట్టాల పేరుతో పత్రాలను పంపిణీ చేసి మభ్యపెట్టారని ఆరోపించారు. అయితే టీడీపీ కూటమి తాము అధికారంలోకి వస్తే రెండేసి సెంట్లు ఇంటిస్థలాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. పోతురాజు కాలువ ఆధునీకీకరణ పనులతో పాటు నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి.రమేష్ మాట్లాడుతూ డీకే పట్టాలు పొంది ఇళ్ళు నిర్మించుకున్న వారికి ఇంటి పన్నులు వేయాలని డిమాండ్ చేశారు. తంబి శ్రీనివాసులు అధ్యక్షతన ధర్నాలో కె.రమాదేవి, పి.కల్పన, ఎస్‌డీ.హుస్సేన్, ఆదిలక్ష్మి, టి.మహేష్, దామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

తాళ్లపాక అన్నమాచార్యకు ఘన నివాళి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, భక్తులు

ఒంగోలు కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 522వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక సంతపేట షిర్డి సాయిబాబా మందిరంలో ఘనంగా నిర్వహించారు. శ్రీతాళ్లపాక అన్నమాచార్య సంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో ముందుగా అన్నమాచార్యుల విగ్రహానికి దేవస్థాన అర్చకులు సుధాకర్‌స్వామి ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. అనంతరం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, టీటీడీ గాయకులు ఇనమనమెళ్లూరి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు గాయకులు అన్నమాచార్యులు సంకీర్తనలను ఆలపించారు. ఇటీవల మరణించిన ప్రముఖ సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు నివాళులర్పించారు. అనంతరం సమితి అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరుని తన సంకీర్తనలతో సేవించి తరించిన పరమభాగవత శిఖామణి అన్నమయ్య అని శ్లాఘించారు. అందులో సుమారు 600 సంకీర్తనలకు బాలకృష్ణప్రసాద్ సంగీతాన్ని సమకూర్చారన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లిఖార్జునరావు మాట్లాడుతూ అన్నమయ్య గొప్ప సామాజిక దార్శనికుడన్నారు. ప్రరసం అధ్యక్షులు పొన్నూరి వెంకటశ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు లలిత సుమధుర భరితంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో గాయకులు వేంకట సుబ్బయ్య, ఆకుల శ్రీను, మాగంటి శ్రీనివాసమూర్తి, గుర్రం కృష్ణ, బదరీరంగనాథ్, పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డాక్టర్ రావిపాటి ప్రసాద రావు, డి.ప్రసన్నకుమారి, పి.జానకిరామ్, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

- శాస్త్రవేత్త రవీంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): షెడ్‌నెట్ హౌస్‌లో కూరగాయలు, పూల పెంపకంలో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని దర్శి ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు సూచించారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మిరప, దానిమ్మ, షెడ్‌నెట్ హౌస్‌లో కూరగాయలు, పూల పెంపకంపై మంగళవారం ఒంగోలులోని టీటీడీసీ సమావేశపు హాలులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విత్తనశుద్ధి ఇమిడిక్లోప్రిడ్‌తో చేస్తే చాలావరకు రసం పీల్చే పురుగులను తట్టుకుంటుందన్నారు. వేప సంబంధిత పురుగు మందులు వాడాలని, రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. మార్కెట్ ధర కోసం సీజన్‌కు అనుకూలమైన కూరగాయలు, పూల పంటలను మాత్రమే సాగు చేయాలని సూచించారు. కందుకూరు హార్టీకల్చర్ కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ మిరప, దానిమ్మ పంటలలో ఆశించే రసం పీల్చే పురుగులు, బ్యాక్టీరియా ఆకుమచ్చ, సెర్కోస్పోరా ఆకుమచ్చ, కాయ తొలిచే పురుగుల నివారణకు తీసుకునే చర్యలను వివరించారు. శాస్త్రవేత్త వెంకటరమణ మాట్లాడుతూ టమోటా వంటి కూరగాయలను నీటి వసతి ఉన్న రైతులు ఎండాకాలంలో సాగు చేసుకోవాలని సూచించారు. తీగ జాతి కూరగాయలను శాశ్వత పందిర్ల కింద సాగు చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి వై.గోపీచంద్ ఉద్యానశాఖ ద్వారా రైతులకు రాయితీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రైతులు, వివిధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పార్కులు, ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు బహుళ ప్రయోజనకరంగా ఉండే పార్కులు, ప్రాజెక్టులు వంటివాటిపై ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక జేసీ చాంబర్‌లో మంగళవారం ఒంగోలు పట్టణాభివృద్ధికి సంస్థకు సంబంధించి 2025-26 వార్షిక బడ్జెట్‌పై పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లోని ఆయా అంశాలపై చర్చించి ఆమోదించారు. నగర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఎన్టీఆర్ స్మార్ట్‌టౌన్‌షిప్‌లు వినూత్న ఆలోచనలకు లోబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానం

నాగులుప్పలపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈదుమూడి గ్రామానికి చెందిన కొమ్మూరి ఆనందరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల అనుమతితో బుధవారం ఒంగోలులోని జీజీహెచ్ వైద్యశాల వద్ద ఎల్‌వీ.ప్రసాద్ వైద్యశాలకు దానం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ, సిసింద్రి, బాబురావు, సురేష్, ఎల్‌వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'అరవింద్' హాస్పిటల్ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న వైద్యులు నరేంద్రబాబు, భానుతేజ, సిబ్బంది

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించిన రెండేళ్లలో ఎంతో మంది రోగులకు తాము నాణ్యమైన వైద్యసేవలు అందించడం ఎంతో సంతృప్తి ఇచ్చిందని డాక్టర్ నరేంద్రబాబు, డాక్టర్ భానుతేజ తెలిపారు. ఒంగోలులోని అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించి బుధవారానికి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, వైద్యులు ఆసుపత్రి నిర్వాకులు డాక్టర్ నరేంద్రబాబు, డాక్టర్ భానుతేజలను కలిసి వార్షికోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఇప్పటికే అరుదైన వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. ఓ రోగికి జీర్ణకోశ, శ్వాసకోశంలో ఇరుక్కుపోయిన బోవిన్‌బాడీలను వెలికితీసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అరుదైన శస్త్ర చికిత్సలు చేశామన్నారు. క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లకు బ్రాంకో స్కోపీద్వారా నిర్ధారణ చేయడం ద్వారా వైద్యం ఖచ్చితత్వం చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో రోగులకు మరిన్ని సేవలు విస్తరిస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కరవదిలో కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటు

- బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), మార్చి26(ఆంధ్రజ్యోతి): కరవదిలో కుట్టుమిషన్‌ల కేంద్రం ఏర్పాటు చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ, ఈబీసీ, కాపు మహిళలు కుట్టుమిషన్ శిక్షణకు డ్వాక్రా గ్రూపు మహిళలతో దరఖాస్తు చేయించాలన్నారు. ఈ శిక్షణకు 18 నుంచి 45 సంవత్సరాలు వయస్సు గల మహిళలు అర్హులు తెలిపారు. శిక్షణ 45 రోజులు పాటు విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్‌లకు రుణాలు ఇస్తామని చచెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, పీఆర్ ఏఈ రామ్ కుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

మద్దిపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ మండవ శివానందరావు పిలుపునిచ్చారు. బుధవారం సీతారాంపురంలో గ్రామ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం.రమేష్‌బాబు, గ్రామ కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిక్ నంబర్ ద్వారా రైతులకు రాయితీలు

మద్దిపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతి రైతుకు యూనిక్ నెంబరు పొందాలని ఏవో రమేష్‌బాబు తెలిపారు. బుధవారం నందిపాడు రైతు సేవా కేంద్రంలో రైతులకు యూనిక్ నెంబర్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ గుర్తింపు సంఖ్య ద్వారా వ్యవసాయ సేవలు అందుబాటులోకి వస్తాయని, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ వేల్పుల స్వాతి పాల్గొన్నారు.

పోక్సో చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో ఎంఈవో కార్యాలయం వద్ద బుధవారం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పోక్సో చట్టాలపై ఎస్‌ఐ వి.అజయ్‌బాబు అవగాహన కల్పించారు. విద్యార్థినులపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ

2న మండల సర్వసభ్య సమావేశం

కంభం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 2 బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యంపై, పౌరసరఫరాలశాఖ, అన్నిశాఖలపై చర్చ జరుగునని, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు సమాచారంతో హాజరుకావాలన్నారు.

గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష వాయిదా

కంభం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 6న జరగాల్సిన ప్రవేశపరీక్ష వాయిదా పడినట్లు కంభం గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 13వ తేదీ పరీక్ష నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలన్నారు.

50శాతం వడ్డీ మాఫీ

గిద్దలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను, ఖాళీ స్థలాలపై పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని నెలాఖరులోగా ఒకేసారి చెల్లించి 50శాతం వడ్డీ మినహాయింపు పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆదివారం, పండుగ రోజుల్లో కూడా మున్సిపల్ ఆఫీసులో పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను నుంచి వడ్డీరాయితీ మినహాయింపు లభిస్తుందని తెలిపారు.

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

త్రిపురాంతకం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులపై బహిరంగ ప్రజావేదిక కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- భర్తకు గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో

పెద్దారవీడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్తకు గాయాలైన ఘటన బుధవారం మండలంలోని గొబ్బూరులో అమరావతి- అనంతపురం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఎర్రగొండపాలేనికి చెందిన మనిపాటి వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిలు మార్కాపురం కూరగాయల మార్కెట్‌కు సరుకులు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నారు. యథావిధిగా కూరగాయలు తీసుకొని ఎర్రగొండపాలెం నుంచి మార్కాపురం వారి ఆటో లో వెళుతున్నారు. గుర్తు తెలియని వాహనం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఢీ కొట్టింది. ఈ ఘటనలో లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందిది. ఆమె భర్త వెంకటేశ్వర్లుకు స్వల్పగాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి, రూ.10వేలు స్వాధీనం

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరభద్రాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకొన్నారు. ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూదాలు, బెట్టింగ్‌లకు పాల్పడడం వలన జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఎక్కడైన జూదం, బెట్టింగ్‌లకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు వై.పాలెంలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

ఎర్రగొండపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు కో-ఆప్షన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బండారు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నిక జరిగే ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగులకు బకాయిల విడుదలపై యూటీఎఫ్ హర్షం


నాగభూషణ్‌రెడ్డి

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల కు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం విడుదల చేయడంపై యూటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.బాబులునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే గతంలో నిలిచిపోయిన మొండిబకాయిలను చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఉన్నారు.

ఎంఈవో-2గా నాగభూషణ్ రెడ్డి

గిద్దలూరుటౌన్, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): గిద్దలూరు మండల విద్యాశాఖాధి కారి-2గా పోలా నాగభూషణ్‌రెడ్డిని నియ మిస్తూ గుంటూరు ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మండల విద్యాశాఖా ధికారి-2గా ఉన్న జింకా వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో నాగభూషణ్‌రెడ్డిని నియమించారు. నాగ భూషణ్‌రెడ్డి జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నారు. నాగభూషణ్‌రెడ్డి బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

గిద్దలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, నగర సంకీర్తనతో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. ఉమామహేశ్వరస్వామికి, అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేక, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సుబ్రమణ్యేశ్వరస్వామికి సైతం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. మండపారాధనతోపాటు చండీ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలలో కటకం ట్రస్టు చైర్మన్ కటకం నాగేశ్వరరావు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు, దాతలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కాశినాయనకు అభిషేకం

గిద్దలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశినాయన స్వామికి భక్తులు సామూహికంగా అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రిటైర్డ్ లెక్చరర్ వడ్డె వీరారెడ్డి అన్నదాతగా వ్యవహరించగా దేవస్థాన కమిటీ ప్రతినిధులు నారాయణరెడ్డి, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను

తక్షణమే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశం
- ప్రజాదర్బారుకు విశేష స్పందన


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) :ప్రజా సమస్యలను తక్షణమే సంబంధిత అధికారులు పరిష్కారం చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రజల వద్దకే ఎమ్మెల్యే కార్యాక్రమాన్ని పటిష్టంగా తీసుకుందన్నారు. దీనిలో భాగంగా బుధవారం ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు ప్రజల వద్దకే ప్రజాదర్బార్ కార్యాక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే తక్షణమే పరిష్కరించాలన్నారు. ఒకే సమస్యలకు పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు ప్రతి అధికారి జవాబుదారితనంతో వ్యవహరించాలన్నారు. అధికారులు ఈ ప్రజాదార్బర్‌లో ఇచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారించేందుకు చర్యలను చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. అనంతరం ప్రజల నుంచి 102 అర్జీలను స్వీకరించారు. అందులో ఎక్కువగా రెవెన్యూ, విద్యుత్, తాగునీటిసమస్య, రోడ్లు, వ్యక్తిగత సమస్యలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, గిద్దలూరు విద్యుత్‌శాఖ ఏడీ శేషగిరిరావు, గృహనిర్మాణశాఖ డీఈ ఖదీర్‌బాష, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అర్జీల రూపంలో సమస్యలు

కొమరోలు మండలంలోని బాదినేనిపల్లి, కొమరోలు మఠం బజారుల్లో పాతవిద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేయాని ఎమ్మెల్యేకు అర్జీ ఇచ్చారు. మండలంలోని హనుమంతురాయుని పల్లి, ఇడమకుల్లు ఎస్సీపాలెంల్లో బోర్లు చెడిపోయి తాగునీటి సమస్య నెలకొందని కోరగా ఎమ్మెల్యే స్పందించారు. సాయంత్రంలోపు బోరు మరమ్మత్తులు చేసి నీటిని సరఫరా చేయాలని ఈవోపీఆర్‌డీ బ్రహ్మయ్యను ఆదేశించారు. గోపానిపల్లి ఎస్సీ కాలనీలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్య ఉందని ఆకాలనీవాసులు కోరగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కృష్ణంపల్లి రోడ్డులోని బోరును, కొమరోలు చెరువులో వేసిన బోర్లకు మరమ్మతులు చేశారు. వారంలోపు గోపానిపల్లి ఎస్సీపాలేనికి నీటిని ఇచ్చి, తనకు సమాచారం ఇవ్వాలని కార్యదర్శి బ్రహ్మయ్యను ఆదేశించారు. మండలంలోని బొడ్డువానిపల్లి, ఇడమకల్లు ఎస్సీ పాలెం, మల్లారెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో జేజేఎం నిధులతో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులు పెండింగ్‌లో ఉన్నాయని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నిధుల లభ్యతను బట్టి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని రెడ్డిచర్ల, బెడుసుపల్లి, కొమరోలు చెరువుల్లో పూడికతీత, చిల్లచెట్ల తొలగింపు చేయట్టాలని రైతులకు వినతులు ఇచ్చారు. కొమరోలు నాయిబ్రాహ్మణకాలనీకి మురుగు నీరు వస్తుందని, పలుమార్లు పంచాయతీవారికి తెలిపినా ఫలితంలేదని ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కొమరోలు కార్యదర్శి బ్రహ్మయ్యను పిలిపించి వెంటనే ఆ కాలనీవాసులకు మంచినీరు ఇచ్చేపైపులైను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కొమరోలు పట్టణంలోని ప్రధాన రహదారిలో, ప్రభుత్వ కార్యాలయాలైన తహసీల్దార్, ఎంపీడీవో, ఐకేపీ, గృహనిర్మాణశాఖ, విద్యుత్ శాఖల కార్యాలయాలు ఒకేస్థలంలో ఉన్నాయని, కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు, ఇతర అధికారులకు మరుగుదొడ్లు లేవని, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. అధికారులు తగు స్థలాన్ని గుర్తించి, ఎంపీపీ నిధుల ద్వార వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయా శాఖల వారిగా విభజించి తక్షణయే పరిష్కారించాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


గిద్దలూరులో రైతులతో మాట్లాడుతున్న ఏవో

మార్కాపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి). మర్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల, శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ కోరారు. మండలంలోని పెద్దనాగులవరం, పెద్ద యాచవరం గ్రామాలలో బుధవారం ఏవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ బాలాజినాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసే భూములు మరింత సారవంతంగా తయారవ్వాలంటే పచ్చిరొట్ట పైర్లను సాగుచేయాలన్నారు. రసాయన మందుల వినియోగం తగ్గించి సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగుచేయడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది జయంతి, రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరుటౌన్ : ప్రభుత్వం అపరాలకు మద్దతుధర ప్రకటించినందున ప్రైవేటు మార్కెట్ కంటే కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఏవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముండ్లపాడు, బురుజుపల్లె రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం కందులకు క్వింటా రూ. 7550, శనగలకు క్వింటా రూ.5650 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తోందన్నారు. రాయితీతో పీవీసీ పైపులు, వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా డ్రైవాన్, బ్యాటరీ స్ప్రేయర్లు, 9 చెక్కలగొర్రు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రవిచంద్రుడు, కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను నియోగించుకోవాలి

పెద్దదోర్నాల :ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో జవహర్‌లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని చిలకచెర్ల, ఎగువచెర్లోపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు మంజూరుకు విధిగా విశిష్టసంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనికల్పించాలి

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులను కల్పించాలని వై.పాలెం ఏపీవో శైలజ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మేట్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు చేపట్టే సమయంలో మేట్‌లది కీలకపాత్ర అన్నారు. ప్రతి పని కొలతల ప్రకారం చేపట్టాలన్నారు. అలాగే కచ్చితంగా మస్టర్లలో హాజరు ఎప్పటికప్పుడు వేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే ఫారంపాండ్లు, నీటినిల్వ ఉండే కందకాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా రిసోర్సు పర్సన్ కే.అనిల్‌కుమార్ మేట్లకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో కె.నాగేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

పొదిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ బుధవారం పొదిలి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పూర్తిస్థాయిలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారిపట్ల స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది విధుల పట్ల పలు సూచనలు అందించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసకున్నారు. అనంతరం పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ వేమన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న రూరల్ సీఐ రామకోటయ్య

గిద్దలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని నిత్యం ప్రాక్టీస్ చేయడం ద్వారా విజయాలు సాధించవచ్చని రూరల్ సీఐ రామకోటయ్య అన్నారు. రాచర్లలోని స్పందన పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ఫెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. వారంరోజుల పాటు స్పోర్ట్స్ ఫెస్ట్ జరుగుతుందని విద్యాసంస్థల డైరెక్టర్ పి.సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

తర్లుపాడులో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇమ్మడి కాశీనాథ్

తర్లుపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని రైతుసేవా కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కందులు, శనగలను కొనుగోలు చేస్తుందన్నారు. దళారుల మాటవిని బయట మార్కెట్‌లో అమ్ముకోవద్దని, రైతుసేవా కేంద్రంలో అమ్ముకుంటే క్వింటాకు రూ.7550 చొప్పున వెంటనే బ్యాంకు అకౌంట్‌లో జమ చేయటం జరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు వెంటనే శాంపిల్స్ తీసుకొచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రానికి నిర్ణయించిన తేదీలలో రైతులు కందులు తీసుకొని రావాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమం లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాన పతిరెడ్డి, కందుల రోహిత్ రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు వెలుగొండారెడ్డి, సొసైటీ సీవో తుంబేటి కాశయ్య, మండల యూత్ అధ్యక్షులు మేకల వెంకట్, సుబ్బయ్య, కాశంగి శ్రీనివాసులు, ఈర్ల వెంకటయ్య, గోసు వెంక టేశ్వర్లు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు చేతుల శ్రీనివాసులు, గుంటు రత్నకుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పొదిలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం పొదిలి ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ శంకరరావు తెలిపారు. బుధవారం పొదిలి బస్టాండ్ ప్రాంగణంలో కార్గో కోసం నిర్మించిన అదనపు గదిని ఆయన ప్రారంభించారు. పొదిలి డిపో నుంచి రాష్ట్రం నలుమూలలకు కార్గోసేవలు కొనసాగుతున్నాయన్నారు. కార్గో సరుకుల నిల్వ కోసం పొదిలి బస్టాండ్‌లో ప్రత్యేకగదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఆర్టీసీ సౌకర్యాలను మెరుగుపరుస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు షరీఫా సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు సీసీ కెమెరాల అందజేత


సీసీ కెమెరాలను అందజేస్తున్న శ్రీనివాసులు

గిద్దలూరు టౌన్, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు చేపడుతున్న భద్రతా ఏర్పాటుకు ఉపకరించే విధంగా 10 సీసీ కెమెరాలను పట్టణానికి చెందిన నంది డీలర్ శ్రీనివాసులు అర్బన్ సీఐ కె.సురేష్‌కు బుధవారం అందించారు. సీఐ సురేష్ నంది శ్రీనును అభినందించారు. సీసీ కెమెరాల ఏర్పాటు వలన దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు చెక్‌పెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. రూ.40వేల విలువైన 10 సీసీ కెమెరాలను అందించిన నంది శ్రీనును అభినందించారు.

గిద్దలూరు టౌన్: గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, పోలీసులకు సహకరించే విధంగా ముండ్లపాడు గ్రామానికి చెందిన పలువురు సీసీ కెమెరాలను పోలీసులకు అందించారు. బుధవారం అర్బన్ సీఐ కె.సురేష్‌కు ముండ్లపాడు ఉపసర్పంచ్ కడియం శేషగిరి, అరిగెల నారాయణ, ఓబులపతి తిమ్మరాజు చెరువు చైర్మన్ నల్లగట్ల నరసయ్య, చిన్న, పవన్ తదితరులు 10 సీసీ కెమెరాలను అందజేశారు. దీంతో సీఐ సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగినపుడు వాటిని చేధించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు, గ్రామస్థులు ముందుకు వచ్చి కెమెరాలను అందచేయడం అభినందనీయమన్నారు. ముండ్లపాడులోని పలు సెంటర్లలో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

మార్కాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఓ మహిళ మెడలో బంగారు గొలుసు (సరుడు) చోరీ చేసిన ఘటన బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయానికి సమీపంలోని ఐదురోడ్ల కూడలి వద్ద వాడకట్టు రమాదేవి నివసిస్తోంది. ఎప్పటిలాగే ఉదయాన్ని ఇంటిలోని చెత్తను తీసుకుని పంచాయతీరాజ్ కార్యాలయం ఉన్న చెత్తకుండీలో వేసేందుకు 5.30 గంటలకు రోడ్డుపైకి వచ్చింది. చెత్తవేసి ఇంటికి వెళ్లే క్రమంలో ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలసును తెంచుకుని పరారయ్యారు. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు గమనించి ఆమె వద్దకు వచ్చేసరికి స్కూటీపై వేగంగా నడిపి చైన్‌స్నాచర్‌లు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రెండు తులాల గొలుసు విలువ రూ.80వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు.

కార్యకర్తలకు ముగిసిన శిక్షణ తరగతులు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ పడాయిబీ మిషన్ (పోషణ్ 2.0) లో భాగంగా శిక్షణ తరగతులు ఎర్రగొండ పాలెంలోని అంబేద్కర్‌నగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సీడీపీవో ఎం. పద్మావతి పాల్గొన్నారు. బుధవారం మూడోవరోజు జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అందించాల్సిన సహాయ సహకారాలపై అవగాహన కల్పించారు. అలాగే తలసేమియా, హెమోపిలియా సికిల్‌సెల్ అనిమీయ గురించి వివరించారు. పిల్లల్లో శారీరక అభివృద్ధి, మానసిక అభివృద్ధి సామాజిక భావోద్వేగ అభివృద్ధి మూల్యాంకనంపై, ఎస్సెస్మెంట్ గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఏ.పద్మజ, కేవీ వెంకటసుబ్బమ్మ, ఎన్.శివలక్ష్మీ, ఎం.హైమవతి, డి.మరియకుమారి, పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్కాపురం, తర్లుపాడు అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడోరోజు పోషణ్ బీ పడాయిబీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీవో సుశీలాదేవి మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిన్నారులకు మెలుకువలతో కూడిన విద్యను అందించాలన్నారు. దివ్యాంగుల పిల్లలకు ఆధారిత సంరక్షణ బీసీడీఈ వాట్సప్ సహా యంతో నిత్యం విద్య నేర్పించడం వలన వారికి మానసిక మేథాశక్తి అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యను సరళంగా అర్థం చేసుకునేలా ఆటలు, పాటలు ముఖ్యపాత్ర పోషిస్తాయ న్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు కృష్ణవేణి, అరుణకుమారి, పాల్గొన్నారు.

మట్కా రాయుళ్లకు కౌన్సెలింగ్

గిద్దలూరుటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మట్కా ఆడించినా, ఆడినా చర్యలు తప్పవని అర్బన్ సీఐ కె.సురేష్ హెచ్చరించారు. గతంలో మట్కా ఆడుతూ పట్టుబడిన పలువురిని స్టేషన్‌కు బుధవారం పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. డబ్బు సంపాదించాలనే అత్యాశతో అప్పులపాలు అవుతారని, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌ల జోలికి వెళ్ళవద్దని సూచించారు. ఎప్పుడైనా, ఎక్కడైనా మట్కా, బెట్టింగ్‌లు వ్యసనాల జోలికి వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నగర పంచాయతీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

పొదిలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పొదిలి నగర పంచాయితీలో మౌళిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు ఎం.రమేష్ కోరారు. బుధవారం పొదిలి నగర పంచాయితీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పట్టణంలో తాగునీటి, వాడుకనీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నేతపాలెంలో డ్రైనేజీ సమస్య ఏళ్లుగా ఉన్నా సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదన్నారు. పొదిలి పెద్దచెరువు సాగర్ నీటితో నింపి పైపులైన్ నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం కమిషనర్ పి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి బాలనరసయ్య, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా చూడాలి

- మేట్ల శిక్షణలో ఏపీడీ నిర్మలాదేవి

పెద్దదోర్నాల, మార్చి26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీడీ నిర్మలాదేవి అన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మేట్లకు పనుల నిర్వహణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాసర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిధిగా హాజరైన ఆ శాఖ ఏపీడీ నిర్మలాదేవి మాట్లాడుతూ ఉపాధి పనులను ఎక్కువ మందికి కల్పించడం, వేతనాలు చెల్లింపులు, చేసిన పనులను కొలతలు తీయడం వంటి అంశాలను తెలిపారు. ఏపీవో వినయ్ మాట్లాడుతూ 50మంది సంఘంగా ఏర్పడి మేటును ఎన్నుకోవాలసి ఉంటుందన్నారు. పనుల్లో కూలీలకు రోజుకు రూ.300లు వచ్చేలా పనులు చేయించాల్సి ఉందన్నారు. పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఈసీ చాణక్య, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ


వరి పైరును పరిశీలిస్తున్న ఏవో సంపత్‌కుమార్

రైతులందరు గుర్తింపు సంఖ్యను పొందాలి

సీఎస్‌పురం(పామూరు) మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పొలం ఉన్న ప్రతి రైతు రైతు సేవాకేంద్రందా్వరా గుర్తింపు సంఖ్యను పొందాలని ఏవో బి. సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, అరివేముల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అన్ని రకాలడి పట్టా, అసైన్డ్‌మెంట్‌భూములకు రైతు గుర్తింపు సంఖ్య నమోదు చేసుకొనుటకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాదికారి పి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకట్‌రెడ్డి, వి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు. అలాగే పామూరు మండలంలోని పడమటకట్టకిందపల్లి, చిలంకూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం ఏవో కే రాధ నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకుధు కేఎఫ్‌బాబు

హామీలను నిలబెట్టుకోవాలి

● డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు

కనిగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు అన్నారు. స్థానిక ఎంఎస్ఎం కళాశాలలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయటంలో ప్రభుత్వం వినాయకుడి పెళ్లి సామెతను తలపిస్తుందన్నారు. ఎన్నికలకు ముందు తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ అని చెప్పి డీఎస్సీ అభ్యర్థులను ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటై 8నెలలు కావస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ తర్వాత అని కాలయాపన చేసి, నేడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే అని చెప్పి మార్చి, ఏప్రిల్ అంటూ మోసం చేస్తున్నారన్నారు. డీఎస్సీ నోటిపికేష్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రూప్స్, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శ్రీను, నెహమ్మత్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.


బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు లక్ష్మానాయక్

వసతి గృహాల అభివృద్ధికి కృషి

దర్శి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహాల అభివృద్ధికి కృషి చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎస్. లక్ష్మానాయక్ తెలిపారు. దర్శి పట్టణంలోని బాలికల వసతిగృహాన్ని బుధవారం రాత్రి ఆయన పరిశీలించారు. జరుగుతున్న మరమ్మత్తు పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శికి వసతిగృహ మరమ్మతులకు రూ.34 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఆ నిధులతో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పనులు నాణ్యతతో నిర్వహించాలని అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమాధికారిణి షేక్ రబియాబేగం వసతీగృహ సంక్షేమాధికారిణి రజనీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలో రికార్డుల తనిఖీ

దొనకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దొనకొండ గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిధులు దుర్వినియోగం జరిగిందనే ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి నుంచి కార్యాలయంలో ఉన్న రసీదు పుస్తకాలు, బీసీఆర్, చలానా ఫారాలు తనిఖీ చేశారు. వాటిల్లో వ్యత్యాసం పరిశీలించారు. ప్రస్తుత కార్యదర్శి కృష్ణమూర్తి, గతంలో ఇన్‌చార్జిగా పనిచేసిన కార్యదర్శి డేవిడ్‌తో నిధుల అవకతవకలపై చర్చించారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల వార్షిక అభివృద్ధి ప్రణాళికలను గ్రామ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో సంసిద్ధం చేస్తున్న తీరును పరిశీలించారు. ఇంటిపన్నుల వసూళ్ల వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆదాంషఫీ ఉన్నారు.

కరివేపాకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కరివేపాకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఆ గ్రామాల్లో సాగు చేసిన కరివేపాకు సాగుక్షేత్రాలను పరిశీలించారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున నీటి యాజమాన్య పద్ధతులు, అంతరకృషి, సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి పొందవచ్చునన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి

సీఎస్‌పురం(పామూరు) మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. మంచినీటి ఎద్దడి, గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాల గురించి చర్చించారు

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజాదర్బార్

టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. దర్శి టౌన్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల ఇబ్బందుల గూర్చి పట్టించుకోక పోవటంతో సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి 126 అర్జీలు దాఖలయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి డీఎస్పీ బి. లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, ఎంపీడీవో ఎల్. కృష్ణమూర్తి, ఈవోఆర్డీ ఆవుల సుధాకర్, విద్యుత్‌శాఖ ఈఈ పి. శ్రీనివాసులు, ఏడీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరికీ న్యాయం చేస్తాం

టీడీపీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలందరికీ తగిన గుర్తింపు ఇచ్చి న్యాయం చేస్తానని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా నిలుస్తానని, పార్టీ మరింత పటిష్ఠతకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తెలుగు మహిళా నాయకురాళ్లు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో అర్జీలు పరిశీలిస్తున్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే పాపారావు

చెత్తద్వారా సంపద సృష్టించాలి

చెత్త ద్వారా సంపద సృష్టించేందుకు అందరూ కృషి చేయాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కోరారు. మండలంలోని పోతవరంలో చెత్త సంపద కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, ఈవోఆర్డీ ఆవుల సుధాకర్, సర్పంచ్ తూము దివ్య, ఉప సర్పంచ్ జి. బాలరవణమ్మ పాల్గొన్నారు.

ఇరువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

తాళ్లూరు, :మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఇరువురికి టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. దర్శిలోని ఆమె నివాసంలో లబ్ధిదారులకు బుధవారం ఈ చెక్కులు అందించారు. లక్కవరం గ్రామానికి చెందిన నన్నం అంజయ్యకు రూ.46,849 చెక్కును, ఏ.చిన్నమ్మాయికి రూ. 42, 324 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మేడగం వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ లక్కవరం గ్రామ అధ్యక్షుడు బొడ్డు హనుమారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్‌తో స్నేహ సంబంధాలు మెరుగు

● ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

పామూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల మధ్య స్నేహ సంబంధాలు మెరుగై పరమత సహనం ఏర్పడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. టీడీపీ మండల ముస్లిం మైనార్టీసెల్ ఆధ్వర్యంలో స్థానిక విరువూరు రోడ్ పెద్ద మసీదు పక్కన పవిత్ర రంజాన్ ఉపవాసాలు ఆచరిస్తున్న ముస్లింలకు బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉగ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన (దువ)లో ఉగ్ర పాలొన్నారు. అల్లాహ్ దయ అందరిపై ఉండాలని ప్రార్థన చేసినట్లు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సహోదరులు కఠోర ఉపవాసాలతో పాటు భక్తిశ్రద్ధలతో ఉండటం విశేషమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అలాగే సోమవారం జరిగే రంజాన్ పండుగను ముస్లింలు కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని కోరారు. వారందరికీ ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని మసీదుల్లో పనిచేసే పేష్ ఇమాం, మౌజన్లకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా సమకూర్చిన నూతన వస్త్రాలను ఉగ్ర చేతుల మీదుగా అందజేసారు. అనంతరం ఇఫ్తార్ విందు భోజనాన్ని ఉగ్ర వడ్డించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం. భీమానాయక్, ఎస్ఐ టి. కిశోర్‌బాబు, టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, షేక్ షంషూర్, ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ ప్రత్యేక ప్రార్థనలో పాలొన్న ఉగ్ర

తొలివిడత ఫ్రీ సిలిండర్‌కు నెలాఖరుకు గడువు

దొనకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా గతేడాది నవంబర్‌లో అమలు చేసిన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి ఈనెలాఖరుకు గడువు ముగుస్తుంది. నాలుగు నెలలకు ఒక ఫ్రీ సిలిండర్ చెప్పున ఏడాదికి మూడు సిలెండర్లు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందించేలా కూటమి ప్రభుత్వం నిర్ణయించి అమల్లోకి తెచ్చింది.

తొలివిడత ఉచిత గ్యాస్ సిలిండర్‌ను గత ఏడాది నవంబర్ నుంచి మార్చి వరకు లబ్ధిదారులు పొందేలా అవకాశం కల్పించారు. మార్చి నెల పూర్తయ్యేందుకు కేవలం ఐదురోజులు మాత్రమే ఉండటం ఈలోపు గ్యాస్ సిలిండర్ పొందకుంటే లబ్ధిదారులు ఒక ఫ్రీ గ్యాస్ సిలెండర్ కోల్పోవాల్సి ఉంటుందనేది సమాచారం. ఏప్రిల్ నుంచి జూలై నెల వరకు రెండవ విడత ఫ్రీ గ్యాస్ సిలిండర్, ఆగస్టు నుంచి నవంబరు వరకు మూడవ విడత ఫ్రీ గ్యాస్ సిలెండర్ పొందేలా టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అవకాశం కల్పించింది. లబ్ధిదారులకు ఈకేవైసీ లేకపోయినా, ప్రభుత్వం బ్యాంక్ ఖాతాల్లో జమచేసే గ్యాస్ సిలిండర్ రాయితీ నగదు జమకాదు. దొనకొండలోని సాధియా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఇప్పటికే గ్రామాల్లో గ్యాస్ లబ్ధిదారులకు ఈకేవైసీ పట్ల అవగాహన కల్పిస్తూ దాదాపుగా 84 శాతం ఈకేవైసీ పూర్తి చేశారు. మిగిలిన 16 శాతం లబ్ధిదారులు జీవనోపాధి నిమిత్తం గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లినవారు గా గుర్తించినట్లుగా సమాచారం.

కొడుకు మరణ ధ్రువీకరణ పత్రం కోసం పాట్లు

వృద్ధ తండ్రిని కాళ్లరిగేలా తిప్పించుకుంటున్న అధికారులు

పీసీపల్లి,మార్చి26(ఆంధ్రజ్యోతి): కన్నకొడుకు చనిపోగా మరణధ్రువీకరణపత్రం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న ఓ వృద్ధ తండ్రి గోడు ఇది. బాధిత వృద్ధుడు తెలిపిన వివరాల మేరకు మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన కోటపాటి లక్ష్మీనరసయ్య కొడుకు ఈ ఏడాది జనవరి 12వతేదీన అనారోగ్యంతో మృతిచెందాడు. మృతిచెందిన తన కొడుకు మరణ ధ్రువీకరణపత్రం కోసం లక్ష్మీనరసయ్య పంచాయతీ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు.అయితే దరఖాస్తు నిర్ణీత గడువులోగా చేసుకోలేదని అందువల్ల మరణ ధ్రువపత్రం ఇవ్వలేమని ఎమ్మార్వో ఆఫీసుకు పోవాలంటూ కార్యదర్శి చెప్పారు. దీంతో ఆ గ్రామ వీఆర్వోను సంప్రదించాడు.మరణ ధ్రువీకరణ పత్రం పంచాయతీ కార్యాలయం లోనే తీసుకోవాలని ఉచిత సలహా ఇచ్చాడు.పంచాయతీ కార్యాలయానికి వెళ్తే వీఆర్వో దగ్గరకు వెళ్లమని, వీఆర్వో దగ్గరకు వెళ్తే పంచాయతీ కార్యాలయానికి వెళ్లమని చెప్తూ ఆ వృద్ధుడిని కాళ్లరిగేలా తిప్పుతున్నారు.మృతుడు సత్తిబాబు బీమా కలిగి ఉండడంతో ఆయన కుటుంబసభ్యులు మరణ ధ్రువీకరణపత్రం లేని కారణంగా బీమా నుండి వచ్చే నగదును పొందలేకపోతున్నారు. దీంతో విసిగి వేసారిన వృద్ధుడు లక్ష్మీనరసయ్య బుధవారం విషయాన్ని మీడియా దృష్టికి తీసుకొచ్చాడు.ఈ విషయాన్ని ఎమ్మెల్యే పీపీ ప్రసాదు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే వీఆర్వోకు ఫోన్‌చేసి తక్షణమే మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని సూచించారు.అయితే అధికారులు ఇప్పటికైనా మరణ ధ్రువీకరణపత్రాన్ని ఇస్తారో లేదో వేచిచూడాలి.


తన కొడుకు మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలంటూ వేడుకుంటున్న లక్ష్మీనరసయ్య

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

దర్శి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విజ్ఞప్తి చేశారు దర్శిలో బుధవారం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి పట్టణంలో జూన్ 21, 22, 23 తేదీల్లో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ మహాసభలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం. రమేష్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్‌డీ యాసీన్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కె. హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయయాదవ్ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

పామూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను ఎప్పడికప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని కనిగిరి డీఎల్‌పీవో ఎస్‌వీఎల్ హనుమంతరావు అన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జరుగుతున్న ఎల్‌టీసీలో భాగంగా బుధవారం కనిగిరి మండల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల భాగస్వామ్యంతో చెత్తసంపద కేంద్రాలను ఆదాయవనరుల కేంద్రంగా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పామూరు, కనిగిరి ఈవోపీఆర్డీలు జీవీ అరవిందారెడ్డి, డీఆర్పీ రాఘవులు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ఏర్పాటు

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చుకొనేందుకు కూలింగ్ మినరల్ వాటర్ క్యాన్లను పాబోలు జ్యుయలర్స్ అధినేత పాబోలు రమేష్ బుధవారం ప్రారంభించారు. రెండు నెలలపాటు మంచినీరు క్యాన్లను సరఫరా చేస్తానని తెలిపారు.

వేసవిలో మెరుగైన విద్యుత్‌ను అందించాలి

ముండ్లమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి వినియోగ దారులకు మెరుగైన విద్యుత్‌ను అందించాలని దర్శి డివిజన్ ఏపీసీపీడీఎల్ ఈఈ పీ శ్రీనివాసులు అన్నారు. ఆయన బుధవారం స్థానిక సబ్ స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బందికి సమావేశం నిర్వహించి వేసవిలో లో వోల్టేజీ సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముందుగా సిబ్బంది గ్రామాలకు వెళ్లి లో వోల్టేజీ ఉన్న గ్రామాలను గుర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. మండలంలోని సబ్‌స్టేషన్‌ల పరిధిలో అధిక లోడును గుర్తించి ఇటీవల అదనపు కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మాలు ఏర్పాటు చేస్తామన్నారు.విద్యుత్ బకాయిలు వసూలు చేయటంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఈఈ శ్రీనివాసులు చేతుల మీదుగా ఎర్త్ రాడ్స్‌ను అందజేశారు. ముండ్లమూరు, పసుపుగల్లు, మారెళ్ల లైన్‌మెన్‌లు మధుబాబు, సోమ్లా నాయక్, కోటేశ్వరరావు, రాజేష్, గురవయ్య, నవీన్, బ్రహ్మం తదితరులను అభినందించి ఎర్త్‌రాడ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వై.కృష్ణారెడ్డి, ఏఈ అంకబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్ సాంబయ్య, లైన్‌మెన్ ఆంజనేయులు, సిబ్బంది గురవయ్య, యలమంద ఉన్నారు.


మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

నవోదయకు పలు పాఠశాలల విద్యార్థినుల ఎంపిక

దొనకొండ, పామూరు, కనిగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నవోదయ ప్రవేశపరీక్షల్లో పలువురు విద్యార్థినులు ఆరో తరగతిలో చేరేందుకు సీట్లు పొందారు.

దొనకొండ స్థానిక వివేకానంద ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న జి. స్రవంతి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బీవీఆర్ మల్లికార్జున తెలిపారు. అలాగే పామూరు మండలంలోని మోపాడుకు చెందిన యూనిక్ అకాడమీ విద్యార్థిని డి. శరణ్య ఎంపికైంది. అలాగే కనిగిరి ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదివిన విద్యార్థిని కేసనపల్లి గ్లోరీ ప్రతిష్ఠిత నవోదయకు ఎంపికైంది.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

ముండ్లమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఏపీవో కే నాగరాజు అన్నారు. ఆయన బుధవారం స్థానిక డ్వామా ఉపాధి హామీ కార్యాలయంలో సీనియర్ మేట్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

పనులపై మేట్‌లు అవగాహన కలిగి ఉండాలి

తాళ్లూరు :ఉపాధి హామీ పనుల నిర్వహణలో మేట్‌లు పూర్తి అవగాహన కలిగి ఉండి పనులు చేయించాలని ఏపీవో బి.మురళి తెలిపారు.స్థానిక ఎంఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధిమేట్‌లకు బుధవారం శిక్షణ నిర్వహించారు.

సీఎస్‌పురంలో

సీఎస్‌పురం(పామూరు) : ఉపాధి కూలీలకు రోజు వారీ వేతనం రూ.300లు పడేలా మేట్‌లు కృషి చేయాలని ఏపీవో శ్రీనివాస్‌నాయక్ అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో మేట్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ముఖాముఖి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

● ఎం. జాస్మిన్, వైద్యాధికారి, ముండ్లమూరు

ముండ్లమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) :



ప్రశ్న: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు?

డాక్టర్ : ఆరోగ్యం కేంద్రం పరిధిలో ఉన్న రోగులకు 24/7 అందుబాటులో ఉంది. రోగులకు అన్ని విధాలా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

ప్రశ్న : గ్రామాల్లో రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

డాక్టర్: గ్రామాల్లో నెలకు రెండు సార్లు ఎఫ్‌డీటీ ఫిక్స్‌డే సర్వీస్ ద్వారా రోగులకు, గర్భిణులకు ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నాం. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న : వేసవిలో ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

డాక్టర్ : వేసవిలో ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశా వర్కర్లు వెళ్లి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం.

ప్రశ్న : గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారా?

డాక్టర్: ప్రతి ఇంటికి వెళ్లి తమ సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి క్యాన్సర్, స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. క్యాన్సర్‌ను నిర్ధారించటానికి జిల్లా ఆస్పత్రులకు పంపించి క్యాన్సర్ ఉందో లేదో నిర్ధారిస్తున్నాం.

ప్రశ్న: ఆస్పత్రి అభివృద్ధికి మంజూరైన నిధులను ఎలా ఖర్చు పెడుతున్నారు?

డాక్టర్ : ఆస్పత్రి అభివృద్ధికి రూ 1.75 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఆస్పత్రి అభివృద్ధి పనులతో పాటు శానిటరీ, దోబీ లాంటి వారికి జీతాలు ఇస్తున్నాం.

ప్రశ్న : కుక్క కాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందా?

డాక్టర్ : కుక్క కాటుకు వ్యాక్సిన్‌తో పాటు పాము కాటుకు గురైన వారికి మందు, పురుగు మందు తాగిన వారికి వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

ప్రశ్న : ఆస్పత్రిలో మందుల కొరత ఏమైనా ఉందా?

డాక్టర్ : ఆస్పత్రిలో కొన్ని వ్యాధులకు మందులు లేవు. కొరత ఉన్న మాట వాస్తవం.

నేడు పెద్దన్నపల్లిలో ఆధార్‌కేంద్రం

పీసీపల్లి,మార్చి26(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దన్నపల్లిలో గురువారం ఆధార్‌సెంటరును ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కేంద్రంలో 6సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆధార్‌లు తీయించుకోవాలని ఆయన అన్నారు. ముద్దపాడు, తలకొండపాడు సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఉండే చిన్నారులందరూ తప్పనిసరిగా ఆధార్‌లు తీయించుకోవాలని ఆయన సూచించారు.ఆధార్‌కార్డులలో ఏమైనా తప్పులు ఉంటే వాటిని సవరించుకోవచ్చని తెలిపారు.ఈ అవకాశాన్ని ముద్దపాడు, తలకొండపాడు సచివాయలయాల పరిధిలోని గ్రామప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

తొమ్మిది గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్ల కేటాయింపు

ముండ్లమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ మిషన్ కార్పొరేషన్ కింద ట్రాక్టర్లు మంజూరైనట్టు ఎంపీడీవో ఆర్. జనార్దన్ బుధవారం తెలిపారు. మారెళ్ల, ఉమామహేశ్వర అగ్రహారం, నాయుడుపాలెం, పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, ముండ్లమూరు, ఈదర, కెల్లంపల్లి, శంకరాపురం గ్రామ పంచాయతీలకు విడుదలయ్యాయి. ట్రాక్టర్లు గ్రామ పంచాయతీలకు కేటాయించి గ్రామంలో చెత్తాచెదారాన్ని వాటి ద్వారా డంపింగ్ యార్డుల్లో వేసేందుకు ప్రభుత్వం ట్రాక్టర్లు మొదటి విడతగా పంచాయతీలకు విడుదల చేసిందని ఎంపీడీవో తెలిపారు.

హోటల్‌లో చోరీ

ముండ్లమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముండ్లమూరులోని సోమేపల్లి నరేంద్ర నిర్వహిస్తున్న బంగారయ్య హోటల్‌లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హోటల్ ముందు ఉన్న రూ.12వేలు విలువ చేసే పొయ్యి, పెన్నెం బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఇదే హోటల్‌లో ఈనెల 6వ తేదీ కూడా దొంగతనానికి పాల్పడ్డారు. నెల తిరగక ముందే రెండు సార్లు అదే హోటల్‌లో దొంగతనానికి పాల్పడటంతో హోటల్ నిర్వాహకుడు నరేంద్ర ఆందోళన చెందారు. బస్టాండ్ సెంటర్‌లోనే ఇలా చోరీ జరగటం మిగతా హోటల్ నిర్వాహకులు కూడా ఆందోళన చెందుతున్నారు.

చేపల వేటకు వెళ్లి వాగులో పడి మృతి


మృతిచెందిన మీనగ చినబాబు (22)

ముండ్లమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మలూరు గ్రామానికి చెందిన మీనగ చిన బాబు(22) అనే యువకుడు చేపల వేటకు వెళ్లి ప్రవమాదవశాత్తు వాగులోకి పడి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సా యంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే మీనగ అంజయ్య కోటేశ్వరమ్మల నాల్గవ కుమారుడైన చినబాబు గ్రామానికి సమీపంలోని చిలకలేరు వాగుకు చేపలు పట్టుకొనేందుకు వెళ్లాడు. వాగులోకి వెళ్ళి ఇటీవల ఇసుక ఇసుక తీసిన గుంతలో వల వేశాడు. కొంతసేపటి తరువాత వలను లాగుతుండగా ఒక్కసారిగా కాలు జారి గుంతలో పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చీకటి పడుతున్నా కూడా ఇంటికి చేరుకోక పోవటంతో తల్లిదండ్రులు ఫోన్ చేయగా ఎత్తక పోవటంతో వాగు వద్దకు వెళ్లి చూడగా వాగులో మృతి చెంది ఉన్నాడు. వెంటనే మృత దేహాన్ని ఇంటికి తీసుకు వచ్చారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


బాపట్ల జిల్లా వార్తలు

5

గురువారం 27 మార్చి 2025



ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్



గడువు ఇలా..

* ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌లకు సంబంధించిన పనులు ఆరు మాసాల్లోగా పూర్తి చేయాలి.
* ఏఐఎస్ కార్యదర్శులకు సంబంధించి 90 బంగ్లాలు, ప్రిన్సిపల్ కార్యదర్శులకు 25 బంగ్లాలు, మంత్రులకు 35, హైకోర్టు జడ్జిలకు 36 బంగ్లాలను నిర్మిస్తున్నారు. ఈ పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేసి అప్పగించాలి.

పునర్నిర్మాణం జరుపుకుంటున్న ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలు

టెండర్లు పూర్తి.. మొదలైన పనులు

- పెండింగ్ పనులకు రూ.1112.74 కోట్లు
- రాజధానిలో రంగంలోకి దిగిన కాంట్రాక్టు సంస్థలు
- 4043 ప్రభుత్వ నివాసాల పూర్తికి గడువు నిర్దేశం

వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని పాడుపెట్టగా కూటమి ప్రభుత్వం తిరిగి గతంలో నిలిచిపోయిన పనులను పట్టాలెక్కిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ భవనాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించింది. గతంలో చాలావరకు నిర్మాణాలు పూర్తి చేసుకుని వైసీపీ హయాంలో పాడుబడిన భవనాలను ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిశీలించి వాటిపై దృష్టి సారించాలని సీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా పనులను పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ ఇటీవల టెండర్లు నిర్వహించింది. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థలు రాయపూడికి చేరువగా ఈ-3, ఈ-4 రోడ్ల మధ్య 59.46 ఎకరాల్లో ఏఐఎస్, పిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, న్యాయమూర్తులకు చెందిన నివాస భవన నిర్మాణాలను చేపట్టాయి. 2019 నుంచి పాడుపడిన భవనాల సముదాయంలో పెద్ద ఎత్తున కమ్మేసిన ముళ్ల కంపలను తొలగించి శుభ్రం చేశాయి. అసంపూర్తి భవనాలను పరిశీలించి ఎక్కడెక్కడ ఏమేమి పనులు చేపట్టాలన్న దానిపై ఆయా కాంట్రాక్టు సంస్థల ఇంజనీర్లు కసరత్తులు చేస్తున్నారు. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఏడాది గడువు విధించింది. దీంతో ఆయా పనులు శర వేగంగా చేపట్టేందుకు కాంట్రాక్టు సంస్థలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో ప్రభుత్వ సెక్టారులో తొలివిడతగా 4043 నివాసాల పూర్తికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో వీటి నిర్మాణ పనులు క్రమంగా ఊపందుకుంటున్నాయి. ఇవన్నీ గత 2019 నాటికి మొదలు పెట్టి చాలా వరకు పూర్తయినవే. అయితే వైసీపీ ప్రభుత్వ పుణ్యమా అంటూ అవన్నీ గత ఐదేళ్లుగా పాడుపడి ఉన్నాయి. ఇపుడీ భవన సముదాయాలన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఆలిండియా సర్వీసెస్ కార్యదర్శుల బంగ్లాలు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్లు ప్రధానంగా ఉన్నాయి. ఈ భవన

(మిగతా 6వ పేజీలో)

నిధులు ఇలా..

ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలకు రూ.411.37 కోట్లు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలకు రూ.401.37 కోట్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లకు రూ.300 కోట్లు కేటాయించారు. వీటికి సంబంధించి తాజాగా టెండర్లను పిలవగా కేఎంవీ సంస్థ దక్కించుకుంది. ఏఐఎస్ బంగ్లా ఒక్కోటి నాలుగు వేల చ.అడుగుల విస్తీర్ణంలో, ప్రిన్సిపల్ కార్యదర్శుల బంగ్లాలు ఐదు వేల చదరపు అడుగుల్లో ఏర్పాటవుతున్నాయి. మంత్రులు, న్యాయమూర్తుల కోసం 26.09 ఎకరాల్లో 71 బంగ్లాల నిర్మాణ పనులను టీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ రూ.401.37 కోట్లతో చేపట్టింది. ఇవి ఆరు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+1 విల్లాల రూపంలోనే ఉంటాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం రాయపూడి ప్రాంతంలోనే సీడ్ యాక్సిస్ రోడ్డు వెంబడి పన్నెండేసి అంతస్తులతో కూడిన 18 టవర్ల(432 ఫ్లాట్లు)ను గతంలో రూ.450 కోట్లతో నిర్మించారు. ఇవన్నీ దాదాపు సివిల్ వర్కులను పూర్తి చేసుకున్నాయి. వీటిలో ఇంటీరియర్ వర్కులు, ఇతర మౌలికవసతులను కల్పించాల్సి ఉంది. ఆయా పనులకు రూ.300 కోట్లను కేటాయించి ప్రభుత్వం టెండర్ నిర్వహించగా ఎన్‌సీసీ సంస్థ దక్కించుకుంది.



భవన సముదాయాల మధ్య ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేస్తున్న దృశ్యం

అభివృద్ధే లక్ష్యం

- టూరిజం, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి
- సాగునీటి కాల్వల ఆధునికీకరణ, గ్రీన్‌ఫీల్డ్ పోర్టు సాధన

- జిల్లా వృద్ధి రేటు ప్లస్ 1.02, తలసరి ఆదాయం రూ.2,76,038
- కలెక్టర్ల సదస్సులో జిల్లా అభివృద్ధి ప్రణాళికపై సీఎం చంద్రబాబు
- సమస్యలతో పాటు అభివృద్ధి ప్రణాళికలను వివరించిన కలెక్టర్ వెంకటమురళి



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా అభివృద్ధే లక్ష్యం కావాలి. ఎంత ఖర్చవుతుందనే దాని గురించి ఆలోచన వద్దు. కేంద్రంతో సమన్వయం చేసుకుని అన్నీ సాధించుకుందాం. సాగునీటి కాల్వల ఆధునికీకరణ, ఫిషింగ్ హార్బర్‌తో పాటు మోటుపల్లి గ్రీన్‌ఫీల్డ్ పోర్టు సాధన వరకు జిల్లాకు సంబంధించి అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపడతాం.' అని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో బుధవారం జిల్లాకు సంబంధించి కలెక్టర్ వెంకటమురళి వివరించిన అనేక అంశాలపై సీఎం స్పందించారు. జోన్-3లో ఉన్న బాపట్ల జిల్లా వృద్ధి రేటులో ప్లస్ 1.02 నమోదు చేసిందని, తలసరి ఆదాయం ఏడాదికి రూ.2,76,038 గా ఉందన్నారు. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కన్నా జిల్లా దిగువనే ఉంద న్నారు. జిల్లా కేంద్రంలో డయాలసిస్, ట్రామా సెంటర్ ఆవశ్యకత గురించి కలె క్టర్ వివరించగా ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఆక్వాపార్కు విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ పురోగతి చూపెట్టాలన్నారు. రివర్ టూరి జం, కుందేరు డ్రెయిన్, వైద్య కళాశాల నిర్మాణాల గురించి కలెక్టర్ వివరించగా సీఎం సానుకూలంగా స్పందించారు. పర్యాటక రంగాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవడంతో పాటు సమాంతరంగా మౌలిక సదుపాయాలపై కూడా దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. కలెక్టర్ వెంకటమురళి ఆక్వా పార్కు గురించి పీపీటీ ఇవ్వగా సీఎం మాట్లాడుతూ కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ అన్నీ చేద్దామని ముఖ్యమంత్రి చెప్పారు. ఆక్వా పార్కు నిర్మాణం విషయంలో కొత్తగా వచ్చిన పాలసీని కలెక్టర్ సీఎంకు వివరించగా బీచ్ రూంలతో పాటు టూరిజంపై పరిశీలించాలన్నారు. జిల్లాలోని సమస్యలను, అభివృద్ధి ప్రణాళికలను సీఎంకు కలెక్టర్ తెలిపారు. టూరిజం, ఆక్వా, లైవ్‌స్టాక్ రంగాలలో జిల్లా అభివృద్ధికి అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. టూరిజం పురోగతికి ఉన్న సానుకూలతలను సదస్సులో చెప్పడంతో పాటు ప్రస్తుతం తీసుకున్న చర్యలను వివరించారు. ఆక్వా రంగం ద్వారా కూడా జిల్లాలో ఉపాధి అవకాశాలు విస్తృతం చేయవచ్చని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సెర్ప్‌లో రూ.300 కోట్లు వరకు నిధులు ఉన్నాయని వాటిని లైవ్‌స్టాక్‌కు ఖర్చు పెట్టడం ద్వారా పదివేల కుటుంబాలకు సాయం అందించవచ్చన్నారు. కాల్వల ఆధునికీకరణకు మరో రూ.23 కోట్లు ఖర్చు అవుతుందని, కృష్ణా వరదలను తట్టుకునేలా కరకట్టలను పటిష్ఠం చేయాలని సీఎంకు కలెక్టర్ తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (గురువారం సాయంత్రం) సహరి : 4.50 (శుక్రవారం ఉదయం)



రూ.5 లక్షల మిరప విత్తనాలు సీజ్

- మామిళ్లపల్లిలో రహస్యంగా రాత్రిళ్లు తయారీ
- విజిలెన్స్ దాడులు.. 7875 కేజీల నిల్వలు స్వాధీనం

అద్దంకి, గుంటూరు సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మామిళ్లపల్లి సమీపంలోని పొలాల్లో అనుమతి లేకుండా మిరప విత్తనాలను ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేస్తుండగా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు బుధవారం దాడి చేసి రూ.4,98,500 విలువైన 7875 కిలోల విత్తనాలను సీజ్ చేశారు. గుంటూరులోని ఆదర్శనగర్‌కు చెందిన చెన్నకేశవ ట్రేడర్స్ ప్రతినిధి సంపతి శ్రీనివాస రావు రెండు రోజుల నుంచి రాత్రి సమయంలో గ్రేడింగ్ మిషన్‌లు, ప్యాకింగ్ మిషన్‌లను ఉపయోగించి మిరప విత్తనాలు ప్రాసెసింగ్ చేస్తున్నట్లు విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్యశ్రావణ్‌కుమార్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాలతో మామిళ్ళపల్లి గ్రామ శివారులో తెల్లగొర్ల వెంకటకృష్ణకు చెందిన వ్యవసాయ పొలంలో అత్యంత గోప్యంగా నకిలీ మిర్చి విత్తనాలు తయారు చేస్తున్న కేంద్రంపై బుధవారం తెల్లవారుజామున అధికారులు దాడులు చేశారు. రహస్యంగా కేవలం రాత్రి వేళల్లో మాత్రమే వీరు విత్తనాలను తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలు తీసుకువచ్చి వాటిని ప్రాసెసింగ్ చేసి పేరున్న కంపెనీల ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నారన్నారు. 3500 కేజీల నాసిరకం మిరప విత్తనాలు, రవాణాకు సిద్ధం చేసిన 4375 కేజీల విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ కేంద్రంలోని జనరేటర్, రెండు పెద్ద యంత్రాలు, ఒక కుట్టు మిషన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మిరప విత్తనాలు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి గ్రేడింగ్, ప్రాసెసింగ్ చేసి అధిక ధరలకు వ్యాపారులకు హోల్‌సేల్ గా అమ్మకాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వ్యవసాయ అధికారి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు. సీజ్ చేసిన మిరప విత్తనాలను అద్దంకి సమీపంలోని కోల్డ్ స్టోరేజీలో ఉంచినట్లు ఏవో తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు కొమ్మాలపాటి చంద్రశేఖర్, శివాజీ, విజిలెన్స్ వ్యవసాయాధికారి ఆదినారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మామిళ్లపల్లి సమీపంలో పొలాలలో ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేస్తున్న మిరప విత్తనాలను పరిశీలిస్తున్న రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు

దంపతుల మధ్య వాగ్వివాదం

పురుగుల మందు తాగి భార్య ఆత్మహత్య

అద్దంకి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కుమార్తె విషయంపై దంపతుల మధ్య చోటుచేసుకున్న వాగ్వివాదం భార్య మృతికి కారణమైంది. మండలంలోని విప్పర్లవారిపాలెంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని విప్పర్లవారిపాలెంలో గోసాల శ్రీనివాస్, విజయలక్ష్మి(42)కి కుమారుడు, కుమార్తె సంతానం. కాగా, కుమార్తె అద్దంకిలో 8వ తరగతి చదువుతుంది. ఈ నెల 24 కుమార్తె పాఠశాలకు వెళ్లలేదు. బడికి వెళ్లకపోవడం, సరిగ్గా చదవడం లేదని తల్లి విజయలక్ష్మి కుమార్తెను మందలించింది. ఈ విషయాన్ని కుమార్తె తండ్రి శ్రీనివాస్‌కు చెప్పింది. ఆయన భార్య విజయలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన విజయలక్ష్మి పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను మేదరమెట్ల, ఒంగోలు వైద్యశాలలో చికిత్సల అనంతరం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్థరాత్రి తర్వాత మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

4 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

యడ్లపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక), పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షుడు ముత్తవరపు సురేష్ బాబు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏప్రి ల్ 4న రాత్రి 7.30గంటలకు చిగురు మేఘం, 9.30కు కిడ్నాప్, 10.30కు విడాకులు కావాలి, 5న రాత్రి 7.30కు జనరల్ బోగీలు, 8.30కు నా శత్రువు, 9.30కు రుతువులేని కాలం, 10.30కు గురితప్పిన వేట, 6న రాత్రి 7.30కు నాన్న నేను వచ్చేస్తున్నా, 8.30కు బ్రహ్మస్వరూపం, 9.30కు బావా ఎప్పుడు వచ్చితివి మొదలగు నాటికలు ప్రదర్శితమవుతాయని సురేష్‌బాబు తెలిపారు.

ఎంపీపీ ఎన్నిక.. ఉత్కంఠ

- పిట్టలవానిపాలెం ఎంపీపీ ఎన్నిక నేడు
- క్యాంపు రాజకీయానికి తెరలేపిన వైసీపీ
- చివరి నిమిషంలో సమీకణాలు మారే అవకాశం!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పిట్టలవానిపాలెం మండలం ఎంపీపీ ఎన్నిక విషయంలో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపంది. దీంతో గురువారం జరిగే ప్రక్రియపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మండల పరిధిలో ఉన్న 11 ఎంపీటీసీ స్థానాల్లో 10 వైసీపీ ఖాతాలోనే ఉన్నట్లు సమాచారం. కానీ ఎంపీపీ స్థానం చేజిక్కించుకోవడంలో నేతలను అభద్రతా భావం వెంటాడడంతో క్యాంపు రాజకీయానికి తెరలేపినట్లు సమాచారం. ఎన్నిక జరుగుతున్న ఎంపీపీ స్థానం స్థానిక ఎమ్మెల్యే సొంత మండలం కావడంతో చివరి నిమిషంలో మారే రాజకీయ సమీకరణాలపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. తొలుత చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి కాగానే అప్పటి వరకు ఎంపీపీగా ఉన్న షేక్ బాజీ దాదాపు ఏడాది క్రితమే రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మండల పరిధిలోని మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఒకరు గతంలోనే టీడీపీ బాట పట్టగా మరొకరు అంగీకారం తెలిపినట్లు సమాచారం. అయితే సంఖ్యాబలంగా చూస్తే వైసీపీకే మెజారిటీ ఉంది. కానీ ఎన్నిక చేతులెత్తే విధానంలో జరుగుతుం డడం, వారిలో ఉన్న అంతర్గత కుమ్ములాటల మూలంగా చివరి నిమిషంలో రాజకీయ సమీకరణాలు మారితే మాత్రం దానిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

సాంకేతిక పరిజ్ఞానంతో గస్తీ

- అనుమానిత వ్యక్తుల వేలిముద్రల సేకరణ
- నెల రోజుల్లో జిల్లాలో 7,953 మంది వేలిముద్రల స్కాన్

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గస్తీ విధులలో పాల్గొనే పోలీసు సిబ్బంది నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఎం.ఎస్.సి.డి పరికరం ద్వారా అనుమానితుల వేలిముద్రలను సేకరిస్తున్నారు. గడిచిన నెల రోజుల్లో జిల్లావ్యాప్తంగా 7,953 మంది అనుమానితుల వేలిముద్రలు సేకరించారు. ప్రధానంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఏటీఎంలు, బ్యాంక్‌లు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పోలీసులు విస్తృతంగా గస్తీ నిర్వహిస్తున్నారు. గస్తీ సిబ్బంది విధుల్లో ఉన్న సమయంలో ఎవరైనా అనుమానితులు తారసపడితే వారిని విచారించి వేలిముద్రను మొబైల్ సెక్యూరిటీ చెక్‌డ్ డివైజ్ పరికరం ద్వారా సేకరిస్తున్నారు. గతంలో వారు నేరం చేసి ఉంటే ఆ వివరాలు అందులో వస్తాయి. అనుమానితుడు వేలిముద్రలను స్కాన్ చేసి వారిపై ఎక్కడైనా కేసు నమోదైనట్టైతే ఆ వివరాలను తెలుసుకుని స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు సమాచారం అందిస్తున్నారు. తద్వారా ఆయా నేరగాళ్ల ఆటకట్టేందుకు పోలీసులకు అవకాశం ఏర్పడింది.

అన్ని పోలీస్‌స్టేషన్లలో అమలు : ఎస్పీ డూడీ

ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేవిధంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ పరిధిలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఇప్పటి వరకు స్కాన్ చేసిన వారిలో 17 మంది గతంలో వివిధరకాల కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అత్యవసర సమయంలో మినహ వివిధ కారణాలతో అర్ధరాత్రుళ్లు బయటకొచ్చేవారు తప్పనిసరిగా గుర్తింపుకార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. కార్డులేనివారిని అనుమానితులుగా పరిగణించి విచారించాల్సి ఉంటుందన్నారు. గస్తీ పోలీసులు ప్రశ్నించినప్పుడు వారికి సహకరించాలన్నారు.

పేద విద్యార్థినులకు వరం కేజీబీవీ

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 కేజీబీవీలు..
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్

గుంటూరు (విద్య) మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థినులు (డ్రాపవుట్స్), తల్లిదండ్రులకు దూరమైన అనాథ విద్యార్థినులకు అవి దేవాలయాలు.. విద్యార్థినులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించడం తోపాటు వారి సర్వతో అభివృద్ధికి అవి బాటలు వేస్తాయి... ఆ విద్యాలయాలే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) ఇందులో ప్రవేశం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది.

ఇంటర్ వరకు ఉచిత విద్య

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉన్నాయి... ఇందులో 6 నుంచి ఇంటర్ వరకు ప్రవేశం కల్పిస్తారు. ఆయా కేజీబీవీలో ప్రవేశం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. సమగ్ర శిక్షా ఆధ్వర్యం లో నిర్వహించే ఈ విద్యాలయాల్లో విద్యార్థినులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యను అందిస్తారు. ఈ (2025-26) విద్యా సంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

వీరికి ప్రాధాన్యం

అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులు https:apkgbv.apcfss.in అనే ద్వారా పొందవచ్చని సూచించా రు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందన్నారు. సందేహాలకు 70751-59996, 70750-39990 నంబర్లలో సంప్రదించవచ్చు.





అడుసుమల్లిలో అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రభుత్వ మద్దతు ధరను వినియోగించుకోవాలి

పర్చూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అపరాల రైతులకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను వినియోగించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.రామమోహన్‌రావు అన్నారు. బుధవారం పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో మార్కుఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీయస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల నేతృత్వంలో ప్రారంభించారు. ఈసందర్భంగా పీఏసీఎస్ సీఈవో దొప్పలపూడి రమాదేవవి ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారుల నుంచి రైతులను కాపాడి నాణ్యమైన మద్దత్తు ధరను కల్పించి కొనుగోలు చేసే విధంగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగుతుందన్నారు. అందులో భాగంగా శనగ క్వింటాకు రూ.5650, మినుములు క్వింటాకు రూ.7400, పెసలకు రూ.8682 చొప్పున ప్రభుత్వం మద్దతు ధరను కల్పించడం జరిగిందన్నారు. నాఫెడ్, మార్కుఫెడ్ సహకారంతో సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్.రామ్మోహన్‌రెడ్డి, స్థానిక నేతలు రైతులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడి జన్మదిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ నేతృత్వంలో కేక్‌కట్ చేసి శుబాకాంక్షలు తెలిపారు.

33 మందికి ఉద్యోగావకాశాలు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఇంకొల్లు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఇంకొల్లు మారుతీ ఐటీఐ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో 33 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్గినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ తెలిపారు. బుధవారం జరిగిన జాబ్‌మేళాలో ఐటీఐ, డిగ్రీ చదివిన అభ్యర్థులు 67 మంది హాజరుకాగా గోదావరి ఆంధ్ర మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ వారు డిగ్రీ అర్హత కలిగిన 10 మందిని నెలకు రూ.15వేల జీతంతో, ఆవిష్కరణ్ ఇండస్ట్రియల్ ప్రైవేటు లిమిటెడ్, ఇండోసోలార్ ప్రైవేటు లిమిటెడ్ వారు ఐటీఐ అర్హత కలిగిన 23మంది అభ్యర్థులను నెలకు రూ.18వేల జీతంతో మొత్తం 33 మందిని ఎంపిక చేసినట్లు మారుతీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ప్లేస్‌మెంట్ అధికారి బి.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాజారావు, కోఆర్డినేటర్ వినోద్, కంపెనీల ప్రతినిధులు, ఐటీఐ కళాశాల సిబ్బం ది రాఘవ, సుధాకర్, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

సాయంతో ఆర్థికంగా ముందుకు

బుర్లవారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో ఉన్నవారికి ఉపాధి మార్గం ద్వారా భరోసా కల్పిస్తే సులువుగా జీవనం సాగిస్తారని లెట్స్ హెల్ప్ సంస్థ ప్రతినిధులు కిరణ్‌కుమార్ అన్నారు. బుర్లవారిపాలెంకు చెందిన గండు కోటేశ్వరమ్మ నిరుపేద కావడంతో సంస్థ సహకారంతో బుధవారం ఆమెకు రూ.30వేలు నగదు అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అందించిన సహకారంతో గెదెను కొనుగోలు చేసుకుని జీవనం సాగించాలని సూచించారు. ఎన్ఆర్ఐ రామిశెట్టి దిలీప్‌కుమార్, అనూష దంపతుల ఆర్థిక సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దయాకర్, డేవిడ్, రాజేష్, సాంబయ్య, ప్రకాష్, డానియేల్, రాజు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అధికారులు

మార్టూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షల కేంద్రాలను బుధవారం స్టేట్ జనరల్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి,జిల్లా పరిశీలకురాలు గంగా భవాని పరిశీలించారు. వారు పరీక్షలు నిర్వహిస్తున్న మార్టూరు, రాయల్, శ్రీచైతన్య హైస్కూల్స్, మండలంలోని వలపర్ల హైస్కూల్‌ను పరిశీలించారు. కేంద్రాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో 953 మంది విద్యార్థులకు గాను 944 మంది హాజరైనట్లు ఎంఈవో వస్రాం నాయక్ అధికారులకు తెలిపారు.

బ్రాహ్మణ సేవా సమాఖ్యకు టంగుటూరి ఎంపిక

అద్దంకిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా అద్దంకికి చెందిన టంగుటూరి ప్రకాశంను నియమించారు. ఆ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోనూరి సతీష్ శర్మ, హెచ్‌కే మనోహర్‌రావుల నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయని ప్రకాశం తెలిపారు. ఈసందర్భంగా అద్దంకిలోని బ్రాహ్మణ సంఘ నాయకులు సుబ్బారావు, పద్మనాభశర్మ, రవితేజ, పొన్నలూరి కిరణ్‌కుమార్, ప్రభాకర్, ఈదర శివప్రసాద్, శ్రీనివాసరావు, రుషి, విజయకుమార్, మణి తదితరులు టంగుటూరి ప్రకాశంను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ భవనాలపై.. ఫోకస్

(5వ పేజీ తరువాయి)

నిర్మాణ పనులను రూ.1112.74 కోట్లతో చేపడుతున్నారు. టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు ఆయా ప్రాంగణాల్లో జంగిల్ క్లియరెన్స్ చేశాయి. అసంపూర్తిగా నిలిచిన భవనాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాల్ని తొలగిస్తూ మొత్తం ప్రాంతాన్ని శుభ్రం చేయించాయి. 2019 నాటికి కొన్ని 90 శాతం, మరికొన్ని 50 శాతం, ఇంకొన్ని పునాదుల దశ వరకు నిర్మాణపనులను జరుపుకున్నాయి. వీటిని అన్ని హంగులతో, పూర్తి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గెజిటెడ్ అధికారులు, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-డీ అధికారుల కోసం మరో 1440 ప్లాట్‌ల నిర్మాణాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టగా అవి 66శాతం వరకు పూర్తయ్యాయి. ఇక నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కోసం నేలపాడు వద్ద మరో 1995 ఫ్లాట్లు వచ్చే విధంగా బహుళ అంతస్తులతో కూడిన భవన నిర్మాణాలను చేపట్టి 62శాతానికి పైగా పూర్తి చేశారు. వీటన్నింటిని ఇపుడు మళ్లీ పూర్తిస్థాయిలో పునర్నిర్మించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, హైకోర్టు జడ్జిలకు సంబంధించిన బంగ్లాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించగా 2019లో నిలిచిపోయాయి. ముళ్ల కంపల నడుమ పాడుపడినట్లున్న ఈ భవన సముదాయాల పనులను ప్రభుత్వం తాజాగా చేపట్టింది. నిర్దేశించిన గడువుకన్నా ముందరే ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని ఆయా సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లో గడువు పెంచేది లేదని తేల్చిచెప్పింది. నాణ్యత విషయంలో రాజీ పడటానికి వీలులేదని సూచించింది. ఈ భవన సముదాయాల్లో అంతర్గత రహదారులను ఏర్పాటుచేయడంతోపాటు ఇంటీరియర్ వర్కులు, ఫ్లోరింగ్, సీలింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.

ఉపాధి అక్రమాలు తనిఖీలలో వెలుగుచూసేనా?

- వైసీపీ హయాంలో పనులలో పెద్ద ఎత్తున అవినీతి
- మండల సర్వసభ్య సమావేశాల్లోనూ ప్రశ్నించిన ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు



రామాయపాలెంలో ఉపాధి హామీ పథకం ఆడిట్ బృందం ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామ సభ

అద్దంకి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ బృందం అద్దంకి మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారా లేక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి అద్దంకి మండలంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన తనిఖీలు 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఆయా గ్రామాలలో జరిగిన పనులను డీఆర్‌పీలు తనిఖీ చేసి గ్రామసభ నిర్వహించి గుర్తించిన లోపాలు చదివి వినిపించాలి. అయితే తనిఖీలు, గ్రామసభలు అంతా మొక్కుబడిగా సాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో అద్దంకి మండలంలోని ఉపాధి హామీ పనులలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని అప్పట్లోనే అదే పార్టీ కి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలలో నిలదీశారు. అయినా అధికారులు స్పందించలేదు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఇటీవల వరకు కూడా అప్పటి అధికారులే కొనసాగడంతో అప్పటి అక్రమాలు వెలుగులోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఆయా గ్రామాలలో గ్రామ సభలు కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆయా గ్రామాలకు సంబంధించి గ్రామ సభలకు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాల్సి ఉండగా ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అప్పటి కప్పుడు సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తుంది. అదే సమయంలో కొన్ని గ్రామాలలో కనీసం ఆయా గ్రామాలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఏపీవోలు సైతం హాజరుకాకుండా మొక్కుబడిగా డిఆర్‌పీలు మా త్రమే హాజరవటం వెనుక అసలు రహస్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామ సభలో అక్రమాలు ప్రశ్నిస్తే సమాధానం చెప్ప లేక ఉపాధి హామీ సిబ్బంది ముఖం చాటేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పలు గ్రామాలలో ఉపాధిహామీ మస్టర్ల లో ఫీల్డ్ అసిస్టెంట్ లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి తమ బంధువులకు, కుటుంబ సభ్యులకు, వైసీపీ నేతల కుటుంబాల లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిత్యం తెల్లచొక్కాలు వేసుకొని అద్దంకి పట్టణంలో ఉండే నేతలకు సైతం మస్టర్లు వేసినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఆడిట్ బృందం తనిఖీలలో లోతుగా పరిశీలిస్తే పలు గ్రామాలలో చోటు చేసుకున్న అవినీతి వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా వచ్చామా... వెళ్లామా అనే విధంగా వ్యవహరిస్తే తనిఖీలు చేసి కూడా ప్రయోజనం ఏముంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మండల స్థాయిలో జరిగే ప్రజా వేదిక కైనా ప్రజా ప్రతనిధులకు, కూలీలకు, ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి నిర్వహిస్తే కొంత మేర ఫలితం ఉంటుందని, అలా కాకుండా గ్రామసభలు నిర్వహించిన విధంగానే మమ అనిపిస్తే అ క్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం కు మరింత ఊతం ఇచ్చినట్టే అవుతుందనటం లో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా ఆడిట్ బృందం, జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నాటి అ క్రమాలు వెలుగులోకి వచ్చేలా క్షుణ్ణంగా పరిశీలన చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణికులకు తాగునీటి ఇక్కట్లు

- ఆర్టీసీ బస్టాండ్‌లో మంచినీటి వసతి కరువు
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్ వద్ద ఉన్న ప్రయాణికులు

పర్చూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఒక్కపక్క ఎండలు మండిపోతుండగా ప్రయాణికులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు నీటి కష్టాలు తప్పడం లేదు. బస్టాండ్ నుంచి నిత్యం వందలమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. చీరాల, గుంటూరు, ఇంకొల్లు, చిలకలూరిపేట, బాపట్ల, ఒంగోలు తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో నిత్యం ప్రయాణికులతో పర్చూరు అర్టీసీ బస్టాండ్ రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న బస్టాండ్‌లో కనీస వసతులు కరువయ్యాయి. ప్రధానంగా తాగునీటి సమస్య వేధిస్తోంది. బస్టాండ్‌లో నీరు దొరక్క, బాటిళ్ల నీరు కొనుగోలు చేసే స్థోమత లేని పేద ప్రయాణికులు అల్లాడుతున్నారు. గతంలో వేసవి ప్రారంభం కాగానే దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఇటీవల ప్రయాణికుల తాగునీటి కష్టాలను పట్టించుకునే వారే కరువయ్యారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పంచాయతీ అధికారులు బస్టాండ్‌లో తాగునీటి వసతిని కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం టూర్ కోఆర్డినేటర్ వెంకటేష్, జేసీ ప్రఖర్‌జైన్, అడిషినల్ ఎస్పీ విఠలేశ్వర్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

పటిష్ట ఏర్పాట్లు చేయాలి

చినగంజాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సీఎం టూర్ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామానికి ఏప్రిల్ 1వ తేదీన రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, అడిషినల్ ఎస్పీ పాండురంగ విఠలేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు ఒబ్బంది లేకుండా చూడాలని వెంకటేష్ చూచించారు. ఆవులదొడ్డికొత్త గొల్లపాలెం గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్న హెలిప్యాడ్, ప్రజావేదిక, అధికారులు, టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించే సభా స్థలాలను ఆయన పరిశీలించారు. జరుగుతున్న ఏర్పాట్లును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో టీ.చంద్రశేఖర్‌నాయుడు, చీరాల డీఎస్పీ మహమ్మద మొయిన్, తహసీల్దార్ జె.ప్రభాకరరావు, పలు శాఖలకు చెందిన అధికారులు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత

అద్దంకి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కచ్చితంగా పోక్సో చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత అన్నారు. సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం హైస్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీసీత మాట్లాడుతూ మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తారన్నారు. పాఠశాలలు, కళాశాలల, వసతి గృహాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యహరిస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా మండల న్యాయసేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అపరిచిత వ్యక్తుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సై పట్టాభిరామయ్య, న్యాయవాదులు మార్తాశ్రీనివాసరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గవినివారిపాలెంకు పశువైద్యులను పంపండి

గవినివారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో పశువైద్యుడు లేక గేదెలు, గొర్రెలు మృత్యువాత పడుతున్నట్లు మం డల పరిధిలోని గవినివారిపాలెం గ్రామస్థులు అన్నారు. ఈమేరకు బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరక్టర్ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి గతంలో వైద్యులు ఉండగా వారిని డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతానికి పంపిన ట్లు చెప్పారు. పశువుల పెంపకంతో జీవనం సాగించే గ్రామస్థులు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తామని అధికారి గ్రామస్థులకు తెలిపారు.

పాస్టర్ మృతిపై పారదర్శక విచారణ

చీరాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సువార్తీకులు పగడాల ప్రవీణ్ మృతిపై పారదర్శకమైన విచారణ చేయాలని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం మీడియాతో వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మత బోధకుడి మరణం కలకలం రేపిందన్నారు. ఇది దారుణ ఘటన అని ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రత్నశేఖర్, ఎంఎల్ మోజెష్, పేతురు, మోహన్, దివాకర్, రవిశంకర్, రత్నరాజు, రాజేష్, పీటర్ రమేష్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పాస్టర్లు



చెక్కును ఈవోకు అందజేస్తున్న అనిల్‌కుమార్ దంపతులు

ధ్వజ స్తంభ శిలా మండపానికి రూ.8లక్షల విరాళం అందజేత

అద్దంకి, మార్చి26(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజ స్తంభం శిలా మండపం నిర్మాణం కు ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం కనమళ్లకు చెందిన కా ట్రగడ్డ అనిల్‌కుమార్ దంపతులు 8 లక్షల రూపాయల చెక్కును బుధవారం ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనిల్‌కుమార్ దంపతులను పూజారులు ఆశీర్వదించి, సత్కరించారు.



సమావేశంలో పాల్గొన్న ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని

కుంభాభిషేకానికి పక్కా ఏర్పాట్లు

అద్దంకి, మార్చి26(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం లో మే 19వ తేదీన జరిగే కుంభాభిషేకానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్నదాన స త్రాల నిర్వహకులు సహకరించాలని ఈఓ, అసిస్టెంట్ కమీషనర్ తిమ్మానాయుడు కోరారు. కుంబాభిషేకం ఏర్పాట్లు పై బుధవారం శింగరకొండ లోని అన్నదాన సత్రాల నిర్వహక కమిటీల బాధ్యులతో ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు, పూజారులు సమావేశం నిర్వహించారు. కుంబాభిషేకానికి భారీ స్థాయిలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని సామాజిక వర్గాల అన్నదాన స త్రాలలో అన్నదానం భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారు. అదే సమయంలో కుంబాభిషేకము నిర్వహణ కు శృంగేరి పీఠం నుండి సుమారు 70 మంది బృందం, స్థానికంగా 100 మంది రుత్వికులు హజరు కానున్న నేపథ్యంలో వసతి కల్పించేందుకు అన్ని అన్నదాన స త్రాలలో కొన్ని గదులను దేవస్థానం కు కేటాయించాలని కోరారు. వేదపండితులు హరిశంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, అన్నదాన సత్రాల నిర్వహణ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు భారీగా దరఖాస్తులు

మార్టూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బీసీ, ఈడబ్ల్యూఎస్ సబ్సిడీ రుణాలు కోసం గ్రామాల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో యూనిట్‌కు 2 నుంచి 8 లక్షల రూపాయలు రుణం మంజూరు చేసే అవకాశం ఉండడంతో, దానికి తోడు 50 శాతం సబ్సిడీ ఉండడంతో ఎక్కువమంది లబ్ధిదారులు రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్నారు. రుణాలకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించే అవకాశం ఉండడంతో చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. మండలానికి 96 మందికి రుణాలు మంజూరుకు ప్రతిపాదనలు రాగా, మొత్తం 273 మంది దరఖాస్తుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా యద్దనపూడి మండలంలో 24 మందికి రుణాలు మంజూరుకు ప్రతిపాదనలురాగా మొత్తం 37 దరఖాస్తులు వచ్చినట్లు బుధవారం అధికారులు తెలిపారు.

గ్రామ నాయకులపై పెరిగిన ఒత్తిడి

సబ్సిడీ రుణాలు మంజూరుకు గ్రామాల్లో టీడీపీ నాయకులపై ఒత్తిడి పెరిగింది. గ్రామంలో రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమకు రుణం మంజూరుకు సహకరించాలని కోరుతూ గ్రామ నాయకులను కోరుతున్నారు. అయితే తక్కువ సంఖ్యలో రుణాలు యూనిట్లు మంజూరు కావడం, ఎక్కువ స్థాయిలో దరఖాస్తు చేసుకున్న వారు ఉండడంతో ఎవరికి సహకరించాలో అర్థంకాని పరిస్థితి నెలకొందని నాయకులు అంటున్నారు. మార్టూరు మండలంలో చిమ్మిరిబండ గ్రామంలో ఒక్క రుణం యూనిట్ మాత్రమే మంజూరు కావడంతో దానిని ఎవరికి ఇవ్వాలో అర్థం కాక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మరి కొన్ని గ్రామాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉందంటే అతిశయోక్తికాదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా సబ్సిడీ రుణాలు మంజూరు కాగా లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. గ్రామ నాయకులతోపాటు, బ్యాంకర్లు కూడా ఎంపిక చేసిన వారికి మాత్రమే రుణాలు మంజూరు అవుతాయి. బుధవారం నాటికి దరఖాస్తు చేసుకున్న వారి అప్లికేషన్లను పరిశీలించడం పూర్తయింది. మరి ఎవరికి రుణాలు మంజూరు చేస్తారా అని లబ్దిదారులు కొండంత ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారంతో జీవనమనుగడ

తోటవారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తినడం వలన జీవన మనుగడ సాఫీగా ఉంటుందని జిల్లా ఏరువాక ప్రతినిధులు డా.బాలమురళీధర్‌నాయక్, శాస్త్రవేత్త డా.ఉషారాణి పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి సుమతి ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమంలో భాగంగా రైతులకు చిరు ధాన్యాల ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం జరిగింది.

ముగిసిన పొలంపిలుస్తోంది

రబీ సీజన్‌కు సంబంధించి బుధవారంతో పొలంపిలుస్తోంది కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈసందర్భంగా చివరి రోజు మండల పరిధిలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయక సంచాలకులు రత్నకుమారి హాజరై రైతులతో మాట్లాడారు. సాగు చేసిన మొక్కజొన్న, తగులబెట్టడం, నేలను సాగుకు కలియ దున్నడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



ఏరువాక కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు


అన్నమాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రతినిధులు

అన్నమాచార్యులకు నివాళి

అద్దంకి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 522 ఆరాధన సందర్భంగా బుధవారం దాస భారతీయ జానపద కళాక్షేత్రం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ రోడ్డులోని అన్నమాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అన్నమాచార్యులు రచించిన 32 వేల వేంకటేశ్వరస్వామి కీర్తనలు ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకున్నాయన్నారు. కీర్తనలతో పాటు శ్రామికులు పాడుకునే చక్కని పాటలను కూడా రచించారన్నారు. ఈ కార్యక్రమంలో దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్‌జేడీ దేవపాలన, వెంకటాద్రి, మాదాల దానయ్య, పుట్టా వీరాంజనేయులు, రామిశెట్టి రవి, యరమోతు శంకరరావు పాల్గొన్నారు.

బస్టాండ్ కాదు..బార్ స్టాండ్


అధ్వానంగా ఉన్న బస్టాండ్


తాగి పడేసిన మద్యం సీసాలు


ఆక్రమణలో ఖాళీ స్థలం

- మందుబాబులకు అడ్డా
- భయంతో దూరమైన ప్రయాణికులు

వేటపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రయాణీయాకులను వివిధ ప్రాంతాలకు తరలించేందుకు ఉపకరించే వేటపాలెం బస్టాండ్ నేడు బార్ స్టాండ్‌ను తలపిస్తోంది. గతంలో చీరాల, ఒంగోలు, ఇంకొల్లు, పర్చూరు ప్రాంతాలే కాకుండా హైదరాబాద్, తిరుపతి వంటి ప్రాంతాలకు ఇక్కడ నుంచి బస్సులు వెళ్లాయి. అయితే కాలక్రమేణా చీరాల - వేటపాలెం రహదారి ఆధునికీరించడంతో బస్టాండ్ రహదారికి స్వల్పంగా దూరం అయింది. దానికితోడు అంతరించిపోతున్న బస్టాండ్ అభివృద్ధి కృషి చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈక్రమంలో బస్టాండ్ పర్యవేక్షణ లోపించడంతో చిన్నగా రాత్రుళ్లు బస్టాండ్‌లో మందుబాబులు తిష్ట వేసేవారు. దీంతో ప్రయాణికులు భయంతో అటువైపు వెళ్లడం మానేశారు. దీనిని అలుసుగా తీసుకొని బస్టాండ్ పూర్తిగా మద్యం బాబులకు నిలయంగా మారింది. ప్రస్తుతం వారు యథేచ్ఛగా పగలు, రాత్రి తేడాలేకుండా ఆ ప్రాంతంలో మత్తులో మునిగి తేలుతున్నారు. బస్టాండ్ ప్రదేశం విస్తీరణం అధికంగానే ఉండడంతో అందులో సుమారు 15సెంట్ల వరకు పెట్రోల్ బంకుకు లీజుకు ఇచ్చారు. దీంతో ఈ మేరకు డిపోకు కొంత ఆదాయంతో పాటు, స్థలం భద్రతగా ఉంది. మిగిలిన బస్టాండ్ భవనం ఉన్న ప్రదేశం కొంత మందుబాబులకు మరి కొంత స్థానికులకు పశువుల పాకగా మారుతోంది.

ఈనేపథ్యంలో ప్రభుత్వ ఆస్తిని అక్రమార్కుల చెర నుంచి విడిపించి ఆదాయ మార్గంలోకి నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.


బస్టాండ్ స్థలంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు

టెండర్‌ల ద్వారా ఆదాయ మార్గానికి కృషి



అప్పట్లో నెలకొన్న వివిధ కారణాల చేత బస్టాండ్ శిథిలమైంది. ఈక్రమంలో ఆర్టీసీ ఆస్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే టెండర్‌లు ప్రారంభించాం. స్థలాన్ని లీజుకు అందించి ఆదాయాన్ని పెంచుతాం.

- జంజనం శ్యామల, డీఎం, చీరాల ఆర్టీసీ


నక్కబొక్కలపాడు హెల్త్ సబ్ సెంటర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయమ్మ

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా సిబ్బంది పనిచేయాలి

బల్లికురవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటు పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి విజయమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యశాల రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆనంతరం నక్కబొక్కలపాడు గ్రామంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేసి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యం ప్రజలందరికీ అందేలా సిబ్బంది అప్రమత్తతో పనిచేయాలన్నారు. ఈ తనిఖీలో వైద్యాధికారి రవితేజ పాల్గొన్నారు.

జూదాలకు దూరం కాకుంటే శిక్షలు తప్పవు

తహసీల్దార్ పార్వతి


పాత నిందితులను బైండోవర్ చేస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జూదాలకు స్వస్తి పలకకుంటే శిక్షలు తప్పవని తహసీల్దార్ పాలపర్తి పార్వతి అన్నారు. ఇటీవల క్రికెట్ బెట్టింగ్‌లు అంశం తెరపైకి జోరుగా ప్రచారం జరుగుతుండడంతో రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పాత నేరస్థులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతేకాకుండా తహసీల్దార్ వద్ద ప్రవేశపెట్టి బైండోవర్ చేయించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను కోల్పోవద్దని సూచించారు. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ కూటమి నాయకులు

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

చీరాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నిరంతరం శ్రమిస్తున్నట్లు పలువురు టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి అందిన నివేశన స్థలాలు - 200, పెన్షన్ - 100, రేషన్ కార్డులు - 50 అర్జీలను స్వీకరించారు. ఈసంద్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి అధికారంతో నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉండేలా ఎమ్మెల్యే ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గంజి పురుషోత్తం, గజవల్లి శ్రీనివాసరావు, పొత్తూరి సుబ్బయ్య, గూడూరు శివరామప్రసాద్, నాగమల్లేశ్వరి, చంద్ర తదితర నాయకులు, కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.

పంటల అమ్మకాలలో అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము పండించిన పంటల అమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. బుధవారం మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో పలు రకాల పంటలను పరిశీలించారు. ఆనంతరం రైతులతో మాట్లాడుతు రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు ముందస్తుగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలానే పంట ఉత్పత్తులు అమ్మకాలు చేసే రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మకాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంద్రు దానయ్య, వీఏఏ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు ప్రసన్న, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయించండి

బల్లికురవ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అసంపూర్తి పనులతో నిలిచి ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేయించాలని ఎంపీడీవో కుసుమకుమారి అధికారులకు సూచించారు. బుధవారం అన్ని గ్రామాల సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గత ఐదేళ్లలో గృహాలు మంజూరై ఇంత వరకు పూర్తి స్థాయిలో పనులు చేయని వారిని కలిసి వెంటనే పూర్తి నిర్మాణాలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి

చినగంజాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామ పంచాయతీ పరిధిల్లోని ప్రభుదేవా, సందరయ్య, మహాలక్ష్మీ అంబేద్కర్‌నగర్, రాజమాత కాలనీవాసుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని కాలనీలలో పార్టీ బృందం సభ్యులు పర్యటించి సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, దివ్యాంగులు బుధవారం ధర్నా నిర్వహించారు. చినగంజాం గ్రామ పంచాయతీలోని అంబేద్కర్ నగర్, సుందరయ్య, మహాలక్ష్మీ, ప్రభుదేవా కాలనీవాసులకు, మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీలోని రాజమాత కాలనీవాసులకు, ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని, మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని, రోడ్లు నిర్మించాలని, దివ్యాంగులకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పక్కా గృహాలు నిర్మించాలని కోరుతూ ధర్నా అనంతరం తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ డేటా త్వరితగతిన పూర్తి చేయాలి డీఎల్‌పీవో


సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో

ఇంకొల్లు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీల డేటాను నూతన యాప్‌ల్లో త్వరితగతిన అప్‌లోడ్ చేయాలని డీఎల్‌పీవో శ్రీమన్నారాయణ ఆదేశించారు. బుధవారం పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.మండలంలోని అన్ని పంచాయతీల డేటా యాప్‌లలో అప్‌లోడ్ చేయకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం నుంచి రావని హెచ్చరించారు. జీఆర్‌డీపీ ప్లాన్ ఈగ్రామం స్వరాజ్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ జూనియర్ అసిస్టెంటు ఏ.వెంకటేవ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ

పర్చూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆశ్రయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు రంజాన్ పండుగను పురస్కరించుకొని బుధవారం నూతలపాడుకు చెందిన షేక్ బాజీ 25 మంది పేద వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాజీ మాట్లాడుతూ వృద్ధులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు అమ్ముకోవద్దు

మద్దతు ధరకు కొంటాం : ఏవో


బొడ్డువానిపాలెంలో శనగలు, కందులు కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : శనగలు, కందులు పండించిన రైతులు తక్కువ ధరలకు అ మ్ముకోవద్దని, ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని యర్రబాలెం, బొడ్డువానిపాలెం గ్రామాల్లో మద్దతు ధర్పై రైతులుకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని రావినూతల, తిమ్మనపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకర పరపతి సంఘం (సొసైటీలు)లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రావినూతల కొనుగోలు కేంద్రంలో కందులు శనగలు, తిమ్మనపాలెం సొసైటీలో శనగలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కందులు క్వింటాళ్లు రూ.7,550, శనగలు క్వింటాళ్లు రూ.5,650 చొప్పున మద్దతు ధర ఇస్తున్నామన్నారు. శనగలు కందులు పండించిన రైతులు ఆయా గ్రామాలలోని వ్యవసాయ సహాయకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులు తమ పంటల శాంపిల్స్‌ను కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువెళ్లి వారి అనుమతితో కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవచ్చన్నారు. మండలంలోని రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ అ వగాహన కార్యక్రమాలల్లో వ్యవసాయశాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కందులు, శనగల కొనుగోలుకు కేంద్రం ఏర్పాటు

బల్లికురవ : రబీ సీజన్‌లో రైతులు పండించిన కందు లు, శనగలు కొనుగోలుకు ప్రభుత్వం కొమ్మినేనివారిపాలెంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి తెలిపారు. ప్రభుత్వం కందులకు మద్దతు ధరగా క్వింటా రూ.7550, శనగలు క్వింటా రూ.5650 నిర్ణయించిదని తెలిపారు. నాణ్యత ప్రమాణాల మేరకు నెమ్ము శాతం 12 శాతంలోపు ఉంటే కొనుగోలు చేస్తామని విత్తనాలు అమ్మకాలు చేసే రైతులు వెంటనే గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో కోరారు.

విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

వేటపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ప్రవర్తన, కొత్తకొత్త మార్పులపై గమనించి అప్రమత్తంగా ఉండాలని న్యాయాధికారి ఎం.సుధ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని గిరిజన పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి ఎస్సై వెంకటేశ్వర్లుతో కలిసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కొత్త వ్యక్తులు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వలన ధైర్యంగా జీవిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేసమ్మ, పీఎల్‌వీలు మధీన్, సుభాని, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


రంగులు వేసిన సరస్వతీదేవి విగ్రహం

దాతల సహకారం మరువలేనిది

చినగంజాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని పాఠశాల ఇన్‌జార్జి హెచ్‌ఎం డీ నారాయణరెడ్డి అన్నారు. పాఠశాల ఆవరణలో గ్రామపెద్దల సహకారంతో నిర్మించిన సరస్వతీదేవి విగ్రహానికి గ్రామ రామదండు యువజన సేవా సమితి సభ్యులు రంగులు వేయించినట్లు హెచ్‌ఎం బుధవారం తెలిపారు. రామదండు యువజన సేవాసభ్యులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆసోది సుదర్శన్ రెడ్డి రూ.20వేల రంగులు వేయించినట్లు తెలిపారు. పాఠశాలలో జరిగే ఆగస్టు 15, జనవరి 26వ తేదీలో జరిగే జాతీయ పండుగ దినోత్సవాలకు నిర్వహించే పలు కార్యక్రమాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేయడం, పాఠశాల క్రీడా మైదానం, పరిసరాలను కూడా అప్పుడప్పుడు స్వచ్ఛందంగా వచ్చి శుభ్రం చేస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.


పంగులూరులో టెన్త్ విద్యార్థులకు పరీక్షా కేంద్రం వద్ద మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న వీరనారాయణ

విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

పంగులూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్ష రాసే పాఠశాలల విద్యార్థులకు ఆయా పరీక్షా కేంద్రాల వద్ద మజ్జిగ ప్యాకెట్లు అందచేస్తున్నారు అజిత్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ. మండలంలోని పంగులూరు, ముప్పవరం పరీక్షా కేంద్రాలలో 5 పాఠశాలలకు చెందిన 336 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్ష రాస్తున్నారు. పరీక్ష రాసే వారితోపాటు పాటు ఆయా కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి చందలూరు గ్రామానికి చెందిన అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరీక్ష జరిగే రోజున మజ్జిగ ప్యాకెట్లు స్వయంగా అందచేస్తున్నారు. విద్యార్థుల పట్ల వీరనారాయణ చాటుతున్న వితరణను ఉపాధ్యాయులు కొనియాడుతున్నారు.

రోడ్డుపై నిలిచిన లారీ

పర్చూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : యాక్సిల్ విరిగిపోయి రోడ్డుపై సిమెంట్ లోడ్‌తో ఉన్న లారీ నిలిచిపోయిన ఘటన పర్చూరులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డులో జరిగింది. లోడుతో ఇంకొల్లు వైపు వెళుతున్న క్రమంలో యాక్సిల్ విరిగి పోవడంతో రోడ్డుమీద లారీ వాలిపోయింది. ఈ ఘటన చూసిన సమీపంలో ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


రోడ్డుపై వాలిపోయిన సిమెంట్ లోడుతో ఉన్న లారీ

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

మార్టూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గడ్డిమందు తాగిన తమ్ములూరి పెదబాబు(26) అనే వ్యక్తి గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన పెదబాబు ఈ నెల 23న ఆదివారం ఇంటిలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దాంతో అతనిని కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. అయితే అతను వేకువజామున మృతి చెందారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాషా తెలిపారు.

మూడు చక్రాల స్కూటీ బోల్తా

దంపతులకు గాయాలు


గాయపడ్డ మస్తాన్‌రెడ్డి

అద్దంకి, మార్చి26(ఆంధ్రజ్యోతి): మూడు చ క్రాల స్కూటి అదుపు తప్పి బోల్తా పడటంతో దివ్యాంగుడైన మస్తాన్‌రెడ్డి, భార్య జ్యోతికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు గుంటూరుకు చెందిన దివ్యాంగుడైన అన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, భార్య జ్యోతి మూడు చక్రాల స్కూటీపై దర్శి వెళ్తుండగా బుధవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మస్తాన్‌రెడ్డి, జ్యోతిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

కుటుంబ కలహాలతో భర్త బలవన్మరణం

తోటవారిపాలెం(చీరాల), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు తార స్థాయికి చేరడంతో భర్త బలవన్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని తోటవారిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట శివారెడ్డి(35)కు చెరుకుపల్లి వద్ద రాజోలుకు చెందిన నాగదేవతతో సుమారు 12 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. అయితే ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు చెలరేగడంతో ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మంగళవారం భార్య వద్దకు వెళ్లి కాపురానికి రమ్మని కోరగా.. ఆమె నిరాకరించడంతో బుధవారం మనస్థాపం చెంది ఇంట్లోనే ఉరికి పాల్పడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వీరికి 9, 6 సంవత్సరాల పాప, బాబు సంతానం.

ప్రభుత్వ పాలసీ మేరకే అమ్మకాలు జరగాలి

చీరాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీకి అనుగుణంగానే విక్రయాలు జరపాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో లైసెన్సీ దుకాణ దారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సకాలంలో డీడీలు చెల్లించి, సరుకు అమ్మకాలు చేయాలని సూచించారు. అలాగే చట్ట వ్యతిరేక వ్యహారాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నాగేశ్వరరావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణదారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



నేత్రపర్వం సీతారామ కల్యాణం

● ముగిసిన త్యాగరాజ స్మరణోత్సవాలు


నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : బిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో 60వ త్యాగరాజ స్మరణోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం సీతారామలక్ష్మణ హనుమ త్యాగరాజ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కళాకారులు త్యాగరాజ సంకీర్తనలు సుమధురంగా గానం చేశారు. సాయంత్రం సంగీత కచేరీల అనంతరం సీతారాములు, కమ లాంబిక త్యాగరా జేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. త్యాగరాజస్వామికి వైభవంగా పుష్పాభి షేకం చేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.26 (గురువారం సాయంత్రం)
సహారి : 4.52 (శుక్రవారం ఉదయం)

షుగర్ ఫ్యాక్టరీ భూములు ఏపీఐఐసీకి..



విజయవాడలో జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్



నెల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : 'కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్నాం. 124 ఎకరాల భూములను ఏపీఐఐసీకి అప్పగించాలని సూచించాం. ఆ భూములను పారిశ్రామిక అభివృద్ధి చేయాలి. అందుకు సంబంధించి ప్రణాళికలు తయారు చేయమని పరిశ్రమల శాఖను ఆదేశించాం. ఈ ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికులు, చెరకు రైతులకు చెల్లించాల్సిన రూ.28 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తుంది' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయవాడలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో రెండో రోజు బుధవారం నెల్లూరు జిల్లా ప్రగతి, ప్రణాళికపై సీఎం సమీక్షించారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ అంశాన్ని తొలుత కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి పొంగూరు నారాయణ కూడా కార్మికుల బకాయిలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. అనంతరం సీఎం చంద్రబాబు ఈ అంశంపై కీలక నిర్ణయం తీసుకుని ప్రకటన చేశారు. దీంతో కార్మికులకు బకాయిలు అందడంతోపాటు రూ.వందల కోట్ల విలువైన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

● కలెక్టర్ ప్రజంటేషన్

జిల్లాపై సమీక్ష సందర్భంగా ముందుగా కలెక్టర్ ఓ ఆనంద్.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను వివరించారు. వ్యవసాయం, అనుబంధ శాఖలు, పరిశ్రమలు, సేవా రంగాల్లో 15 శాతం గ్రోత్ రేటు సాధించేందుకు తీసుకుంటున్న చర్యలను సీఎంకు తెలియజేశారు. జిల్లాలో 163 కి.మీ సముద్రతీర ప్రాంతం ఉందని, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులతో జిల్లా అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మూడు ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రామాయపట్నం పోర్టు భూసేకరణ పనులు ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కొన్ని కంపెనీలు ముందుకొచ్చినట్లు వివరించారు. బిట్రగుంట వద్ద రైల్వే ప్రాజెక్టు ఏర్పాటుకు 500 ఎకరాల భూసేకరణ చేపడుతున్నట్లు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు రుణాలు అందిస్తున్నామని, ఎస్టీలకు ఆధార్ కార్డులు అందించే ప్రక్రియలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు ఆనంద్ పేర్కొన్నారు. ప్రజలకు తక్కువ ధరల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లను అందించేందుకు నుడా పరిధిలో 200 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ల ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆ తర్వాత జోన్ 4 ఇన్‌చార్జ్ అధికారి ఎంటీ కృష్ణబాబు కూడా జిల్లా పరిస్థితులను క్లుప్తంగా వివరించారు.

> పారిశ్రామికంగా అభివృద్ధికి చర్యలు
> రూ.28 కోట్ల బకాయిలు చెల్లిస్తాం
> తమిళనాడు బోట్ల సమస్యనూ పరిష్కరిస్తాం
> కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు హామీ

● కీలక సమస్యలపై సీఎం హామీ

జిల్లా యాక్షన్ ప్లాన్‌ను వివరించిన అనంతరం కలెక్టర్ జిల్లాలో ప్రధాన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వాటిలో కోవూరు షుగర్ ఫ్యాక్టరీతోపాటు తమిళనాడు బోట్ల చొరబాటు, ఫిషింగ్ హార్బర్‌ను ఆపరేషన్‌లోకి తీసుకురావడం, సోమశిల ఆప్రాన్ పూర్తి చేయడంతోపాటు హైలెవల్ కెనాల్ భూసేకరణకు అవసరమైన నిధులు వంటి అంశాలు ఉన్నాయి. రూ.288 కోట్లతో చేపట్టిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం దాదాపుగా పూర్తయిందని, త్వరగా ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ కోరగా.. దీనిపై స్పందించిన సీఎం వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌ను ఆదేశించారు. సోమశిల ఆప్రాన్, హైలెవల్ కెనాల్ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కలెక్టర్ కోరగా ఇరిగేషన్ అధికారులు తనతో ప్రత్యేకంగా చర్చించి సోమశిల పనులు వేగ వంతం చేయాలని సీఎం ఆదేశిం చారు. జిల్లాలో 10,924 ఇళ్ల నిర్మా ణాలు విజిలెన్స్ విచారణతో నిలిచి పోయాయని, ఈ ఇళ్ల నిర్మాణాల పూర్తికి అనుమతించాలని కలెక్టర్ కోరారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

● జిల్లాలో అత్యధిక గ్రోత్‌రేటు

జోన్ 4లోని జిల్లాల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. జోన్ 4లోని నెల్లూరు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో అత్యధిక గ్రోత్ రేటు నెల్లూరు జిల్లా సాధించిందని సీఎం చెప్పారు. నెల్లూరు జిల్లా 14.45 శాతం, ప్రకాశం జిల్లా 10.46 శాతం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలు 13.22 శాతం, తిరుపతి జిల్లా గ్రోత్ రేటు 12.08 శాతంగా ఉన్నట్లు వెల్లడించారు. రానున్న ఏడాదిలో గ్రోత్ రేటు 15 శాతం దాటే విధంగా కలెక్టర్లు పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇక తలసరి ఆదాయంలో జోన్ 4 పరిధిలో అత్యధికంగా తిరుపతి జిల్లాలో ఉండగా, ఆ తర్వాత స్థానంలో నెల్లూరు ఉందని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను స్పష్టంగా వివరించిన సీఎం.. వాటి అమలుకు జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలు చివరి పేదవాడి వరకూ అందాలని, ఆ లక్ష్యంతో పని చేయాలని సీఎం సూచించారు.

పద్దులో గారడీ!

నెల్లూరు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం బుధవారం వాడివేడిగా సాగింది. పద్దులో పేర్కొన్న గణాంకాలు అంకెల గారడీని తలపిస్తున్నాయంటూ వైసీపీ, టీడీపీ సభ్యులు ముక్తకంఠంగా అధికారుల తీరుపై మండిపడ్డారు. 2024-25 వార్షిక బడ్జెట్‌లో చూపిన ఖర్చులన్నీ వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, జరిపిన కేటాయింపులు, పెట్టిన ఖర్చులు కాగితాల్లో తప్ప వాస్తవాలు కాదని తెగేసిచెప్పారు. ఇక కొత్త బడ్జెట్‌లోనూ ఊహలకు రెక్కలు తొడిగారని, పన్ను వసూళ్లకు ప్రాధాన్యమిచ్చి ప్రజాసేవకు పాతరేశారంటూ సభ్యులు ఏకపక్షంగా అభ్యంతరాలు తెలుపుతూనే రూ.695.95 కోట్ల పద్దుకు మేయర్ స్రవంతి అధ్యక్షతను ఆమోదం తెలిపారు. ఈసారి ఒకరి మధ్య మరొకరు వాగ్వివాదాలకు తెరదించిన సభ్యులు అధికారులపైకి దూసుకెళ్లడం గమనార్హం.

\- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

● వాస్తవాలకు దూరంగా గత బడ్జెట్ ఖర్చులు
● కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్‌కు రూ.70 లక్షల వ్యయమా!?
● ఊహలకు అందని రీతిలో కొత్త బడ్జెట్
● పన్నులకే ప్రాధాన్యమిస్తారా.. ప్రజాసేవను పట్టించుకోరా!?
● అధికారుల తీరుపై కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం
● రూ. 695.95 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

మేయర్ పేషీలో అంత ఖర్చా!?



మేయర్ పేషీలో ముగిసిన బడ్జెట్ పద్దులో రూ.10 లక్షలు కేటాయించి అందులో రూ.8 లక్షలు ఖర్చు చేసినట్లు చూపారు. ఈ మొత్తానికి ఏం ఖర్చు చేశారో చెప్పాలంటూ 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డిరెడ్డి పట్టుపట్టారు. దీనిపై ఎవరి దగ్గర సమాధానం లేదు. రానున్న ఆర్థిక సంవత్సరానికి కూడా రూ.10 లక్షలు కేటాయించారని పేషీలో రూ.లక్షల్లో ఏం ఖర్చులు ఉంటాయని నిలదీశారు. ఇంతలో జోక్యం చేసుకున్న మేయర్ కనుక్కుని వివరంగా చెప్తానని తెలిపారు. స్టేషనరీకి రూ.40 లక్షలు, జెరాక్స్‌లకు రూ.20 లక్షలు, లీగల్ ఫీజుల పేరిట రూ.25 లక్షలు ఖర్చు అయినట్లు చూపడం వాస్తవాలకు దూరంగా ఉందని, ఇది కేవలం కాగితపు లెక్కలే తప్ప నిజంకాదని సభ్యులు ముక్తకంఠంతో నిలదీశారు. దోమల నివారణ పేరిట ఆయిల్‌బాల్స్, ఫాగింగ్ ఆయిల్స్ పేరిట రూ. 45 ఖర్చు చేసినట్లు పద్దులో పేర్కొనడంపైనా అభ్యంతరం తెలిపారు. డివిజన్లలో తమకు తెలియకుండా ఇంత నగదు ఎక్కడ ఖర్చు అయిందని అధికారులను సూటిగా ప్రశ్నించారు. కంటికి కనపడని ట్రాఫిక్ సిగ్నల్స్‌కు రూ.70 లక్షలు ఖర్చు చేయడంపైనా టీడీపీ, వైసీపీ సభ్యులు మండిపడ్డారు. అలాగే నగరంలో జంతువుల నియంత్రణకు రూ.15 లక్షలు, కుక్కలకు శస్త్రచికిత్సలకు రూ.80 లక్షలు ఖర్చు చేయడంపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి కార్పొరేషన్‌లో ఉన్న రూ.121.30 కోట్ల నిల్వ నిధితో రూ.585.48 కోట్లు అదనంగా ఆదాయం సమకూరు తుందని, మొత్తం రూ.706.78 కోట్లకుగాను 695.95 కోట్లను నగరాభి వృద్ధికి ఖర్చు చేయనున్నట్లు మేయర్ స్రవంతి కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో 54 డివి జన్ల ప్రణాళిక ప్రకారం రూ.448.52 కోట్లు, ప్రణాళికేతరంగా మరో రూ.247.43 కోట్లను ఖర్చు చేసేందుకు ఖజానాను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. పన్నుల రూపేణా ఈసారి రూ.122.52 కోట్లు రాబట్టాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లు మేయర్ తెలపడంతో కౌన్సిల్లోని సభ్యులు అభ్యంతరం తెలిపారు. గతేడాది రూ.79.77 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం కాగ ఈసారి రూ.122.52 కోట్లకు పెంచడమంటే ప్రజలపై భారం వేయడమేనని ఇందుకు తామంతా వ్యతిరేకమని చెప్పారు. వాణిజ్య రంగంలో చిన్న తరహా వారికి పన్నుల్లో మినహాయింపు ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ మేరకు మేయర్, కమిషనర్ నుంచి హామీ రావడంతో సభ్యులు శాంతించారు. మూడేళ్ల నుంచి అమలులో లేని బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌ల ద్వారా రూ.15 కోట్ల ఆదాయం ఎలా వస్తుందని సభ్యులు ప్రశ్నించారు. కౌన్సిల్ ఏర్పడి మూడున్నరేళ్లు పూర్తయినా ఇప్పటివరకు కార్పొరేటర్లకు శిక్షణ, స్టడీ టూర్ వేయకపోవడం, తాజాగా బడ్జెట్‌లో రూ.25 లక్షలు కేటాయించడం హాస్యాస్పదంగా ఉందని కొందరు కార్పొరేటర్లు విమర్శించారు.

ఎన్నికలకు కార్పొరేషన్ డబ్బా!?

గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కార్పొరేషన్‌కు చెందిన సాధారణ నిధుల నుంచి రూ.3 కోట్లు ఎందుకు ఖర్చు చేయాల్సి వచ్చిందని సభ్యులు ప్రశ్నించారు. ఆ ఎన్నికల ఖర్చును రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వస్తాయి కాబట్టి కార్పొరేషన్ నిధులు ఎలా ఖర్చు చేశారంటూ సభ్యులు నిలదీశారు. దీనిపై విచారణ జరిపించాలని పట్టుపట్టారు. ఇది చాలదన్నట్టు రానున్న ఆర్థిక సంవత్సరంలోనూ మరో రూ.1.5 కోట్లు కేటాయించడమేమిటని అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ సూర్యతేజ ఎన్నికలకు ఖర్చు చేసిన రూ.3 కోట్లు ఎన్నికల సంఘం నుంచి రావాల్సి ఉందని, ఈ మేరకు కలెక్టర్‌కు తెలియజేసినట్లు వివరణ ఇచ్చారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

విమర్శించారు. ప్రజలకు అంకెల గారడికాకుండా వాస్తవాలు తెలియచేయాలని కిన్నెర మాల్యాద్రి సూచించారు. పన్నుల భారం తప్ప ప్రజాసేవ బడ్జెట్‌లో కనిపించడంలేదని మొయిళ్ల గౌరి విమర్శించారు. నగరంలో పన్ను వసూళ్ల డిమాండ్ నోటీసులు ఇవ్వడం లేదని, దీనివల్ల సకాలంలో చెల్లింపులు చేయలేకున్నారంటూ పోట్లూరి రామకృష్ణ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ప్లాస్టిక్ నివారణకు దాడులు తప్ప ప్రజల్లో అవగాహన లేదని మరో సభ్యుడు రవిచంద్ర సూచించారు.

● అధికారుల తీరుపై గరంగరం

2025-26 కార్పొరేషన్ వార్షిక బడ్జెట్‌పై అధికారులు చూపిన గణాంకాల పై సభ్యులు అభ్యంతరాలు తెలిపారు. వాస్తవాలకు దూరంగా అంకెలతో గారడి చేశారంటూ అధికార, ప్రతిపక్ష సభ్యులు ఏకపక్షంగా ఎండగట్టారు. ఆదాయం ఉన్నట్లు బడ్జెట్‌లో చూపిన అధికారులు కాంట్రాక్టర్లకు ఎందుకు బిల్లులు చెల్లించడం లేదని బొబ్బల శ్రీనివాసులు ప్రశ్నించారు. అధికారులకు కమీషన్లు వచ్చే అంశాలకే కేటాయింపులు ఎక్కువగా జరుపుతున్నారంటూ, నగరంలో మంచినీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని, ఇంజనీర్లు మాత్రం ఏసీ గదుల్లోనుంచి బయటకు రావడం లేదని మరో సభ్యుడు కర్తం దుయ్యబట్టారు. కార్పొరేషన్ ఖజానాకు వచ్చే ఆదాయం కంటే రెవెన్యూ, సిటీప్లానింగ్ అధికారుల జేబుల్లోకి వచ్చే ఆదాయమే ఎక్కువగా ఉందని మరో కార్పొరేటర్ గోతం అరుణ

ఎవరిదారి వాళ్లదే!



నెల్లూరులో 8 లక్షల మంది జనాభాకు సంబంధించి రూ.695.95 కోట్లతో బడ్జెట్ సమావేశం జరుగుతుంటే కొంతమంది కార్పొరేటర్లు తమకేమీ సంబంధం లేదనట్టుగా వ్యవహరించడం గమనార్హం. ఇందులో అధ్యక్షత వహించిన మేయర్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉండగా, మరికొందరు మహిళా కార్పొరేటర్లు సైతం తమ సెల్ ఫోన్లలో రీల్స్ చూసు కుంటూ ఉండిపోయారు. ఇంకొందరు ఫోన్లలో గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేశారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో మైనార్టీల వాటా తగ్గనివ్వొద్దు

● డీఆర్వో ఉదయభాస్కర్ రావు

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో మైనార్టీల వాటా 15 శాతం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయభాస్కర్‌రావు అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో సంక్షేమ కార్యక్రమాల్లో మైనార్టీల భాగస్వామ్యంపై త్రైమాసిక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల రేషనలైజే షన్ ప్రక్రియ కొనసాగుతున్నందున, మైనార్టీలు అధికంగా నివసించే ప్రాంతాల్లో అవసరమైన చోట ప్రత్యేక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. స్వయం ఉపాధి కోర్సుల్లో మైనార్టీలకు శిక్షణ ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ హైఫా, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష ఏపీవో వెంకటసుబ్బయ్య, మెప్మా పీడీ రాధమ్మ, మైనార్టీ వ్యవహారాల ఎన్‌జీవో అహ్మద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

● రేపు ఇఫ్తార్ విందు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఇఫ్తార్ విందుఇస్తున్నట్లు మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి ఎం శ్రీనివాసరావు తెలిపారు.

ఉదయగిరిలో తమ్ముళ్ల బాహాబాహీ

ఉదయగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి పట్టణంలో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు బాహాబాహీకి దిగారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో భవన మరమ్మతుల కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వచ్చారు. శిలాఫలకం వద్ద నిలబడే క్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో ఎమ్మెల్యే, పోలీసులు కలగజేసుకొని వివాదాన్ని సద్దుమణిచారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యే వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. ఈ తరుణంలో అదే ఘటనపై మరలా ఎస్సీ సెల్ నాయకుడు నల్లిపోగు రాజా, టీడీపీ నాయకుడు మట్ల లక్ష్మయ్యల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొని తోపులాటకు దారి తీసింది. ఒకానొకదశలో చేయి చేసుకున్నారు. అక్కడే ఉన్న టీడీపీ నాయ కులు, పోలీసులు వివాదాన్ని అంతా సర్దుబాటు చేశారు. అనం తరం అతిథి గృహం నుంచి బయటకు వచ్చి న ఎమ్మెల్యే వారితో మాట్లాడి సర్దిచెప్పి అక్కడి నుంచి దాసరి పల్లి వెళ్లిపోయా రు. కాగా మట్ల లక్ష్మయ్య తనపై దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమాయకుల నోళ్లు కొట్టారు!

● రాపూరులో యానాదుల నిధులు స్వాహా
● రుణాలు ఇవ్వకనే ఇచ్చినట్లు అవకతవకలు
● మృతులకూ లోన్లు ఇచ్చారట!
● 14 సంఘాలకు సంబంధించి రూ.71 లక్షలు పక్కదారి
● అడిగేవారు లేక ఇన్నాళ్లూ బయటకురాని వ్యవహారం
● వెలుగులోకి వస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది బాగోతాలు

ఇలాంటి అనేక సిత్రాలు రాపూరు మండలంలో కనిపిస్తున్నాయి. గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్ తీసుకొస్తే దానిని కొందరు వెలుగు సిబ్బంది కల్పతరువుగా మార్చుకున్నారు. అమాయక యానాదుల పొట్టకొడుతూ వారికి దక్కాల్సిన రుణాలను దిగమింగారు. చాలా కాలం నుంచి ఈ దందా జరుగుతున్నా అడిగేవారు లేకపోవడంతో బయటకు పొక్కలేదు. తాజాగా కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీఆర్‌డీఏ సిబ్బంది బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండల స్థాయి ఉద్యోగులు దోచుకున్న దానిలో జిల్లాస్థాయి అధికారులకు కూడా వాటాలు ఇవ్వడంతో వస్తున్న ఫిర్యాదులను పట్టించుకునేవారు కాదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క రాపూరు యానాది మండల సమాఖ్య పరిధిలో 14 యానాది గ్రామ సంఘాలు(వీవో) ఉన్నాయి. వాటి పరిధిలో పదుల సంఖ్యలో యానాది మహిళల పొదుపు గ్రూపులు ఉండగా వీరికి దక్కాల్సిన నిధులు భారీగా పక్కదారి పట్టాయి. యానాది పొదుపు మహిళల కోసం రూ.2.47 కోట్ల నిధులు ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మంజూరు కాగా అందులో వాస్తవంగా సభ్యులకు రూ.1.76 కోట్లు మాత్రమే రుణాలుగా అందించారు. మిగిలిన రూ.71 లక్షలను వెలుగు సిబ్బంది పక్కదారి పట్టించారు. ఈ విషయం తాజా విచారణలో బయటపడినట్లు తెలిసింది. రికార్డుల్లో మాత్రం రుణాలు ఇచ్చినట్లు చూపి స్తున్నారు. అయితే స్థానిక వీవోఏ, సీసీ, ఏపీఎంలే ఈ రికార్డులన్నిం టినీ మెయింటెన్ చేస్తుండటం, కనీసం ఎంత మేర రుణం మంజూరైందన్న విషయం కూడా యానాది మహిళలకు చెప్పడం లేదు. వీరిలో చాలా మంది నిరక్షరాస్యులు కావడంతో దీనిని అక్రమార్కులు అవకాశంగా మలుచుకున్నారు. ఆఖరుకు చనిపోయిన మహిళల పేరిట కూడా రుణాలు ఇచ్చినట్లు రాసి ఉన్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కొన్ని సంఘాలకు సగం నిధులు అందించగా, మరికొన్ని సంఘాలకైతే ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

తెగచర్ల యానాది సంఘంలోని మరో పొదుపు గ్రూపునకు రూ.4.10 లక్షలు ఎస్టీ సబ్ ప్లాన్ కింద రుణం మంజూరైంది. అయితే ఈ గ్రూపులోని పది మందికి ఒక్కొక్కరికి రూ.21 వేల చొప్పున రూ.2.1 లక్షలు మాత్రమే రుణం ఇచ్చారు. మిగిలిన రూ.2 లక్షలను వెలుగుసిబ్బంది స్వాహా చేశారు. కానీ పుస్తకంలో మాత్రం రూ.4.1 లక్షల రుణం ఇచ్చినట్లు నమోదు చేశారు. ఈ గ్రూపులోని ఓ సభ్యురాలు 2016లో చనిపోతే 2018లో ఆమె రుణం తీసుకున్నట్లు చూపించడం గమనార్హం.

గోనుపల్లి యానాది గ్రామ సంఘంలోని ఓ పొదుపు సంఘానికి రూ.4 లక్షలు ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రుణం మంజూరైంది. అయితే ఒక్క రూపాయి కూడా ఆ సంఘంలోని పొదుపు మహిళలకు అందలేదు. అయితే, వెలుగు సిబ్బంది మాత్రం పుస్తకాల్లో రుణం ఇచ్చినట్లు చూపిస్తున్నారు. ఈ సంఘంలోని ఓ మహిళ 2014లోనే చనిపోతే 2018లో రుణం తీసుకున్నట్లు రికార్డులో చూపిస్తుం డటం గమనార్హం.

వడ్డీ కూడా వసూలు



ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఇచ్చే రుణాలకు వడ్డీ ఉండదు. కానీ గత ప్రభుత్వంలో యానాది సంఘాల నుంచి వడ్డీలు కూడా వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఇది తీవ్ర నేరంగా అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇలా వసూలు చేసిన వడ్డీలను స్థానిక వీవోఏలకు గౌరవ వేతనంగా చెల్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వివరణ ఇస్తున్నారు. మరి వాస్తవంగా ప్రాజెక్టు నుంచి వీవోఏలకు ఇవ్వాల్సిన నెలకు రూ.8వేల గౌరవ వేతనం ఏమైందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ నిధులను స్వాహా చేసి, ఆ స్థానంలో గిరిజనుల నుంచి వడ్డీలు వసూలు చేసి గౌరవ వేతనాలు చెల్లించారా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. రాపూరు మండలంలో కొందరు సీసీలు, ఏపీఎంలు ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేయడంతోనే ఈ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు చెప్పుకుంటున్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ఉన్నతాధికారులు ఈ విషయాలన్నీ తెలిసినా పట్టించుకోకపోగా, ఇప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి సహకారమందించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క రాపూరు మండలంలోనే యానాదులకు దక్కాల్సిన నిధులు ఇంత భారీ స్థాయిలో పక్కదారి పడితే.. మరి మిగిలిన మండలాల్లో పరిస్థితేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. జిల్లాలో రాపూరుతో పాటు ఉదయగిరి, సైదాపురం మండలాల్లో యానాది సమాఖ్యలు ఉన్నాయి. రాపూరు సమాఖ్య కింద 14 గ్రామ సంఘాలు, సైదాపురం సమాఖ్య కింద 12 గ్రామ సంఘాలు, ఉదయగిరి సమాఖ్య కింద మూడు గ్రామ సంఘాలు ఉన్నాయి. వీటన్నింటి కింద సుమారు 230 పొదుపు గ్రూపులు ఉన్నాయి. మరి వీటిలోని సభ్యులకు ప్రభుత్వం నుంచి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా అందాయా? లేదా? అన్నది కూడా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

\- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	208
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 397



కాలువలో పడేసిన హుండీ

రెండు ఆలయాల్లో చోరీ

బిట్రగుంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలోని రెండు ఆలయాల్లో బుధవారం చోరీ జరిగింది. గ్రామంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో హుండీని అపహరించి అందులోని నగదు తీసుకుని కొంత దూరంలోని కాలువలో పారవేశారు. ఇత్తడి దీపపు కుందేలు, పూజా సామగ్రిని అపహరించుకెళ్లారు. అలాగే కొత్తూరు గ్రామ శివారులోని నాగవరపమ్మ ఆలయంలో కూడా చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. అమ్మవారికి సంబంధించిన వెండి పాత్రలు, పట్టుచీరలు, పూజాసామగ్రిని ఎత్తుకు పోయారని తెలిపారు. ఈ చోరీలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై భ్యాజ తెలిపారు.

న్యూస్ బాక్స్

రేపు మాలకొండలో హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కొండపైన కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీతో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనున్న సందర్భంగా ఆలయంలోని 28 హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించనున్నట్లు తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

అల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించకుంటే అదనంగా 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని ఆస్తి పన్నులు రెండు దఫాలుగా చెల్లించాల్సి ఉంటుందని, మొదటి దశలో జూన్ నెలాఖరులోగా రెండో దశలో డిసెంబరు నెలాఖరులోగా చెల్లించాలని పేర్కొన్నారు. అలా చెల్లించకుండా కాలయాపన చేస్తే 2 శాతం అదనపు రుసుముతో చెల్లించాలని పేర్కొన్నారు. బకాయి దారులు ఒకేదఫా ఈనెల 31లోపు చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

అల్లూరు, మార్చి 26 : మండలంలోని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేసి స్మార్ట్ మీటర్లు బిగింపును నిలిపివేయాలన్నారు. పెద్దల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములు లబ్ధిదారులకు అందజేసి పట్టా మంజూరు చేయాలని, నగర పంచాయతీ, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రషీద్, గోపసాని రమేష్, షేక్ కాలేషా, లక్ష్మయ్య, నేతగాని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

67వ సారి 'కండ్లగుంట' రక్తదానం



రక్తదానం చేస్తున్న మధుబాబు

కావలిటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు బుధవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో 67వ సారి రక్తదానం చేసి రక్తదాన ఉద్యమానికే స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఆయన మట్లాడుతూ రక్తదానం చేయండి.. మరొకరి ప్రాణం కాపాడండి అన్న రెడ్‌క్రాస్ నినాదంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రధానంగా యువతలో సామాజిక చైతన్యం నింపాలన్న సంకల్పంతో తరచూ రక్తదానం చేస్తున్నానన్నారు. రెడ్‌క్రాస్ బాధ్యులు, పలువురు మధుబాబును అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

లింగసముద్రం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామ శివారులో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం.నారాయణ, సిబ్బందితో కలసి దాడి చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,03,950లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్నివాల్ హంగామా

బిట్రగుంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కార్నివాల్ పేరుతో విద్యార్థులు హంగామా చేశారు. కళాశాల ఆవరణలో వివిధ రకాల షాపులు, వినోదాన్ని పంచే ఆటలతో హోరెత్తిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎన్ రెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, కార్నివాల్ సమన్వయకర్త వీ.సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వేధింపులు తగదు

● మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కావలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, ఈ వేధింపులు ఆపకపోతే పోరాటాలు చేయాల్సి వస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లాడి గోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కావలి మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేసి ఇన్‌స్పెక్టర్ల వేధింపులకు గురైన కార్మికులు వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అల్లాడి గోపాల్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను వేధించడంపై ప్రశ్నిస్తే వారిపై పనిభారం పెంచుతున్నారన్నారు. పుష్‌కార్ట్‌లను ఇద్దరు చేయాల్సి ఉండగా ఒక మహిళా కార్మికురాలితో చేయిస్తూ ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఇన్‌స్పెక్టర్లు కార్మికుల పట్ల మాట్లాడే భాష బాధాకరంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంచలయ్య, కృష్ణమోహన్, మున్సిపల్ యూనియన్ నాయకులు తురక శీనయ్య, కే.బాబు, ఒంగోలు రమేష్, క్రాంతికుమార్, చిన్నమ్మ, నారాయణమ్మ, జ్యోతి, రాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పథకం పైపులైన్ లీక్

● వృథాగా పోతున్న నీరు ● తాగునీటికి అల్లాడుతున్న ఎర్రబాలెంవాసులు

కొండాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ ఎర్రబాలెం గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పైపులైను దెబ్బతిని గ్రామానికి నీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. సుమారు 18ఏళ్ల క్రితం గ్రామానికి సమీపంలో ఉన్న ఉప్పుటేరు నుంచి దాదాపు 2 కిలోమీటర్ల దూరం సిమెంటు పైపులు వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆరు నెలల నుంచి పైపులైను మూడు చోట్లు పగిలిపోయి గ్రామానికి సక్రమంగా నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కీముకు ఏర్పాటు చేసిన మోటారుకు స్టార్టర్ లేకపోవడంతో స్థానిక రైతుల మోటార్ల స్టార్టరును బిగించి నీటి సరఫరా చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ క్రమంలో మరోసారి పైపులైను లీక్ అవ్వడంతో గ్రామంలోని 80 కుటుంబాలు నీటి సమస్యతో అల్లాడుతున్నారు. రానున్న వేసవికాలంలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకొని నీటి సమస్యకు ప్రత్యామ్నాయం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీబాషాను వివరణ కోరగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



పైపు లైను లీకై పారుతున్న నీరు

రోడ్డుపై మురుగు నిల్వ



ఉప్పలపాడులో సిమెంటు రోడ్డుపై నిలిచిన మురుగు

వలేటివారిపాలెం మండలంలోని జమీన్‌ఉప్పలపాడులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరంతా మురుగు నీరు ముదుకు కదల కాలువ పొంగి మురుగంతా సిమెంటు రోడ్డుపైకి చేరి నిల్వ చేరుతోంది. దీంతో ఆ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు ముక్కు మూసుకొని ఆ మురుగు నీటిలోనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పాటు నిల్వ చేరిన మురుగు నీటిలో దోమలు ఉత్పత్తి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. మురుగు కాలువల్లో చెత్తతో పాటు గడ్డి కూడా పెరుగుతోంది. అయినా కాలువలను శుభ్రం చేయించడంపై పంచాయతీ పాలకులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్యం నిర్వాహణకు ప్రభుత్వం లక్షలు ఖర్చు చేస్తున్నా ఇక్కడ మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. పాలకులు, అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

\- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)

'ఉపాధి' బకాయిలు రూ.80 లక్షలు



పంట కాలువ పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

లింగసముద్రం మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు వెళుతున్న కూలీలకు ఈ ఏడాది జనవరి 9వ తేదీ నుంచి ఇప్పటి వరకు రూ.80 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. 10 వారాలుగా చేసిన పనులకు కూలి డబ్బులు రాకపోవడంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. కేవలం ఉపాధి పనులకు మాత్రమే వెళ్లే సుమారు 1500 మందికి డబ్బులు చెల్లించడంలో జాప్యంతో నిత్యావసర సరుకులు, మందులు, ఇతర చిన్న చిన్న ఖర్చులు, కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఏపీవో షేక్ సమీర్‌బాషాను వివరణ కోరగా కూలీలకు రావాల్సిన డబ్బులు వచ్చే నెల మొదటి వారంలో వచ్చే అవకాశం ఉందని, డబ్బులు వచ్చిన వెంటనే కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ప్రతి రోజూ 1500 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారని, వచ్చే నెల 1వ తేదీ నుంచి కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు.

\- లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)

అడుగడుగునా గుంతలే..!



అధ్వానంగా కొండసముద్రం-ఉప్పలపాడు రోడ్డు

వలేటివారిపాలెం మండలంలోని ఉప్పలపాడు నుంచి కొండసముద్రం వెళ్లే గ్రావెల్ రోడ్డుపై అడుగడున మోకాటిలోతు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతోన్నాయి. ద్విచక్ర వాహనదారులు మోకటిలోతు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు కళవళ్ల, నలదలపూరు, కొండారెడ్డిపాలెం, శాఖవరం, కొండసముద్రం తదితర గ్రామాల ప్రజలు నిత్యం ద్విచక్రవాహనాలలో ఈ మార్గంలోనే రావాలి. వారంతా ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు రహదారికి రెండు వైపులా ముళ్లచెట్లు కమ్మేశాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు గ్రావెల్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చించి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

\- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ విజయం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కార్యకర్తే అధినేత కార్యక్రమంలో భాగంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతి కార్యకర్తను కలిసి వారి సమస్యలు పరిష్కరించాలని పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి వారికి అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశం పార్టీ సొంతమని, ఇటీవల కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పదవుల్లోను పార్టీ కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధు, వడ్డెళ్ల రవిచంద్ర, ముచ్చు శ్రీను, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, లక్ష్మీరాజ్యం, శైలజ పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడేవారిపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ బిల్డర్ పులి మాల్యాద్రి చిత్రపటానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కౌలు రైతు రక్షణ చట్టం తేవాలి : రైతు సంఘం

కావలిటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీల్లో భాగంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం కౌలు రైతు రక్షణ కోసం నూతన కౌలు రైతు చట్టం తేవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బుడమగుంట సచివాలయంలో కౌలు రైతులతో కలిసి వినతిపత్రం అందజేరు. వారు మాట్లాడుతూ రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేదని, కొనగోలు కేంద్రాల్లో అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్టర్లలో కూడా కౌలు రైతుల పేర్లు నమేదు చేయడంలేదన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న కౌలురైతులకు గుర్తింపు కార్డులు లేకపోయినా పంచనామా రిపోర్టు ఆధారంగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టం లేనందున నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో రహదారి

● పట్టించుకోని అధికారులు



బ్రిడ్జి సెంటర్‌లో రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలు

కావలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో రోడ్డు ఆర్జిన్లు ఆక్రమణలకు గురవుతున్నా మున్సిపల్, పోలీస్ అధికారులు పట్టించుకోవటం లేదు. బ్రిడ్జి సెంటర్‌లో దక్షిణం వైపు అప్రోచ్ రోడ్డును ఆక్రమణదారులు పూర్తిగా ఆక్రమించినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఉత్తరం వైపున విశాలంగా ఉన్న అప్రోచ్ రోడ్డులో డ్రైనేజీ దాటి దుకాణదారులు రేకులు వేసుకుని ముందుకువచ్చి ఉన్నారు. ప్రస్తుతం రోడ్డు మీదకు ఆక్రమణదారులు పండ్ల విక్రయానికి చెందిన తోపుడు బండ్లు పెట్టారు. దానిని తొలగించకపోతే మిగిలిన వారందరు తమ దుకాణాల వద్ద మరొకరికి అద్దెకిచ్చి ఇలా రోడ్ల మీద ఆక్రమణలను ప్రోత్సహించే ప్రమాదం ఉంది. దీంతో అక్కడ ద్విచక్ర వాహన దారులు మరీ రోడ్డు మీద పార్కు చేయాల్సి రావటంతో ప్రయాణికులు రోడ్డు మీదనే బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. దీంతో వంతెనపై వచ్చే వాహనాల నుంచి రోడ్డుపై నిరీక్షించించే ప్రయాణికులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గతంలో అక్కడ నిలబడి ఉన్న వ్యక్తులపై వాహనాలు దూసుకు వచ్చి మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. పోలీస్, మున్సిపల్ అధికారులు అక్కడ రోడ్డుపైకి ఆక్రమణలు రాకుండా చర్యలు చేట్టాల్సి ఉంది.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

బిట్రగుంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేసి ఆయన కుటుంబ సభ్యులకు, క్రైస్తవులకు న్యాయం జరిగేలా చూడాలని బోగోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దారు సురేష్‌బాబుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ శ్యాంసన్‌బాబు, పలు సంఘాల పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్, డీఎం కాలువల అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

బిట్రగుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఆర్, డీఎం కాలువల అభివృద్ధి పనులను అడ్డుకోవడం మంచిది కాదని టీడీపీ నాయకులు మండిపడ్డారు. బోగోలు పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, రైతు నాయకులు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, ముంతాల వెంకయ్యలు మాట్లాడుతూ నాలుగు మండలాల రైతులకు ఉపయోగపడే డీఆర్, డీఎం కాలువల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ పాలనలో బీద రవిచంద్ర నిధులు మంజూరు చేయించారన్నారు. ఆ నిధులతో చేసిన పనులకు గత ప్రభుత్వం బిల్లులు చేయకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిపివేశారని తెలిపారు. ప్రస్తుత కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కాంట్రాక్టరును ఒప్పించి పనులు చేయిస్తుంటే వాటిని అడ్డుకోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎల్.సుధీర్‌బాబు, కాంద్ర రఘురామ్ నాయుడు, పుట్టా సుబ్బారావు, అనంగి ఆదిశేషయ్య, బోగిరి ప్రభాకర్, మద్దిబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు

కందుకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పట్టణంలోని నాంచారమ్మ కాలనీకి చెందిన దాసరి మధుసూదనరావుకు సీఎం సహాయనిధి నుంచి వైద్యఖర్చుల కోసం రూ.7లక్షలు మంజూరైంది. దానికి సంబంధించిన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం బాధితుడి భార్య జ్యోతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అత్తంటి శివకృష్ణ, చిలకపాటి మధు, గుమ్మా శివ, చుండూరి శ్రీను, చుండూరి వేణు తదితరులు పాల్గొన్నారు.

29న మున్సిపల్ షాపుల లీజుకు వేలం

కందుకూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత లారీస్టాండ్ ఆవరణలో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ గదులలో ఖాళీగా ఉన్న మూడు షాపులకు ఈనెల 29న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 1వ నెంబరు గది ఎస్టీలకు, 13, 15వ నెంబరు గదులు జనరల్ కేటగిరికి రిజర్వ్ అయి ఉన్నాయని, ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆమె తెలిపారు.

కోడి పందేలపై చర్యలు తీసుకోండి

కావలి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుగానిపాలెం, గౌరవరంలో ప్రతి ఆదివారం జోరుగా సాగుతున్న కోడి పందేల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ పందేలు నిర్వహిస్తుండటంతో యువత కూడా పందేలకు ఆకర్షితులవుతున్నారన్నారు. గ్రామాల్లో వివాదాలు చోటుచేసుకొంటున్నాయని, పోలీసులు నిఘా ఉంచి కోడి పందేల నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'రాళ్లపాడు'కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

● డ్యాంతోపాటు కార్యాలయాలు పరిశీలించిన ఈఈ మునిరత్నం



ప్రాజెక్టు పాత స్పిల్‌వే హయ్యస్ట్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఈఈ మునిరత్నం

లింగసముద్రం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు గేట్లు, బ్రిడ్జి రోడ్డు తదితర నిర్వహణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రాజెక్టు నూతన ఈఈ మునిరత్నం అధికారులను ఆదేశించారు. ఒంగోలు ఎన్‌ఎస్పీలో డీఈగా పనిచేస్తూ పదోన్నతిపై రాళ్లపాడు ప్రాజెక్టు ఈఈగా నియమితులైన ఆయన బుధవారం రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. సబ్ డివిజన్ కార్యాలయాలు, అతిథిగృహం, పాత కొత్త స్పిల్‌వేలలోని గేట్లు, హయ్యస్ట్ బ్రిడ్జిలను, కుడి, ఎడమ కాలువలను పరిశీలించారు. రెండు స్పిల్‌వేల గేట్ల పనితీరును డీఈ ఎం.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది కొరత గురించి ఆరా తీశారు. ప్రాజెక్టుకు నీటి లభ్యతపై తెలుసుకున్నారు. కాగా ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టులో వరి కోతలు దాదాపు పూర్తయ్యాయని, ఈ నెలాఖరుకు నీరు నిలుపుదల చేయాలని ప్రాజెక్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర రావు, కాలువల నీటి సంఘాల అధ్యక్షులు సుబ్బారావు, బుచ్చయ్య చౌదరిలు ఈఈ మునిరత్నంను కోరారు. వచ్చే నెల 15 లోపు పత్తి పైరుకు రెండు విడతల నీరు ఇస్తే సరిపోతుం దని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఈలు నవీన్, మనోహర్‌లు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు, ఆర్టీసీ అధికారులు

కందుకూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కందుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1973-74 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల బృందం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని విశ్రాంత కంట్రోలర్ అచ్యకాల పద్మారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ నెల్లూరు ఆర్‌ఎం ఎం.మురళీబాబు, డీఎంఆర్. శ్రీనివాసరావు, పూర్వవిద్యార్థుల బృందం మంచిరాజు మురళి, ఎం.ఉమామహేశ్వరరావు, సందానీబాషా, గోనుగుంట సుబ్రహ్మణ్యం, తుమ్మపూడి సుబ్బయ్య, అక్కుల ఉమామహేశ్వరరావు, తటవర్తి సత్యం, ఏకాంబరం సత్యనారాయణ, ముష్తాక్ అహ్మద్, చలువాది సత్యం తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌కు మెలిక

- రైతులను వెంటాడుతున్న ఇనాం భూముల సమస్య
- రీసర్వేలో అవి పట్టా భూములుగా రూపాంతరం
- గతంలో రిజ్రిస్టేషన్‌కు అర్హత ఉన్నా నేడు ఎందుకీ అభ్యంతరం
- అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అంగడి మహబూబ్ బాషా. స్వగ్రామం అల్లూరు. ఇతని తల్లి పేరిట బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ సర్వేనెంబరు 1018, 1019లలో 5.21 ఎకరాల భూమి ఉంది.ఆయన అవసరం నిమిత్తం కొంత భూమిని ఇతరులకు విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ నిమిత్తం కావలి సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లాడు. ఇది ఇనాం భూమి కావడంతో రిజిస్ట్రేషన్‌కు వీలుకాదని తేల్చిచెప్పాడు. దీంతో అతనికి, కొనుగోలుదారుడికి మధ్య సమస్య ఏర్పడింది. దీంతో అతను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు.

అల్లూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇనాం భూములపై సమస్యలు నేటికీ రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. రీసర్వేతో వెబ్‌ల్యాండ్‌లో వాటికి మోక్షం కలిగి, పట్టా భూములుగా చలామణి అయ్యే సమయం వచ్చిందని రైతులంతా సంబరపడ్డారు. అయితే మేజర్ పంచాయతీలు, పట్టణాల్లో రీసర్వేను నిలుపుదల చేయడంతో ఇనాం భూముల సమస్య అలానే ఉంది.దీంతో రైతులు తమ భూములను విక్రయించుకునేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లిన సమయంలో అధికారులు మోకాలడ్డుతున్నారు. తమకు ఉత్తర్వులు ఉన్నాయని, వాటిననుసరించి రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు పడదని వారు తేల్చి చెప్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 45 వేల ఎకరాలకుపైగా ఇనాం భూములు ఉండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

● రీసర్వేతో విముక్తి జరిగిందనుకుంటే..

ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో ఇనాం భూములకు విముక్తి లభించింది. రీసర్వే ద్వారా మార్పు పొంది పట్టా భూములుగా రూపాంతరం చెందిన ఇనాం భూములను స్వేచ్ఛగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇవే భూములను గతంలో రిజిస్ట్రేషన్‌కు అనుమంతించకపోయినా, రీసర్వే అనంతరం అనుమతించాల్సి వస్తోంది. రీసర్వే జరగని గ్రామా ల్లోని ఇనాం భూములు రిజిస్ట్రేషన్‌కు ఎందుకు నోచుకోవడంలేదు.



వెబ్‌ల్యాండ్‌లో భూమి స్వభావం 'ఇనాం' అని ఉన్న అడంగల్ కాపీ

● కోర్టుల్లో కేసులు

ఇనాం భూములను పట్టా భూములుగా పరిగణించాలంటూ పలువురు రైతులు కోర్టుల్లో కేసులు వేశారు. వాదనలు కూడా జరిగాయి. అయినా ఇనాం భూములను రికార్డుల్లో ఉన్న కాలమ్‌లోని ఇనాం పదాన్ని తొలగించేందుకు సాహసం చేసేవారు లేకపోవడంతో ఆ సమస్య నేటికీ రైతులను వెంటాడుతోంది.

● రిజిస్ట్రేషన్ చేయాల్సిందే..

వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఇనాం భూమి అని ఉన్నా, కోర్టులు, ప్రభుత్వాలు వాటిని పట్టా భూములుగానే పరిగణించమని ఆదేశాలు ఇచ్చాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు. నిషేధిత జాబితాలో లేవు కాబట్టి వాటిని రిజిస్ట్రేషన్ చేయాల్సిందేనని వారు అంటున్నారు. అయినా రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం ఇప్పటికీ అనుమతించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



రిజిస్ట్రేషన్‌కు ఎందుకు వీలుపడదు ?

పలు గ్రామాల్లో భూములను రీసర్వే చేశారు. ఇనాం భూములుగా ఉన్న వాటిని పట్టా భూములుగా మార్పు చేశారు. గతంలోనే కోర్టు ఉత్తర్వులు ఉన్న క్రమంలో ఇనాం భూములు ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడంలేదో అర్థం కావడం లేదు. మాబోటివారు అవసరాల నిమిత్తం భూములను విక్రయించుకోవాలంటే సమస్యలు ఎదురుకుంటున్నాం.

- పప్పు సుధాకర్, రైతు, అల్లూరు

సమస్య తీరడం మంచి పరిణామం



రీసర్వేతో ఇనాం భూముల సమస్య తీరడం మంచి పరిణామం. దశాబ్దాల కాలంగా ఈ సమస్యతో సతమతమవుతున్న రైతులకు ఇనాం అని రికార్డుల నుంచి తొలగిపోయి పట్టా భూమిగా మార్పు చెందితే మేలు జరిగినట్టే. ఇలా అన్నీ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేస్తే ఈ సమస్య పూర్తిగా సమసిపోయినట్టే.

- అనంతరాజు బాలకృష్ణంరాజు, అల్లూరు

టెన్త్ పరీక్షలకు 28,557 మంది హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 174 కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో బుధవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించారు. 28,845 మంది విద్యార్థులకుగాను 28,557 మంది హాజరు కాగా 288 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకుడు రవీంద్రనాథ్ రెడ్డి 4 కేంద్రాలను, డీఈవో డాక్టర్ బాలాజీరావు 3 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ 32 కేంద్రాలను పరిశీలించారు. ఇక, ఓపెన్‌స్కూల్ పరీక్షల్లో భాగంగా బుధవారం సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్ష జరిగింది. 1518 మంది అభ్యాసకులకు గాను 1296 మంది హాజరుకాగా 222 మంది గైర్హాజరైనట్లు డీఈవో పేర్కొన్నారు.



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

● వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ

సైదాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తోందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం సైదాపురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం పొదుపు మహిళలకు ఆసరా బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.39.22 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు సకాలంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. తమ సమస్యలను తెలుపుకునేందుకు జనం తరలిరావడంతో ఎమ్పీడీవో కార్యాలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వివిధ సమస్యలపై 181 అర్జీలు అందాయి. స్థానిక గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం, శివకుమార్, తహసీల్దార్ రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇంచార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి, నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, వరిగొండ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ నాలుగో విడత మూల్యాంకనం ప్రారంభం

● 1,200 మంది అధ్యాపకుల హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష పత్రాల నాలుగో విడత మూల్యాంకనం బుధవారం మొదలైంది. నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమైనట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు తెలిపారు. మూల్యాంకనం విధులకు 1200 మంది అధ్యాపకులు హాజరుకాగా వీరికి అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ఇప్పటికే తెలుగు, హిందీ, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ మూల్యాంకనం పూర్తి కాగా మిగిలిన సబ్జెక్టులను ఏప్రిల్ మొదటి వారంలోగా పూర్తి చేస్తామన్నారు.

వివిధ రకాల బొమ్మల కార్డులను చూపుతున్న తల్లి



పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న సామెత ఆ బుడతడికి అచ్చంగా సరిపోతుంది. తల్లిపాలు తాగే వయసులో ఆ తల్లి తర్ఫీదుతో అమోఘమైన తెలివితేటలను ప్రదర్శిస్తున్నాడు. ఆరు మాసాలకే అద్వితీయ ప్రతిభను చాటుతూ నోబుల్ వరల్డ్ రికార్డు దక్కించుకున్నాడు. ఆ చిన్నారే నెల్లూరుకు చెందిన చందలూరి వీరు, ఊహల కుమారుడు వీర శ్రేయాస్.

ఆరు నెలలే... అన్నీ గుర్తుపట్టేస్తాడు!

- ఈ బుడతడు భలే మేధావి
- తల్లి శిక్షణలో అమోఘ ప్రతిభ
- చిన్నారి వీర శ్రేయాస్‌కు నోబుల్ వరల్డ్ రికార్డు
- ప్రత్యేకంగా అభినందించిన కలెక్టర్ ఆనంద్



నోబుల్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్, మెడల్స్‌తో చిన్నారి, తల్లిదండ్రులు

నెల్లూరు (వైద్యం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్టలో నివసించే వీరు వ్యాపారం చేస్తుంటారు. ఆయన భార్య ఊహ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రక్తనిధిలో టెక్నీషియన్‌గా చేస్తున్నారు. వారి కుమారుడు ఆరు నెలల వీర శ్రేయాస్‌కు బుర్రంతా తెలివితేటలే. బిడ్డ తెలివితేటలు గమనించిన ఊహ ప్రత్యేకంగా శిక్షణ ఇస్తోంది. పక్షులు, కూరగాయలతో కూడిన బొమ్మల కార్డులను చూపిస్తూ వాటి పేర్లు చెబుతుంది. ఆ తర్వాత ఫలానా పేరు గల కార్డు ఏదని అడుగుతుంది. వెంటనే ఆ చిన్నారి తన చిట్టి చేతులతో అమ్మ చెప్పిన పక్షి, కూరగాయల కార్డును కచ్చితంగా గుర్తుపట్టి దాన్ని పట్టుకుంటాడు. ఇందులో ఎక్కడా తడబాటు అనేది ఉండదు. ఒకటి.. రెండు సార్లు ఎన్నో సార్లు ఇలా చేసిన తర్వాత తమ బిడ్డ బాలమేధావి అని నిర్ధారించుకుంది. నోబుల్ వరల్డ్ రికార్డు నిర్వాహకులు కూడా పాలబుగ్గల ఆ పసివాడు మేధావే నంటూ అవార్డు, మెడల్స్ కూడా అందచేశారు. ఇటీవల ఆ చిన్నారితో తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిశారు. శ్రేయాస్ తెలివితేటలకు కలెక్టర్ కూడా సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.

మూడు నెలల నుంచే శిక్షణ

తన కుమారుడు వీర శ్రీయాన్‌కు మూడు నెలల వయసుకే ప్రత్యేక తెలివితేటలు ఉన్నట్లు గుర్తించాము. దీంతో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాను. కూరగాయలు, పక్షుల ఫొటోల కార్డులను చూపించి వాటిని వివరించే దాన్ని. ఆ తర్వాత అడిగిన వాటిని వెంటనే గుర్తు పట్టేవాడు. దీనిని గుర్తించి నోబుల్ వరల్డ్ రికార్డు రావడం సంతోషంగా ఉంది.

- ఊహ



కలెక్టర్ ఆనంద్ నుంచి అవార్డు అందుకుంటున్న తల్లిదండ్రులు

నాడు మల్లితోట ప్రధాన రహదారి బురదమయంగా..



పల్లెల్లో సీసీ రోడ్ల కళ

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక పల్లెలు పూర్తి వసతులను సంతరించుకొని శోభిల్లుతున్నాయి. వైసీపీ హయాంలో చిన్నపాటి పనులు చేపట్టినా బిల్లులు రావన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు చొరవ చూపలేదు. అయితే, టీడీపీ హయాంలో పనుల్లో వేగం పెరిగింది. కలిగిరి పట్టణంలో రద్దీ ప్రాంతమైన మల్లితోట ప్రధాన రహదారి ఒకప్పుడు బురదమయంగా ఉండేది. ఈ ప్రాంతంలోని ప్రజలు, దుకాణాదారులు గత వైసీపీ పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ప్రజలు పడుతున్న అవస్థలను పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బురదరోడ్డును కాస్త సీసీరోడ్డుగా మార్చారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)



నేడు సీసీ రోడ్డు పనులు పూర్తయి..

ఈ-శ్రమ్ క్లెయిమ్‌లకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సురక్ష ప్రమాద బీమా యోజన కింద 2023 ఆగస్టు వరకు ప్రమాదానికి గురైన అసంఘటిత రంగ కార్మికులు క్లెయిములను పొందచ్చునని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2021లో ప్రారంభమైన ఈ పథకం కింద అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ కార్డులు పొందారని తెలిపారు. పరిహారం కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

వికసిత్ భారత్‌కు 10 మంది విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత తదితరులు

వెంకటాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరిగిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025కు 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీఎస్‌యూలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావుతో కలిసి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపికైన 10 మందిని వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి, దేశస్థాయిలో జరిగే వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఎంపికైన 10 మంది విద్యార్థులు ఈనెల 28న గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రొఫెసర్ విజయానంద్‌కుమార్‌బాబు, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

కలువాయి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలసి కాలనీ సమీపం లోని కంకర క్వారీలో ఈతకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం కలువాయి మండలం కేశమ నేనిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గిరిజన కాలనీకి చెందిన ఏలూరు పెంచలప్రసాద్ (18) స్థానిక ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. పాఠశాలకు ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నానికి విధులు ముగించుకుని ఇంటికి చేరాడు. స్నేహితులందరూ ఈతకు వెళ్లారని తెలుసుకుని పెంచలప్రసాద్ కూడా క్వారీ గుంతలో ఈతకు దిగాడు. కొంతదూరం ఈత కొట్టి మునిగిపో తూ కేకలు వేశాడు. గమనించిన స్నేహితులు అతడిని కాపాడే ప్రయత్నం చేశారు. వీలుకాకపోవ డంతో వారు కాలనీ వాసులకు తెలిపారు. గల్లంతైన యువకుడి కోసం రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా దొరకలేదు.

సోమశిలలో 53.997 టీఎంసీల నీరు

అనంతసాగరం : సోమశిల జలాశయంలో బుధవారం నాటికి 53.997 టీఎంసీలు నిల్వఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

డ్రైవింగ్‌లో డ్రైవర్‌కు అస్వస్థత

● సమయస్ఫూర్తితో బస్సు నిలిపివేత ● ప్రయాణికులు సురక్షితం



ఆర్టీసీ డ్రైవర్ అహ్మద్ బాషా

సంగం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న బస్సులో డ్రైవర్ అస్వస్థతకు గురయ్యాడు. అయితే, ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సును ఆపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం సంగం మండలంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం సాయంత్రం నెల్లూరు నుంచి కొండాపురానికి బయలు దేరింది. మార్గమధ్యంలో సంగం రహదారి కూడలిలోకి వచ్చేసరికి డ్రైవర్ అహ్మద్ బాషా అస్వస్థతకు గురయ్యాడు. ఎంతో చాకచక్యంగా వ్యవహరించి బస్సును కూడలిలో నిలిపివేశాడు. తనకు చెమటలు పడుతున్నాయని, కళ్లు తిరుగుతున్నాయని తెలపడంతో కండక్టర్, ప్రయాణికులు డ్రైవర్‌ను హుటాహుటిన స్థానిక వైద్యశాలకు తరలించారు. అప్పటికే బట్టల్లో మలమూత్రం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పరిక్షించిన వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు. ప్రయాణికులను కండక్టర్ మరో బస్సులో ఎక్కించి పంపించారు.

ఫాప్టో జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం



నూతనంగా ఎంపికైన ఫాప్టో జిల్లా కమిటీ

నెల్లూరు(విద్య), మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్స్(ఫాప్టో) జిల్లా కార్యవర్గం ఎంపికైంది. నగరంలోని దర్గామిట్ట మున్సిపల్ స్కూల్లో బుధవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కే మధుసూదన్‌రావు (ఏపీటీఏ), ప్రధాన కార్యదర్శిగా షేక్ జావీద్ (ఆర్‌యూటీఏ), కో చైర్మన్లుగా మురళీకృష్ణ (డీటీఎఫ్), మాన ప్రసాద్(బీటీఏ), ఎస్ భాస్కర్‌రెడ్డి(ఏపీహెచ్ఎంఏ), డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా వీవీ శేషులు (యూటీఎఫ్), కే నరసింహం(ఎస్టీయూ), సీహెచ్ హజరత్ (ఏపీటీఎఫ్), ఎం పిచ్చిబాబు (ఏపీటీఎఫ్-38) ఎంపికయ్యారు. ఎన్నికల పరిశీలకుడు ఎన్వీ రమణయ్య మాట్లాడుతూ నూతన కమిటీ కాలపరిమితి రెండేళ్లని, ఈ సమయంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేసి హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాప్టో మాజీ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఉపా ధ్యాయ సంఘాల నాయకులు ఏడుకొండలు, చలపతి శర్మ, మణి సుబ్బు, దశరథ రాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎవరు వీళ్లు.. ఎక్కడ నుంచి వచ్చారు!









చింపిరి జుట్టు.. మాసిన దుస్తులు.. నడిరోడ్డుపై ఎటువెళతారో తెలియదు.. ఏవేవో మాట్లాడుకుంటూ తిరుగుతారు.. అడ్డొచ్చినవారిపై దాడి చేసేంత పని చేస్తారు. ఇంతకూ వీళ్లు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారో తెలియదు. మతిస్థిమితం కోల్పోయిన కొంతమంది నెల్లూరు నగరంలో ప్రత్యక్షమవుతున్నారు. ప్రధాన కూడళ్లు, డివైడర్ల మధ్య, పాడుబడిన భవనాలు, రాత్రిపూట మూత బడిన షాపుల ముం దు వీరి ఆవాసాలు. అటు ఇటు తిరుగుతూ దొరికింది తింటూ కాలం వెళ్ల దీస్తున్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్పందించి వారికి వైద్యసేవలు అందిస్తే సాధారణస్థితికి చేరుకుంటారు.



- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)